thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 110 | కరీంనగర్ ఆదివారం, 29 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.



## ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు డేట్ ఫిక్స్

# రథసారథుల ఎంపికకు వేళాయె!

## జులై 1న తెలుగు రాష్ట్రాల భాజపా అధ్యక్షుల ఎన్నిక!

హైదరాబాద్: భాజపా సంస్థాగత ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. తెలుగు రాష్ట్రాల అధ్యక్షుల నియామకాలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఒకే రోజు అధిష్ఠానం అధ్యక్షులను ప్రకటించనుంది. భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రకటన విడుదల చేసింది.

**ఏపీలోనూ..** భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని అధిష్ఠానం నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. జూలై 1వ తేదీన పార్టీ నూతన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. 30వ తేదీన నామినేషన్ స్వీకరణ.. అదే రోజు సాయంత్రంలోపు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.

**తెలంగాణ బీజేపీ అధ్యక్ష పీఠం రేసులో ఉన్నది వీరే..** తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కీలక నిర్ణయాలను తీసుకుంటోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలను ఎవరికి అప్పగించాలనే విషయంపై దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. ఫైర్ బ్రాండ్ ముద్ర ఉన్న బలమైన నాయకుడికి చేతికి బీజేపీ తెలంగాణ రాష్ట్రశాఖ పగ్గాలు అందడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతు పుష్కలంగా ఉన్న నాయకుల పేర్లను షార్ట్ లిస్ట్ చేసినట్లు చెబుతున్నారు. సామాజిక వర్గ సమీకరణాలను సైతం దీనికి ప్రాతిపదికగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన వారసుడిని పార్టీ ఎంపిక చేయాల్సి ఉంది. దీనికోసం సీనియర్ నేతల పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందర్ రావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, చింతల రామచంద్రారెడ్డి, మురళీధర్ రావు పేర్లు వినిపిస్తోన్నాయి. మహిళను పార్టీ అధ్యక్షురాలిగా చేయాలనుకుంటే మహబూబ్ నగర్ లోక్ సభ సభ్యురాలు డీకే అరుణకు ఆ అవకాశం దక్కుతుందని సమాచారం. రామచంద్ర రావుతో పాటు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్.. ఈ పదవి కోసం ఫ్రంట్ రన్నర్లుగా నిలిచారు. మహిళా నాయకత్వం వైపు మొగ్గు చూపితే డీకే అరుణను ఖరారు చేయవచ్చని అంటున్నారు. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం తెలంగాణలో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి పేరును ఖరారు చేస్తారని చెబుతున్నారు. అనుభవం ఉన్న వారికి పార్టీ పగ్గాలను ఇవ్వాలనుకుంటే ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డిని కొనసాగించడం లేదా మళ్లీ బండి సంజయ్ కు ఆ హెూదాను అప్పగించడం బీజేపీ అధిష్ఠానం ముందు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు. కిషన్ రెడ్డి అదే పదవిలో కొనసాగడానికి పెద్దగా ఇష్టపడట్లేదనే ప్రచారం ఉంది. కొత్త వారిని ఎంపిక చేయాలనుకుంటే ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రాంచందర్ రావు లేదా డీకే అరుణల్లో ఒకరిని పార్టీ అధ్యక్ష పీఠం వరిస్తుంది. ఈ నలుగురిలో కూడా ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న వారిని ఎంపిక చేయడానికే పార్టీ అగ్రనాయకత్వం మొగ్గు చూపుతుది. ఆ పరిస్థితే వస్తే ధర్మపురి అరవింద్, రాంచందర్ రావులల్లో ఒకరి పేరు ఖరారవుతుంది.

**ఎవరిదో పై చేయి... ఏపీ బీజేపీ కేంద్ర నాయకత్వం వ్యూహం మారుస్తుందా?...** ఆంధ్రప్రదేశ్ బీజేపీకి కొత్త నాయకత్వం రాబోతుందా? బీజేపీ కేంద్ర నాయకత్వం వ్యూహం మారుస్తుందా? చిన్నమ్మను తప్పిస్తుందా? కొత్త వ్యక్తికి పగ్గాలు అప్పగించనున్నారా? అంటే అవుననే అంటున్నారు.

**కేంద్ర నాయకత్వం ఆలోచన...?...** ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంద్రీశ్వరిని కొనసాగిస్తారా? లేక కొత్త వ్యక్తికి బాధ్యతలను అప్పగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే బీజేపీ కేంద్ర నాయకత్వం ఆలోచన ఎలా ఉందన్నది ఆసక్తికరంగానూ ఉత్కంఠతతోనూ ఉంది. 2024 ఎన్నికల్లో పురంద్రీశ్వరి బీజేపీ అధ్యక్షురాలిగా ఉండటంతో కూటమి ఏర్పడింది. పొత్తులు సజావుగా జరిగాయి. అయితే పురంద్రీశ్వరి పదవీ కాలం పూర్తి కావడంతో ఖచ్చితంగా తిరిగి అధ్యక్ష ఎన్నిక జరగాల్సి ఉంది. బీజేపీలో ఓటర్ల జాబితాను కూడా నేడు విడుదల చేయనున్నారు. ఎన్నిక నామమాత్రమేనని, కేంద్ర నాయకత్వం ఇప్పటికే ఒకపేరును ఖరారు చేసి ఉంటుందన్న ప్రచారం మాత్రం జరుగుతుంది.

**రెండు వర్గాలుగా...** ఎవరు అవునన్నా కాదన్నా ఏపీ బీజేపీలో రెండు గ్రూపులున్నాయి. ఒకటి చంద్రబాబు వ్యతిరేక వర్గం కాగా, మరొకటి అనుకూల వర్గం. ఒకవర్గం చంద్రబాబు తో పొత్తు కారణంగానే రాష్ట్రంలో ఎదగలేకపోతున్నామని భావించే వారుండడగా, టీడీపీ మద్దతు లేకుండా సింగిల్ సిటు కూడా గెలవలేని పరిస్థితుల్లో కలసి నడవడమే మంచిదన్నది మరొకవర్గం అభిప్రాయం.

భిన్నాభిప్రాయా లతో రెండు వర్గాల్లో ఎప్పటి నుంచో ఉన్నాయి. అయితే ఇప్పుడు ఏ వర్గానికి చెందిన వారు బీజేపీ అధ్యక్షుడవుతారన్నది కూటమి పార్టీల్లోనూ టెన్షన్ నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది ఈ ఎన్నిక ద్వారా అర్థమవుతుందని, జగన్ పార్టీ నేతలు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తం మీద జరిగేది బీజేపీ అధ్యక్ష ఎంపిక అయినా ఏపీ రాజకీయాల్లో మాత్రం భవిష్యత్ పరిణామాలను సూచిస్తుందని చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?




## మోదీకి ధర్మ చక్రవర్తి బిరుదు ప్రదానం

న్యూఢిల్లీ: జైన సన్యాసి ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహరాజ్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి 'ధర్మ చక్రవర్తి' బిరుదును శనివారంనాడు ప్రదానం చేశారు. ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహరాజ్‌కు ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ నివాళికి నాంది పలుకుతూ ఈ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జైన నేత ఆధ్యాత్మిక, పండిత వారసత్వాన్ని స్మరించుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఢిల్లీలోని భగవాన్ మహావీర్ అహింసా భారత్ ట్రస్టు సహకారంతో ఈ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ధర్మ చక్రవరి బిరుదును ప్రధాని స్వీకరిస్తూ, తనను తాను ఈ బిరుదుకు అర్హుడనని భావించడం లేదని, అయితే సాధువుల నుంచి ఏది స్వీకరించినా దానిని ప్రసాదంగా స్వీకరించాలనేది మన సంస్కృతి అని చెప్పారు. ఈ ప్రసాదాన్ని తాను వినయంగా స్వీకరిస్తూ తల్లి భారతికి అంకితమిస్తున్నానని అన్నారు. ఆచార్య విద్యానంద్ జీ 1987 జూన్ 28న 'ఆచార్య' బిరుదును అందుకున్నారని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇది కేవలం గౌరవం కాదని, జైన సంస్కృతిని సంయమనం, కరుణతో అనుసంధానించే పవిత్ర ధార అని అన్నారు. క్రమశిక్షణ, సన్యాసి జీవితాన్ని గుర్తుచేసే వేడుకలు ఇవని పేర్కొంటూ ఆచార్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహరాజ్ స్మారక పోస్టల్ స్టాంపును ప్రధానమంత్రి మోదీ, కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ విడుదల చేశారు. దీనికి ముందు 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహరాజ్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మోదీ, షెకావత్ సందర్శించారు. ఆచార్య ఆధ్యాత్మిక ప్రయాణంలోని కీలక ఘట్టాలను గుర్తు చేసే కుడ్యచిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.




దేశవ్యాప్తంగా వచ్చే రెండు, మూడు రోజుల్లో మళ్లీ వానలు కురియనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో కోంకణ్ - గోవా, మధ్య మహారాష్ట్ర గాట్ ప్రాంతాలు, గుజరాత్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియనున్నాయి. అలాగే హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్ (జూన్ 29 నుంచి జూలై 2), తూర్పు రాజస్థాన్, విదర్భ ప్రాంతాల్లో కూడా వర్షాలు పడే అవకాశముంది.

**తెలుగు రాష్ట్రాల్లో...** ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలను కూడా నైరుతి రుతుపవనాలు కప్పేశాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ ఓ కీలక ప్రకటన చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నెమ్మదిగా బలహీనపడుతోందని తెలిపింది. అయితే దీని ప్రభావంతో వచ్చే 3 రోజులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రాంతాన్ని బట్టి తక్కువ నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్సుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సముద్రతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెదర్ రిపోర్ట్ సూచించింది.

**ఈ ప్రాంతాల్లో మాత్రం..** ఐఎండీ ప్రకారం జూన్ 29 నుంచి జూలై 2 వరకు ఉత్తర ప్రదేశ్‌లో వానలు పడనున్నాయి. జూన్ 27 నుంచి జూలై 3 వరకు మధ్యప్రదేశ్‌లో, జూలై 1, 2న ఛత్తీస్‌గఢ్‌లో, జూన్ 29, 30న పశ్చిమ బెంగాల్‌లో, జూన్ 30 నుంచి జూలై 1న ఒడిశాలో, జూన్ 29న ఝార?ండ్‌లో వర్షాలు కురియనున్నాయి. కేరళలో ఈరోజు భారీ వర్షాలు పడనున్నాయి.

## రాడ్లు, కర్రలు, బండరాళ్లతో. మహా న్యూస్ పై దాడి.



హైదరాబాద్‌లోని మహా న్యూస్ కార్యాలయం వద్ద శనివారం ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వివాదంపై ప్రసారం చేసిన కథనాల్లో తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ పేరును ప్రస్తావించడంపై BRS కార్యకర్తలు తీవ్రంగా స్పందించారు. వారు ఆగ్రహంతో ఆఫీసు వద్దకు చేరుకుని అద్దాలు పగలగొట్టడం, వాహనాలు ధ్వంసం చేయడం, స్టూడియోలోకి ప్రవేశించి పరికరాలు నాశనం చేయడం వంటి చర్యలకు దిగారు. ఈ అల్లర్ల నేపథ్యంలో మీడియా ప్రతినిధులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ దాడి సమయంలో మాహాన్యూస్ స్టూడియోలో ప్రముఖ యువ హీరో సుహాస్ కూడా ఉన్నారు. ఆయన తన తాజా సినిమా 'ఉప్పు కప్పురంబు' ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కానీ అకస్మాత్తుగా జరిగిన ఈ ఘర్షణతో ఆందోళన చెందిన సుహాస్, తక్షణమే ఆఫీసు నుంచి బయటకు వెళ్లిపోయారు. ఒక మీడియా సంస్థ ఆఫీసులోనే ఇలాంటి ఉద్రిక్తతలు జరగడం చూసి ప్రజలు, జర్నలిస్టులు, సినీ ప్రముఖులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. పరిస్థితిని అదుపులోకి తేవడంతో పాటు, అల్లర్లు చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛపై మరోసారి ప్రశ్నలు రేపింది. చర్చలు, అభిప్రాయ భేదాల వల్ల ఏర్పడే రాజకీయ అసహనం ఈ స్థాయికి చేరడం ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మీడియా తప్పు చేస్తే న్యాయపరమైన మార్గాలు ఉన్నాయి కానీ హింసతో స్పందించడం ఏ విధంగానూ సమర్థించదగినది కాదు.

# భాగ్యనగర్ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

## పీజేఆర్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

## నియోజకవర్గాల పునర్విభజన.. సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్:2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని.. శేరిలింగంపల్లి 4 నియోజకవర్గాలుగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు . హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో పీజేఆర్‌ది కీలకపాత్ర అని కొనియాడారు. పీజేఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని ఉద్ఘాటించారు. ఇవాళ(శనివారం) పీజేఆర్ ఫ్లైఓవర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కొండాపూర్-గచ్చిబౌలి మార్గంలో 6 లైన్లతో 1.2 కిలోమీటర్ల ఫ్లైఓవర్‌ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది. రూ.182.72 కోట్ల వ్యయంతో ORR నుంచి కొండాపూర్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. పీజేఆర్ ఫ్లైఓవర్‌తో గచ్చిబౌలి చౌరస్తా దగ్గర ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. పీజేఆర్ ఫ్లైఓవర్‌ని ప్రారంభించిన అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి కోసం చాలామంది హైదరాబాద్ వస్తుంటారని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పేదల నాయకుడిగా పీజేఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పీజేఆర్ అని అభివర్ణించారు. గతంలో పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్లపాటు పీజేఆర్ శకం నడిచిందని గుర్తుచేసుకున్నారు. పీజేఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. గతంలో హైటెక్ సిటీని ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని హెచ్చరిచారు. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




## తెలంగాణలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీకి సిద్ధమైంది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు రోజుల క్రితమే డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ థెరపిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. జులై 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 1,931 మల్టీపర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలు విడుదల కాగా.. మెరిట్ జాబితాలు సిద్ధం చేస్తున్నారు.




## ఆర్థిక సంస్కరణల పితామహుడికి సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్, జూన్ 28: మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు.

**భూ సంస్కరణలతో సమానత్వానికి కృషి: భట్టి....** మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు.

ఆర్థిక సంస్కరణలతో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచిందన్నారు. తెలంగాణలో గత పదేళ్లు పాలించిన ప్రభుత్వం ధరణి తెచ్చి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదల హక్కులను కాపాడడానికి భూభారతి చట్టాన్ని తెచ్చామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## దగా క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారు: హరీశ్‌రావు



హైదరాబాద్: చలో సచివాలయం కార్యక్రమానికి మద్దతివ్వాలని నిరుద్యోగ యువత కోరారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీల సాధనకు భారాస అండగా ఉంటుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. భారాస పాలనలో 1.62 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని యువత ఎన్నో ఆశలు పెట్టుకుందని.. కానీ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని దుయ్యబట్టారు.

"దగా క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారు. నోటిఫికేషన్లు వద్దని యువత ధర్నాలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించారు.. బాధ్యత లేదా? 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడతాం. కమీషన్లు రావని రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## పీవీ ఘాట్‌లో నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతం పీవీతోనే సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## 13 మంది మావోయిస్టుల లొంగుబాటు

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో 13 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.23 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టుల వైపు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో పలువురు మావోయిస్టులు లొంగిపోతున్నారు.




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరితో అగ్రరాజ్యానికి వెళ్లేందుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నవేళ ఒక్క వీసా మాత్రం తెగ పాపులర్ అవుతోంది.

అదే ఓ-1 వీసా. అమెరికా వెళ్లాలనుకునే వృత్తి నిపుణులను ఈ మధ్య తెగ ఆకర్షిస్తోన్న వీసా ఇది. ముఖ్యంగా హెచ్-1బీకి ప్రత్యామ్నాయంగా మారిన 'ఓ-1' వీసా కోసం భారతీయులు ప్రయత్నిస్తున్నారు. ఇంతకీ ఏంటీ వీసా? ఎవరికి ఇస్తారు?

**అసాధారణ ప్రతిభ ఉంటే..** యూఎస్ ఇమిగ్రేషన్ యాక్ట్ 1990 కింద ఈ ఓ-1 వీసాను ప్రవేశపెట్టారు. సైన్స్, టెక్నాలజీ, విద్య, వ్యాపారం, అథ్లెటిక్స్ ఆర్ట్స్ అండ్ ఫిల్మ్ అసాధారణ ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన వారికి, అద్భుత విజయాలు సాధించినవారికి ఈ వీసాలను మంజూరుచేస్తున్నారు. ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు.. నిర్ణయించిన ఎనిమిది కఠిన ప్రమాణాల్లో కనీసం మూడైనా కలిగిఉండాలి. అవార్డులు, స్కాలర్లీ పబ్లికేషన్లు పొందడం లేదా ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సభ్యత్వం కలిగిఉండటం, మీడియా కవరేజీ వంటివి ప్రమాణాలుగా ఉన్నాయి.

**లాటరీ లేకుండానే..** ఈ వీసాకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా లాటరీ విధానం గానీ, పరిమితులు గానీ లేకపోవడంతో వీసా రాదన్న భయం ఉండదు. ఏటా దరఖాస్తుదారుల్లో 93 శాతం మందికి వీసాలు మంజూరుచేస్తుంటారు. అదే హెచ్-1బీ అయితే ఆమోదిత రేటు కేవలం 37 శాతమే. ఓ-1 వీసాను తొలుత మూడేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. ఆ తర్వాత ఎన్నిసార్లయినా పొడిగించుకోవచ్చు. దీన్ని 'లాటరీ లేని హెచ్-1బీ వీసా'గా అభివర్ణిస్తారు. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. ఏటా ఈ వీసాల జారీ సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. 2020 ఆర్థిక సంవత్సరంలో 8,838 ఓ-1 వీసాలను జారీ చేయగా.. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 18,994కు పెరిగింది. అయితే, దీని దరఖాస్తు రుసుము మాత్రం 10వేల డాలర్ల నుంచి 30వేల డాలర్లుగా ఉంది.

సాధారణంగా హెచ్-1బీ దరఖాస్తుకు అయ్యే ఖర్చు 970 డాలర్ల నుంచి 7,775 డాలర్లుగా ఉంటుంది. ఈ వీసాలను అత్యధికంగా పొందుతున్న వారిలో బ్రిటన్, బ్రెజిల్ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2020లో 487 మంది భారతీయులకు ఓ-1 వీసా రాగా.. 2023 నాటికి ఆ సంఖ్య 1418కి పెరిగింది.

**టెక్ దిగ్గజాలూ ఓ-1 వైపే..** ప్రస్తుతం హెచ్-1బీ వీసాను పొందడం కష్టతరమవుతున్న సమయంలో భారత సైబర్ నిపుణులు, ఏఐ రీసెర్చర్లు, అథ్లెట్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు ఈ ఓ-1 వీసాను అమెరికాకు వెళ్లేందుకు దగ్గరి దారిగా భావిస్తున్నారు. అటు గూగుల్, టెస్లా, ఓపెన్ ఏఐ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఓ-1 వీసా రూట్‌లో నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. హార్వర్డ్, కొలంబియా వంటి విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీ, రీసెర్చర్ల కోసం ఓ-1 వీసాతో నైపుణ్యం గల వారిని నియమించుకుంటున్నారు. లాటరీ సమస్య లేకపోవడం, వీసా జారీ రేటు అత్యధికంగా ఉండటంతో భారత వృత్తి నిపుణులు ఎక్కువగా ఈ వీసాను ఆశ్రయిస్తున్నారు.




హనుమకొండ, జూన్ 28: జిల్లాలో అత్యంత అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళను వివస్త్రను చేసి చిత్రవధ చేసిన ఘటన వెలుగు చూసింది. ధర్మసాగర్ మండలం తాటికాయలలో ఈ దారుణం జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓ మహిళను ఇనుప గ్రిల్స్ కట్టి, వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి చిత్రవధకు గురి చేశారు. తప్పు చేశామని క్షమించాలని వేడుకున్నా కూడా వినకుండా దాడి చేశారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తాటికాయల గ్రామానికి చెందిన యువతితో మునుగు మండలం బోలోలుపల్లికి చెందిన రాజుకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. అయితే ఇటీవల కాలంలో రాజు.. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పదిరోజుల క్రితం ఇద్దరు కలిసి గ్రామం నుంచి పారిపోయారు. వీరిద్దరి కోసం గాలించిన రాజు కుటుంబసభ్యులు ఎట్టకేలకు వారిని వెతికి పట్టుకుని తాటికాయల గ్రామానికి తీసుకొచ్చారు. ఆపై మహిళ పట్ల అత్యంత కిరాతకంగా వ్యవహరించారు. ఆమెను ఇనుప గ్రిల్స్‌కు కట్టి వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి దారుణంగా చిత్రవధ చేశారు. తరువాత ఇద్దరికీ గుండు గీయించారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన నేడు వెలుగులోకి వచ్చింది. ఈ దారుణ ఘటన అనంతరం రాజు, మహిళ కనిపించకుండా పోయారు. మహిళపై దాడి దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. దీంతో ధర్మసాగర్ పోలీసులు తాటికాయల గ్రామానికి చేరుకుని దాడిలో పాల్గొన్న కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. మహిళను చిత్ర హింసలకు గురిచేసిన కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్నారు. అలాగే కనిపించకుండా పోయిన రాజు, మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## నేను దేనికీ భయపడ: కొండా మురళి




హైదరాబాద్, జూన్ 28: కాంగ్రెస్ పార్టీ అంటే తనకు గౌరవం ఉందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. ఈరోజు (శనివారం) గాంధీభవన్‌లో క్రమ శిక్షణా కమిటీతో కొండా మురళీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 15 పేజీలతో కూడిన నివేదికను కమిటీకి ఇచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం మాజీ ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌తో కాంగ్రెస్‌పై తనకు అభిమానం పెరిగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనే తపన తనలో ఉందన్నారు. బహిరంగ విమర్శలు చేయడం మంచిదో చెడునో అంతరాత్మకు తెలుసన్నారు. 'నేను బలహీనుడినా.. బలవంతుడినా అనేది అందరికీ తెలుసు. నన్ను రెచ్చగొట్టొద్దు. నేను రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వచ్చా. కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి రాజీనామా చేస్తారో లేదో ఆయనే తేల్చుకోవాలి. బీసీలను గౌరవించాలని కోరా. నేను దేనికి భయపడను. సీఎం, పీసీసీ అంటే గౌరవం ఉంది. మళ్ళీ అవసరం వచ్చినప్పుడు వరంగల్‌లో మాట్లాడుతా' అని కొండా మురళి పేర్కొన్నారు. కాగా.. గత కొద్ది రోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో వివిధ జిల్లాల్లో నాయకుల మధ్య అంతర్గత పోరు కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఒక వర్గంగా.. మిగిలిన ఎమ్మెల్యేలు మరో వర్గంగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న పరిస్థితి. ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో ఆ బాధ్యతను క్రమశిక్షణా కమిటీకి అప్పగించింది కాంగ్రెస్ హైకమాండ్. ఈ నేపథ్యంలో ఈరోజు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గాంధీభవన్‌కు చేరుకుని క్రమశిక్షణ కమిటీతో భేటీ అయ్యారు. కమిటీకి 15 పేజీలతో కూడిన నివేదికను అందజేశారు. గతంలో కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ వివరణ కోరిన నేపథ్యంలో 15 పేజీల లేఖను సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డిపై కమిటీకి ఫిర్యాదు చేశారు కొండా. ఉమ్మడి వరంగల్‌లో ప్రతీ నియోజకవర్గంలో జరుగుతున్న అంశాలపై నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం, రేవూరి, నాయినిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కొండా మురళి కోరుతున్నారు.

కాగా.. క్రమశిక్షణా కమిటీ ముందు హాజరయ్యేందుకు వచ్చిన కొండా మురళీకి మద్దతుగా భారీగా అనుచరులు వచ్చారు. అయితే వారిని గాంధీ భవన్ గేటు వద్దే పోలీసులు నిలిపివేశారు.




అధ్యక్ష పదవిని ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పదవిలో ఉండటం చాలా ప్రమాదకరమని ఆయన తెలిపారు. శుక్రవారం వైట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈసందర్భంగా గతేడాది పెన్సిల్వేనియాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార ర్యాలీలో జరిగిన హత్యాయత్నాన్ని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. అధ్యక్ష పదవి ప్రమాదకరమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకొనిఉంటుందని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా అధ్యక్షుడి బాధ్యతలను ఇతర ప్రమాదకరమైన వృత్తులతో ఆయన పోల్చారు. కారు రేసింగ్, బుల్ రైడింగ్ లాగే ఇక్కడ కూడా చావు ఎప్పుడు ఎదురవుతుందో చెప్పలేమన్నారు. ఈవిషయం తనకు ఎవరైనా ముందే చెప్పిఉంటే.. తాను ఈ రేసులో ఉండేవాడిని కాదన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన వృత్తి అని ఆయన ఉద్ఘాటించారు. గతంలో ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌పై హ త్యాయత్నం జరిగింది. పెన్సిల్వేనియాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతుండగా ఓ భవనంపై నక్కిన దుండగుడు కాల్పులు జరిపా డు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవికి గాయమైంది. ఆ తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఒక వ్యక్తి ఫెన్సింగ్ వద్దకు తుపాకీతో రావడాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. అనంతరం కాల్పులు జరిపి అతడిని అరెస్టు చేశారు. కొన్ని రోజుల అనంతరం ట్రంప్ పాల్గొన్న సమావేశం సమీపంలో ఉన్న నేషనల్ కన్వెన్షన్ సమీపంలో మాస్క్ ధరించిన ఓ సాయుధ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఆ వ్యక్తి తన వీపున తగిలించుకున్న బ్యాగులో %ూఖ%-47 తుపాకీని మోసుకెళ్లినట్లు ఫాక్స్ న్యూస్ పేర్కొంది.

# భారతీయ గణాంకాల పితామహుడు మహలనోబిస్

## భారత ఆర్థిక వ్యవస్థ దిశానిర్దేశకుడు మహలనోబిస్ - జూన్ 29... పి.సి.మహలనోబిస్ జయంతి

ప్రశాంత్ చంద్ర మహలనోబిస్ (1893 జూన్ 29 – 1972 జూన్ 28) భారతీయ శాస్త్రవేత్త, అనువర్తిత గణాంకశాస్త్రవేత్త. భారత ప్రణాళిక వ్యవస్థకు పితామహుడు జవహర్ లాల్ నెహ్రూ అయితే, భారత ప్రణాళిక పథానికి పి.సి.మహలనోబిస్ నిర్దేశకుడిగా ప్రసిద్ధిచెందాడు. అతను గణాంక కొలత అయిన "మహలనోబిస్ డిస్టెన్స్" ద్వారా గుర్తింపబడ్డాడు. ఆయన భారతదేశ మొదటి ప్లానింగ్ కమీషన్ సభ్యుడు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ను స్థాపించాడు. 1893లో కోల్‌కతలో జన్మించిన మహలనోబిస్ భౌతిక శాస్త్రంలో శిక్షణ పొంది, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్ గా రిటైరైనాడు. అతనికి గణాంక శాస్త్రంలో కల ఆసక్తి కారణంగా ఆ రంగంలో నైపుణ్యం సాధించి చివరికి ఆ రంగంలోనే జగత్ప్రసిద్ధి చెందినాడు. గణాంక శాస్త్ర రంగంలో అతని సేవలకు గుర్తింపుగా లండన్ లోని రాయల్ సొసైటీ ఫెల్లోగా ఎన్నికయ్యాడు. 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక శాస్త్ర కమిషన్ సభ్యుడిగా, 1949లో కేంద్ర మంత్రివర్గపు గణాంక శాస్త్ర గౌరవ సలహా దారుడిగా నియమించ బడ్డాడు. 1950లో నేషనల్ శాంపిల్ సర్వే స్థాపనలో మహలనోబిస్ కీలకపాత్ర వహించాడు. 1949 జాతీయాదాయ కమిటీ చైర్మెన్ గా మహలనోబిస్ జాతీయాదాయ గణాంకాలకు ప్రాతిపదిక స్వరూపాన్ని ఇచ్చాడు. 1955 నుండి 1967 వరకు ప్రణాళిక సంఘం సభ్యుడిగా తన సేవలందించాడు. రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో అతని కృషి అనిర్వచనీయం. భారీ పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఆ ప్రణాళిక నమూనా మహలనోబిస్ నమూనా గా ప్రసిద్ధిగాంచింది. 1893 జూన్ 29 న కోల్‌కతలో జన్మించిన మహలనోబిస్ పూర్తి పేరు ప్రశాంత్ చంద్ర మహలనోబిస్. ఆయన పూర్వీకుల స్వస్థలం నేటి బంగ్లాదేశ్ ప్రాంతం. జీవనోపాధి కోసం మహలనోబిస్ తాత కోల్‌కత ప్రాంతానికి చేరి స్థిరపడ్డారు. మహలనోబిస్ బాల్యం, విద్యాభ్యాసం కూడా కోల్‌కత లోనే కొనసాగింది. ప్రెసిడెన్సీ కళాశాలలో ఆయనకు జగదీష్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్ర రే బోధించారు. 1912లో భౌతిక శాస్త్రం (ఆనర్స్) లో పట్టభద్రుడయ్యాడు. మహలనోబిస్ 1913 లో లండన్ బయలుదేరి కేంబ్రిడ్జ్ లోని కింగ్స్ కాలేజీలో చేరాడు. గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం అభ్యసించాడు. గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్‌ను విశ్వ విద్యాలయంలో కలిశాడు. అభ్యసనం పూర్తి కాగానే మహలనోబిస్ కోల్ కత లోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా ప్రవేశించాడు. 30 సంవత్సరాల పాటు సేవలందించి చివరగా ప్రిన్సిపాల్ గా రిటైరయ్యాడు. పి.సి.ఎం గా స్నేహితులచే పిలువబడిన ఆయన... ప్రమథ నాథ్ బెనర్జీ (మింటో ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్), నిఖిల్ రంజన్ సేన్ (ఖైరా ప్రొఫెసర్ ఆఫ్ అప్లైడ్ మ్యాథమెటిక్స్) మరియు సర్ ఆర్ఎన్ ముఖర్జీలతో కలిసి, మహలనోబిస్ 1932 లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ ను స్థాపించారు. ఆ సంస్థ 1959 లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ప్రకటించ బడింది. 1933లో భారత గణాంక శాస్త్ర పత్రిక సాంఖ్య ప్రచురణను ఆయన ప్రారంభించాడు. 1940 లలో శాంపిల్ సర్వే మీద అతను సాగించిన పరిశోధనల ఫలితంగా 1950లో నేషనల్ శాంపిల్ సర్వే స్థాపితమైంది. ప్రెసిడెన్సీ కళాశాల అధ్యాపకుడిగా ఉన్నపుడే గణాంక శాస్త్రజుడిగా ప్రసిద్ధిచెందాడు. అతను గణాంక శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తింపుగా 1945లో లండన్ లోని రాయల్ సొసైటీ ఫెలోగా ఎన్నికయ్యాడు. 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక కమిషన్ సభ్యుడిగా నియమించ బడ్డాడు. 1949లో కేంద్ర మంత్రివర్గపు గణాంక శాస్త్ర గౌరవ సలహాదారుడిగా నియమించ బడ్డాడు. దీనితో దేశానికి ఆర్థిక, గణాంక సేవలందించడానికి అవకాశం లభించింది.



1950 ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్ష ఉపన్యాసంలో జాతీయ ప్రణాళిక విధానంలో గణాంక శాస్త్రం అంతర్భాగం అని పేర్కొన్నాడు. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్సిట్యూట్) స్థాపనలో ప్రముఖ పాత్ర వహించాడు. స్థూల జాతీయోత్పత్తి, సంబంధిత ఇతర అంశాలను అంచనా వేయడం ఈ సంస్థ బాధ్యత. జాతీయాదాయ కమిటీ చైర్మెన్ గా మహలనోబిస్ జాతీయాదాయ లెక్కలకు ప్రాతిపదిక స్వరూపాన్ని రూపొందించాడు. సోవియట్ యూనియన్ ప్రణాళిక విధానానికి ప్రభావితుడైన జవహర్ లాల్ నెహ్రూ దేశంలో కూడా ఒక ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టు దశలో పి.సి.మహలనోబిస్ ప్రణాళిక విధాన రంగంలో ప్రవేశించాడు. 1950లో ప్రణాళిక సంఘం స్థాపితమైనప్పటి నుంచి గణాంక శాస్త్ర సలహాదారుడిగా సేవలందించాడు. 1955 నుండి 1967 ప్రణాళిక సంఘం సభ్యుడిగా నియమించ బడ్డాడు. ముఖ్యంగా భారీ పరిశ్రమలకు ప్రాముఖ్యం ఇచ్చిన రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో పి.సి.మహలనోబిస్ పాత్ర అనిర్వచనీయం. ఇది మహలనోబిస్ నమూనాగా ప్రసిద్ధి చెందినది. వర్తమాన ఆర్థిక వ్యవస్థకు ఉపయోగ కరమైన ప్రమాణాలను మహలనోబిస్ రెండో పంచవర్ష ప్రణాళికలో ప్రవేశ పెట్టాడు. ప్రణాళిక ఆలోచనలకు నిర్దిష్ట రూపం కల్పించడంలో మహలనోబిస్ ఎంతో సహకరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్‌కు కార్యదర్శిగా పనిచేశాడు. విశ్వ భారతి విశ్వ విద్యాలయంతో కూడా సంబంధం కలిగి ఉన్నాడు. 1944లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి వెల్డన్ మెడల్ పురస్కారం సొంతం చేసుకున్నాడు. 1945లో లండన్ లోని ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ సభ్యత్వం పొందాడు. 1957లో అంతర్జాతీయ గణాంక సంస్థ గౌరవ అధ్యక్షుడిగా హోదా పొందాడు. 1968లో భారత ప్రభుత్వము పద్మ విభూషణ్ పురస్కారం చే గౌరవించింది. భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన మహలనోబిస్ తన డెబ్బై తొమ్మిదవ పుట్టినరోజుకు ఒక రోజు ముందు, జూన్ 28, 1972 న మరణించాడు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మహలనోబిస్ గౌరవార్థం జూన్ 29 ను జాతీయ గణాంక దినోత్సవంగా ప్రకటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# ఫొటో చిత్రీకరణలో దిట్ట వడ్లూరి - నేడు జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా...



సుప్రభాత వేళ నుండి సూర్యాస్తమయం వరకూ తాను చూసిన ప్రకృతి అందాలను కెమెరాతో బంధించి ట్రిక్కులు చేయడం, లెన్సుతో జిమ్మిక్కులు చేయడం ఆయన అభిరుచి. ప్రకృతి ఆయన కళా సాధనం. కెమెరా ఆయన ఆరోప్రాణం. నిరంతరం తాను కళా తపస్సులో నిమగ్నమై కెమెరాతో అద్భుతాలు సృష్టిస్తూ, కెమెరాకే ట్రిక్కులను నేర్పుతున్న కళారాధకుడు సుప్రసిద్ధ ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురి నివాసి వడ్లూరి రవీందర్. చిత్ర, విచిత్రమైన ఫోటోలు తీస్తూ, ఫోటోగ్రఫీలో అత్యున్నత శిఖరాలను చేరుకోవడమే ఆయన జీవితాశయం. బాల్యం నుండి ఎన్నో సృజనాత్మకత ఉట్టిపడే సుందర దృశ్యాలను బుల్లి కెమెరాలో బంధించా రాయన. స్వయం కృషితో సాధన చేస్తూ, ట్రిక్ ఫోటోగ్రఫీ ద్వారా అపురూప చిత్రాలను చిత్రీకరించి, ప్రావీణ్యం సంపాదించి, వివిధ ప్రదర్శనలలో ప్రదర్శించి, బహుమతులందుకుని ప్రశంసాపాత్రులైనారు. చింతగింజపై వేసిన వెంకటేశ్వరుడు, బియ్యపు గింజపై రాసిన ఇంగ్లీషు అక్షరాలు, బొమ్మల చిత్రాలు, పనికి రాని వస్తువులతో తయారు చేసిన బొమ్మలు రవీందర్ ప్రజ్ఞకు, ప్రావీణ్యానికి మచ్చుతునకలు. డిగ్రీ పూర్తిచేసి, ఉద్యోగం దొరకక పోయినా నిరుత్సాహ పడక, ధర్మపురి క్షేత్రం లోనే 1987లో ఒక ఫోటో స్టుడియోను నెల కొల్పి తన ప్రతిభకు మెరుగులు దిద్దుతూ తనకంటూగల ఒక ప్రత్యేక కెమెరా టెక్నిక్ ద్వారా నాలుగు దశాబ్దాల క్రితం నుండి ముందు బ్లాక్ అండ్ వైట్, తర్వాత కలర్ ఫోటోలు తీస్తూ, ఫోటోగ్రఫీ ద్వారా ఒకే వ్యక్తి పొట్టిగా మరియు పొడగరిగా, మరు గుజ్జుగా అద్భుతాలను ఆవిష్కరించా రాయన. అంతేగాక ఒక వ్యక్తి అవిటి వాడుగా, మరో ఫోటోలో రెండు కాళ్ళున్న వాడిగా ఫోటోలు తీసి పాజిటివ్ చేయడం ఆయనకే సొంతం. ప్రకృతి అందాలను కెమెరాలో బంధించి, భూత, వర్తమాన, భవిష్యత్తు చూపేది, భాష లేనిది, భావమున్నది, లిపిలేనిది ఫోటో అంటారాయన. 1999లో స్వాతంత్ర్య దిన వేడుకలలో హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి, 2003లో జిల్లా సమాచార శాఖ పక్షాన తృతీయ బహుమతి 2004 లో శాతవాహన ఉత్సవాలలో నాటి ఎంపీ సువర్ణ కుమారి ద్వారా ఉత్తమ ప్రదర్శనకు నగదు ప్రశంసాపత్రం 2011లో సమాచార శాఖ ఆధ్వర్యంలో ద్వితీయ బహుమతి 2012 లో రాష్ట్ర సమాచార శాఖ పక్షాన హైదరాబాదులో నాటి మంత్రి డీకే అరుణ చేతుల మీదుగా తృతీయ బహుమతి 2013 లో జిల్లా స్థాయిలో సమాచార శాఖ ద్వారా ద్వితీయ బహుమతి 2015 లో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జిల్లా పోలీసు శాఖ పక్షాన నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ నాకు ఎస్పీ జోయల్ డేవిస్ ద్వారా ఉత్తమ బహుమతిని అందుకున్నారు. జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా గా వడ్లూరి రవీందర్ కలిసినప్పుడు వెలుగు నీడల కలయిక అయిన జీవితంలో బతుకు దాడిలో చీకటి వెలుతురు సమంగా స్వాగతించి కెమెరాలో బంధించి ఫోటోగ్రఫీ ఒక శాస్త్రీయమైన అన్నారు. తాను చేసిన కృషికి రాష్ట్ర జిల్లా స్థాయిలో పలు బహుమతులను అందుకొనాలని ప్రభుత్వంచే గుర్తింపు పొందిన కళాకారులలో ఒకరిగా గుర్తింపు కార్డు లభించడం ఆనందదాయకం అన్నారు. **రామకిష్టయ్య సంగనభట్ల.. 9440595494**

# త్యాగానికి స్ఫూర్తి ప్రదాత హజ్రత్ హుస్సేన్ - వారం రోజుల పాటు మొహర్రం వేడుకలు



హిందువులు, ముస్లిం సోదరులూ సమిష్టిగా జరుపుకునే మొహర్రం ప్రత్యేకత సంతరించుకుంది. త్యాగానికి, మహోన్నత సనాతన సాంప్రదాయానికి, మత సామరస్యానికి ప్రతీక మొహర్రం వేడుక. మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇది అరబ్బీ కేలండర్ యొక్క మొదటి నెల. ప్రాచీన కాలంలో అరబ్బులు (అరేబియాలోని యూదులు, క్రైస్తవులతో సహా) ఈ కేలండర్ ను వాడేవారు. ప్రాచీనకాలంలో ఆషూరా దినం, అనగా ముహర్రం యొక్క పదవతేదీని, అనేక సాంప్రదాయక గుర్తుల కనుగుణంగా పర్వముగాను పండుగగానూ జరుపుకునేవారు. పద్నాలుగు శతాబ్దాల క్రితమే ప్రజాస్వామ్యం కోసం, మానవ హక్కుల కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటం 'మొహరం'. ధర్మసంస్థాపన లక్ష్యంగా, నమ్మిన సిద్ధాంతాల కోసం పలువురు ప్రాణాలర్పించిన మాసం మొహర్రం. ధర్మసంస్థాపనార్థం హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్ లు తమ ప్రాణాలను అర్పించి వందల సంవత్సరాలు గడిచినా అమరవీరుల త్యాగాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ, అమరుల త్యాగశీలతకు జోహార్లను అర్పించడం సత్సాంప్రదాయంగా ఆచరిస్తున్నారు. మొహర్రం మాసమంటే రక్తపు టేరులతో ఎర్రబారిన కర్బల మైదానం ముస్లిం సోదరుల కళ్లలో సజీవంగా సాక్షాత్కరిస్తుంది. ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణ ఫలితమే కర్బల దుర్ఘటనగా ముస్లింలు భావిస్తారు. ఇస్లాం మత స్థాపకుడు ప్రవక్త మహమ్మద్ పరమపదించిన అనంతరం సమ సమాజ స్థాపన కోసంప్రజాస్వామ్య పద్ధతిలో, సౌదీ అరేబియాలో తమ ప్రతినిధిని ఎన్నుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. తదనుగుణంగా మదీనా రాజధానిగా గల రాజ్యానికి హజ్రత్ అబూబకర్ తొలి ఖలీఫాగా ఎన్నుకొనగా, అనంతరం హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్ హజ్రత్ అలీలను ఖలీఫాగా ఎన్నుకున్నారు. వీరి పరిపాలన సమయంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలపై నడిచాయని చెపుతారు. ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమానత్వం వెల్లి విరిసిందంటారు. ఐదవ ఖలీఫాగా ప్రజలు ఇమాం హుస్సేన్ తమ ప్రతినిధిగా ఎన్నుకోగా, సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ మివాయా అధికార దాహంతో ఖలీఫా పదవిని ఆశించి పోటీపడగా, ఇరువర్గాల మధ్య యుద్ధానికి నాంది పలికింది. యుద్ధ పరిణా మాలను గ్రహించిన హుస్సేన్, రక్తపాత నివారణకై రణరంగం నుండి నిష్క్రమించి, ప్రజలు తమకు విశ్వాసంతో కట్టబెట్టిన అధికారాన్ని త్యాగం చేశారు. పదవీకాంక్షాలోలుడైన మివాయ తన కుమారునికి పట్టం కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెచ్చిన స్థితిలో, ప్రాణభయంతో ప్రజలు మివాయ కొడుకు యజీద్ రాజుగా గుర్తిస్తారు. అయితే ఈ చర్యలు ప్రజాస్వామ్య వాదులకు మింగుడు పడలేదు. తత్ఫలితంగా ప్రజలు రాజుకు ఎదురు తిరిగి ఉద్యమిస్తారు. ఉద్యమ నాయకత్వ బాధ్యతలను హజ్రత్ హుస్సేన్ కి అప్పగిస్తారు. ఇస్లాం నిబంధనల ప్రకారం ఏసమస్యకైనా చర్చలు సంప్రదింపులే పరిష్కార మార్గాలు కావడం మూలంగా, హజ్రత్ హుస్సేన్ సిరియా రాజధాని కుఫాకు సంప్రదింపులకై బయలుదేరి వస్తుండగా, రాజు యజీద్ విషయాన్ని తెలుసుకుని హుస్సేన్ రాజధానికి వెళ్ళి చర్చలు జరిపితే తన అధికారానికి ముప్పు వాటిల్లక తప్పదని గ్రహించి, హుస్సేన్ ను అడ్డుకోవడానికి పెద్ద సైన్యాన్ని పంపుతాడు. మార్గ మధ్యలో కర్బల మైదానంలో యజీద్ సైన్యం ఎదురై హుస్సేన్ పరివారాన్ని అడ్డగిస్తారు. దీనితో ఇరువర్గాల మధ్య భీకరయుద్ధం జరుగు తుంది. హుస్సేన్ పరివారం శత్రు సైన్యాన్ని చీల్చి చెండాడినా, కొంతకాలం యుద్ధం జరిగాక చివరకు హుస్సేన్ ఒక్కడే మిగులగా, మొహర్రం మాసం లోని పదో తేదీ శుక్రవారం హిజ్రీ 60వ సంవత్సరం నాడు హుస్సేన్ హోరా హోరీగా పోరాడుతున్న సమయంలో, సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, కొంత వ్యవధి కావాలని అనుమతి గైకొనగా, శత్రువులు అదే అదనుగా భావించి, నమాజ్లో భాగంగా సిజ్దా చేస్తుండగా బాణాలతో దారుణంగా హతమార్చి, తలను మొండెం నుంచి వేరు చేసి, చేతులు ఖండించి బాణాలకు, బరిసెలకు తగిలించుకుని నాట్య విన్యాసాలు చేశారు. అట్టిరోజును ఇస్లాం మతస్తులు త్యాగ దినంగా పరిగణించి మొహర్రం జరుపు కుంటారు. ముహర్రంనెల పదవరోజు యౌమీ ఆషూరా. ముహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ, కర్బలా యుద్ధంలో అమరుడైన రోజు. ముహర్రం నెలను, "షహీద్ " (అమరవీరుల ) నెలగా వర్ణిస్తూ, పండుగలా కాకుండా, వర్ధంతిలా జరుపుకుంటారు. మొహర్రం జరిగే పది రోజులు విషాద దినాలే కాని, ఎంత మాత్రం పర్వదినాలు కావు. తెలుగు ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. తెలంగాణలో పలుచోట్ల ఈ ముహర్రం పండుగను పీర్ల పండుగ అనే పేరుతో జరుపు కుంటారు. మొహర్రం వేడుకలు వారం రోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి. **రామకిష్టయ్య సంగనభట్ల.. 9440595494**

# తెలంగాణ బీజేపీలో అధ్యక్ష మార్పు ... నూతన నాయకత్వానికి రంగం సిద్ధం

## బీజేపీలో కొత్త నాయకత్వానికి సంకేతాలు... తెలంగాణలో మారనున్న సమీకరణాలు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక... అవకాశాల నేపథ్యం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దేశ రాజకీయ రంగంలో ప్రధాన శక్తిగా కొనసాగుతోంది. కేంద్రంలో అధికారాన్ని నిర్వహిస్తున్న ఈ పార్టీకి రాష్ట్రాల్లో బలం పెంపు ఒక నిరంతర లక్ష్యం. ఈ పరంగా, రాష్ట్ర అధ్యక్షుని నియామకం ప్రతి రాష్ట్రంలోనూ ఒక కీలక పరిణామంగా మారుతోంది. తెలంగాణలో ప్రస్తుతం ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నూతన రాష్ట్ర అధ్యక్షుని ఎంపికకు సంబంధించి పార్టీ అంతర్గతంగా చర్చలు తారాస్థాయికి చేరాయి. బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుని నియామకం సాధారణంగా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రకా ప్రకారమే ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుంది. గ్రామ, మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని వెల్లడించగా, రాష్ట్ర స్థాయి నాయకత్వం ఆ ఎన్నికను అమలు చేస్తుంది. అయితే, అధిష్టాన నిర్ణయం కేంద్రంగా ఉండే బీజేపీలో ఆఖరి నిర్ణయం కేంద్ర నాయకత్వం చేతుల్లోనే ఉంటుంది. అందువల్ల అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ వ్యూహాలు కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఆయన పదవీ కాలం ముగియ నుండగా, కేంద్ర మంత్రిత్వ బాధ్యతల నిమిత్తం పూర్తి స్థాయి సమయం కేటాయించలేని కారణంగా, కొత్త రాష్ట్ర అధ్యక్షుని నియామకంపై చర్చలు ముమ్మరంగా జరుగు తున్నాయి. ఈ అంశం పట్ల పార్టీ వర్గాలు, కార్యకర్తలు, రాజకీయ పరిశీలకుల మధ్య ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో అనేక మంది ప్రముఖుల పేర్లు బహిరంగంగా, అంతర్గతంగా చర్చల్లో నిలుస్తున్నాయి. ఈటల రాజేందర్ పేరు ఈ రేసులో ప్రధానంగా వినిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఆయనకు ప్రజాదరణ ఉంది. బీసీ వర్గానికి చెందిన నాయకుడిగా ఆయనను ముందుంచే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి గెలవడం ద్వారా ఆయన తన బలం మరింత ప్రభావ వంతంగా నిరూపించు కున్నారు. పార్టీకి కొత్త ఉత్సాహం, దూకుడు అవసరమన్న అభిప్రాయాలను వ్యక్త పరచడం ద్వారా ఆయన తన ఆసక్తిని వ్యక్త పరిచినట్టుగా కనిపిస్తోంది. ఇంకొక ప్రబలమైన అభ్యర్థి ధర్మపురి అరవింద్. నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలిచిన ఆయన యువ నేతగా, బలమైన వ్యక్తిగా, వక్తగా గుర్తింపు పొందారు. ఆయన బీసీ వర్గానికి చెందినవారు కావడం, అత్యంత అనుభవం కలిగిన, వివిధ పదవులు అనుభవించిన దివంగత నేత ధర్మపురి శ్రీనివాస్ తనయునిగా, కేసీఆర్ తనయ కవితను ఓటమి పాలు చేసిన నేతగా, కేంద్ర హై కమాండ్‌తో అనుసంధానం కలిగి ఉండడం ఆయనకు అనుకూలంగా పని చేయవచ్చు. డీకే అరుణ కూడా రాష్ట్ర అధ్యక్ష పదవికి ఒక అవకాశంగా చూస్తున్నారు. ఆమెకు మహిళా కోటా ద్వారా అవకాశం దక్కవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళా నేతగా, మాజీ మంత్రిగా, జాతీయ ఉపాధ్యక్షురాలిగా అనేక బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆమెకు తోడుగా నిలవనుంది. ఇంకా పలువురు బలమైన నాయకులు కూడా ఈ రేసులో ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు, మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, పార్టీ సీనియర్ నాయకుడు మురళీధర్ రావు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి తదితరుల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. వీరి అనుభవం, సైద్ధాంతిక నిబద్ధత, సీనియారిటీ, సీనియారిటీ పార్టీకి ఎంత వరకూ ఉపయోగ పడుతుందన్నదే పరిశీలానాంశం. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ఇప్పటికే మంత్రి పదవిలో ఉన్నప్పటికీ, పార్టీకి అవసరమైతే పదవి త్యాగానికైనా సిద్ధమని ప్రకటించడం ద్వారా ఆయనపైన కూడా చర్చలు కొనసాగు తున్నాయి. అయితే ప్రస్తుతం ఆయన రేసులో లేరని ఆయన స్వయంగా ప్రకటించారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల ప్రకారం, రాష్ట్ర అధ్యక్షుని ఎంపికలో నాలుగు ప్రధాన అంశాలు దృష్టిలో పెట్టు కోవాల్సినవి...బలమైన ప్రజాకర్షణ కలిగిన నాయకత్వం, సామాజిక సమీకరణాలకు తగిన ప్రాతినిధ్యం, రాష్ట్ర రాజకీయాల్లో పార్టీని ముందుకు నడిపించే వ్యూహాత్మక దృష్టికోణం, కేంద్ర నాయకత్వానికి నిబద్ధత, అనుసంధానం. ఈ నేపథ్యంలో, బీజేపీ అధిష్ఠానం రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక సంబంధిత కార్యక్రమం చేపట్టి, జూలై 1వ తేదీన కొత్త అధ్యక్షుని ఎన్నిక పూర్తి చేయనున్న క్రమంలో... రాష్ట్రానికి తగిన నాయకత్వాన్ని ఎంపిక చేయడం ద్వారా పార్టీ తన బలాన్ని పునర్నిర్మించు కోవడం, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సమర్థంగా సిద్ధం కావడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎన్నిక కేవలం ఒక అంతర్గత ప్రక్రియ మాత్రమే కాదు. ఇది బీజేపీ భవిష్యత్తుకు మార్గ నిర్దేశకంగా నిలవనుంది. ఈ ప్రక్రియలో జరిగే చర్చలు, వ్యూహాలు, నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాల్లో దిశా నిర్దేశకంగా మారతాయి. అన్ని వర్గాలను కలుపుకొని పార్టీకి కొత్త ఊపు నింపగల నాయకుని ఎంపిక %-% తెలంగాణ బీజేపీకి కీలక మలుపుగా మారనుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# "తిరిగి ఇంటికి వెళ్లాలా?" అమెరికాలో భారతీయుల మనోగతం




అమెరికా డ్రీమ్... ఎంతోమంది భారతీయుల కల ఇది. ఎన్నో కష్టాలు, సాధనల తర్వాత ఈ కల నిజమైంది. కానీ ఒక దశకు చేరుకున్నాక "ఇక్కడే జీవితాంతం ఉండాలా? లేక తిరిగి భారతదేశానికి వెళ్లాలా?" అనే ప్రశ్న చాలామంది మనసుల్లో మెల్లగా తొలుస్తుంది. అమెరికా అవకాశాలకు కొదవలేని దేశం. కానీ ఇక్కడ జీవితం అంత తేలిక కాదు. యువతకు, శక్తిమంతులకు ఈ దేశం సరిపోతుంది. కానీ వయసు పెరిగే కొద్దీ, వేగం తగ్గే కొద్దీ, జీవితం కొంత విచిత్రంగా అనిపించవచ్చు. ముఖ్యంగా వైద్య సేవలు ఇక్కడ చాలా ఖరీదైనవి. వృద్ధులు వ్యాధులతో బాధపడే సమయంలో మంచి వైద్యం పొందడమే పెద్ద సమస్యగా మారుతుంది. దీనికి భిన్నంగా భారత్‌లో కుటుంబ బంధాలు, సమాజం ఇచ్చే మద్దతు చాలా సహాయకరంగా ఉంటాయి. అంతేకాకుండా అమెరికాలో పని ఒత్తిడి విపరీతంగా ఉంటుంది. ఉద్యోగం పోయిన వెంటనే లభించే మద్దతు చాలా తక్కువ. దీంతో కొందరు మానసికంగా అలసిపోతారు. ఈ నేపథ్యంలో "ఇంకా ఎన్నాళ్లు ఇక్కడ?" అనే ప్రశ్న చాలామంది భారతీయుల మనసులో మెదులుతూ ఉంటుంది. అయితే "తిరిగి వెళ్తాం" అని అనుకోవడం సులువు. కానీ నిజంగా వెళ్లడం మాత్రం అంత తేలిక కాదు. ఇక్కడ ఇళ్లకు లోన్‌లు ఉంటాయి, పిల్లలు ఇక్కడే పుట్టి పెరిగారు. వారి భవిష్యత్తు ఈ దేశంతో ముడిపడి ఉంది. ఒక్కసారిగా "ఇక్కడివి అన్నీ వదిలేసి" తిరిగి వెళ్తే అది పూర్తిగా తెలియని ప్రపంచంలోకి మరోసారి అడుగుపెట్టినట్లే అవుతుంది. అయినా కూడా చాలా మంది హృదయాల్లో "ఒకరోజు తిరిగి వెళ్తాం" అనే ఆశ చిన్నగా వెలుగుతూనే ఉంటుంది. జీవితంలో ఒత్తిడిగా ఉన్నప్పుడు, ఆ ఆశే కాస్త ఊరటనిస్తుంది. అమెరికాలో భారతీయుల జీవితం కేవలం విజయం లేదా వైఫల్యానికి సంబంధించినది కాదు. అది రెండు ప్రపంచాల మధ్య సమతుల్యతను వెతికే ప్రయాణం. ఒకవైపు అవకాశాల ప్రపంచం, మరొకవైపు అనుబంధాల ప్రపంచం. చాలామందికి తిరిగి వెళ్లాలనే ఆలోచన ఉన్నప్పటికీ, నిజంగా తిరిగి వెళ్లేవారు మాత్రం చాలా తక్కువమందే.

# చురకలు

## సంపాదకీయం

### దళపతికి తలుపులు తెరచిన ఎన్డీయే

ఎన్డీయేలో గొప్పతనం అదే పుష్పక విమానం లాంటిది ఎన్డీయే . ఎందరు వచ్చినా చేర్చుకుంటారు. ఇక తాము టార్గెట్ చేసే రాష్ట్రాలలో అయితే కీలక పార్టీలను కలుపుకు పోవాలని చూస్తారు. బీజేపీ చూపు తమిళనాడు ఎన్నికల మీద ఉంది. అక్కడ డీఎంకేని ఎలాగైనా గద్దె దించాలని చూస్తోంది. డీఎంకే ఇండియా కూటమికి ఆక్సిజన్ అందిస్తోంది. అంతే కాదు సౌత్ ఇండియాలో బలంగా ఉంది. మరో వైపు చూస్తే రేపటి ఎన్నికల్లో కనుక డీఎంకే గెలిస్తే కాంగ్రెస్ కి ఇండియా కూటమికి అది కొండంత బలంగా జాతీయ స్థాయిలో మారుతుంది. 2029 ఎన్నికల్లో కూడా టఫ్ ఫైట్ కి ఆస్కారం ఉంటుంది. అందుకే ఆదికి ముందే డీఎంకేని ఓడిచేఅయలని బీజేపీ పథక రచన చేస్తోంది. దానికి అనుగుణంగా ఇప్పటికే పావులు చకచకా కదుపుతోంది. అన్నా డీఎంకేని తమ మిత్రుడిగా చేసుకున్న బీజేపీ గ్లామర్ పుష్కలంగా ఉన్న పవన్ కళ్యాణ్ ని తమిళనాడులో రంగంలోకి దించుతోంది. ఈ నేపథ్యంలో తమిళనాడుని గెలుచుకునేందుకు బీజేపీ ఆలోచనలు ఏమిటి అన్న దాని మీద కేంద్ర హెూం మంత్రి బీజేపీ పెద్ద అయిన అమిత్ షా సూచనప్రాయంగా సంకేతాలు ఇచ్చారు అని అంటున్నారు. తమిళనాడులో అధికార డీఎంకేని ఓడించడానికి మరింత బలం కూడగట్టుకోవడానికి దళపతి తమిళ సూపర్ స్టార్ విజయ్ పార్టీ వైపు చూస్తోంది అని అంటున్నారు తాజాగా ఒక ప్రంతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ తమిళనాడు పొలిటికల్ సినారియో గురించి వివరించారు. తన మనసులో ఉన్న భావాలను ఎన్నికలలో బీజేపీ పాత్రను గెలిచే విధంగా ఆ పార్టీ చేస్తున్న కసరత్తుని విడమరచి చెప్పారు. తమిళనాడులో తదుపరి ముఖ్యమంత్రిగా అన్నాడీఎంకే అభ్యర్థి ఉంటారు అని స్పష్టంగా చెప్పారు. అంతే కాదు తమిళనాడులో ఎన్డీయే కూటమి గెలవబోతోంది అని గట్టి విశ్వాసం ప్రకటించారు. ఇక తమిళనాడులో కొత్తగా పార్టీ పెట్టిన దళపతి విజయ్ కి చెందిన టీవీకే పార్టీ ఎండీఏయే చేరే విషయం గురించి ఆయన స్పందిస్తూ ఎన్నికలు ఇంకా చాలా దూరంలో ఉన్నయని అన్నారు. అంటే ఆప్షన్ ఇంకా చాలా ఉన్నాయని చెప్పకనే చెప్పారు అన్న మాట. విజయ్ పార్టీని ఎన్డీయేలో చేర్చుకొవడానికి బీజేపీ వైపు నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆయన సంకేతాలు ఇచ్చారా అన్న చర్చ సాగుతోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కదా అన్న దాంటో ఎవరికి తోచిన అర్థాలు వారు వెతుక్కుంటున్నారు. ఎన్నికల సమయానికి కచ్చితంగా విజయ్ పార్టీ ఎన్డీయేలో చేరుతుందని అంటున్న వారూ ఉన్నారు. ఇక తమిళనాడు ఎన్నికలు జాతీయ స్థాయిలో విశేషంగా ప్రభావితం చేస్తాయన్న ఆలోచన బీజేపీకి ఉన్నందు వల్ల కచ్చితంగా బీజేపీ తమిళనాడులో రాజకీయ సన్నివేశాలు తనకు అనుకూలంగా మార్చుకోవడానికే చూస్తుందని అంటున్నారు. మరి బీజేపీ వ్యూహాలు ఆలోచనలు ఫలిస్తే కనుక తమిళ రాజకీయం రసకందాయంలో పడుతుంది. ఇంతకీ విజయ్ పార్టీ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయేలో చేరుతుందా అన్నది అతి పెద్ద ప్రశ్న. జవాబు అయితే ఇపుడే దొరకదు. కానీ విజయ్ కోసం ఎండీయే తలుపులు తెరచి ఉంచినట్లుగా బీజేపీ చెప్పకనే చెప్పింది అని అంటున్నారు. ఇక పోతే 2026లో తమిళనాడులో ఎన్నికలు జరుగుతాయి.అంటే గట్టిగా ఏడాది సమయం కూడా లేదు అని అంటున్నారు.

## పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు - జూన్ 29... కామేశ్వర రావు వర్ధంతి




తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావు ది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్, పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసం లాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలి పోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం. కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసే వారు. విడుదలైన తెలుగు సినిమాలనుబీ న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలే గాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా వ్రాసేవారు. 1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బుక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి. ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని వ్రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని వ్రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయాన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మం లాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద వ్రాసిన విమర్శలే కామేశ్వర రావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల. మొదట్లో రచయితగా పని చేశారు. అదే సమయంలోనే కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు. వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు. బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్రరావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభా వంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే. కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు.ఆ తర్వాత తీసిన 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు. 1962లో వచ్చిన 'గుండమ్మకథ', 'మహమంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫిస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమ్రోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరరావుకు మంచి పేరు తెచ్చుకుంది. కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్.వి.రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు. అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి. పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది. ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు. 'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి. దర్శకుడిగా కమలాకర కామేశ్వరరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా%ౌ% ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## వెండితెరపై మౌన ప్రేమకు శాశ్వత రూపం: దేవదాసు (1953)

### శోకగాథగా ప్రేమను భావించిన వెండితెర కథ దేవదాసు - 26.06.1953 నాడు దేవదాసు విడుదల అయి, 72 ఏళ్ళు గడిచిన సందర్భంగా




తెలుగు చలనచిత్ర చరిత్రలో 1953లో విడుదలైన దేవదాసు చిత్రం ఒక శాశ్వత మైలురాయి. ఇది కేవలం ఒక ప్రేమ కథను చెబుతోన్న చిత్రం కాదు %-% ఒక భావోద్వేగ ప్రవాహం, ఒక తాత్విక అక్షరగాథ, ఒక సాహిత్య కళానిర్మాణం, ఒక మానసిక సంఘర్షణ, ఓ సమాజ నిర్మిత ఒత్తిడుల మధ్య ప్రేమగా మొలకెత్తిన, భావోద్వేగాలకు వెండితెర రూపమిచ్చిన కళాత్మక ఘట్టంగా నిలిచిన ఓ తాత్విక జీవ చిత్రం. శరత్ చంద్ర ఛటర్జీ రాసిన బెంగాలీ నవల దేవదాస్ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం, ప్రేమలో విఫలమైన ఓ యువకుని ఆత్మవేదనను, నిరాశను, త్యాగాన్ని, జీవిత నిరుద్దేశాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. తెలుగు వెండితెరపై ఓ తాత్విక చిత్రంగా నిలిచిపోయిన ఈ చిత్రం, ప్రేమని పొందలేక పోయిన మనిషి విలాపాన్ని కళారూపంగా మలిచింది. శరత్ చంద్ర ఛటర్జీ రచించిన బెంగాలీ నవల దేవదాస్ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం, అక్కినేని నాగేశ్వరరావు నటన ఈ చిత్రానికి జీవం. దేవదాసు పాత్రలో ఆయన చేసిన అభినయం ప్రేమలో భయపడిన పురుషుడి మౌనాన్ని, బాధను, పతనాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఆఖరి శ్వాస వరకూ పార్వతిని మరిచి పోలేక పోయిన తన ప్రేమలోని త్యాగాన్ని, ఆత్మ వేదనను ఆయన ప్రతి అభినయం, చూపుతో మన కళ్ళ ముందుంచారు. సావిత్రి పార్వతిగా చేసిన పాత్ర, వేదనతో ప్రేమను ఎలా అణిచి వేయాలో చూపిన ఒక మౌన పోరాటం. ఆమె ముఖ కవళికలు, కన్నీటి ఆరని చాయలు ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయి. చంద్రముఖిగా లలిత నటన ప్రేమకు గౌరవం ఇచ్చే వేశ్య మనస్తత్వాన్ని ప్రతిబింబించింది. ఆమె పాత్రలో కనిపించిన మానవతా స్నేహం, దయా స్వరూపం చిత్రానికే కీర్తిని తెచ్చింది. సి ఎస్ ఆర్, ఎస్ వి రంగారావు పాత్రలలో లీనమై నటించి, జీవం పోశారు. ఈ చిత్ర సంగీతం %-% సంగీతమే కాదు, శోకానికి శబ్ద రూపం. సి.ఆర్. సుబ్బురామన్ స్వరాలు, విశ్వనాథన్-రామమూర్తి అనుబంధం, ఘంటసాల గాత్రం ఈ చిత్రాన్ని భావ ప్రకంపనల పరాకాష్టగా తీర్చిదిద్దాయి. అంతా భ్రాంతియేనా జీవితానా వెలుగింతేనా , ఓ దేవదా చదువు ఇదేనా, అంతా భ్రాంతియేనా జీవితానా వెలుగింతేనా, కల ఇదని నిజమిదని తెలియదులే బతుకింతేనులే, కుడి ఎడమైతె పొరపాటు లేదోయ్, ఓడి పోలేదోయ్, చెలియ లేదు చెలిమి లేదు వెలుతురే లేదు ఉన్నదంత చీకటైతె, జగమే మాయ బ్రతుకే మాయ, పల్లెకు పోదాం పారుని చూదాం చలో చలో పాటలు ఎన్నటికీ మరిచి పోలేని జ్ఞాపకాలు. శరత్ చంద్ర రచించిన నవల కాలాతీతమైన శోకగాథ. 1901లో రచితమై 1917లో ప్రచురితమైన ఈ నవల ప్రేమలో మౌనం, కుటుంబా నుబంధాల ముసుగులో ఓ యువకుడి జీవితం ఎలా పతన మవుతుందో అక్షరాలుగా ఆవిష్కరించింది. నవలలోని భావ పరంగా లోతైన వ్యక్తీకరణను తెరపైకి తేవడంలో దర్శకుడు వేదాంతం రాఘవయ్య, రచయితలు చేసిన కృషి ఎంతో ప్రాశస్త్యం కలిగినది. సముద్రాల రాఘవాచార్య సంభాషణలు నవల శైలిని ఆశ్రయించి, చిత్రానికి తగిన స్థాయిలో తాత్వికతను నింపాయి. ఈ చిత్రం ద్వారా ప్రేమలో పరాజయం ఓ పతనంగా కాదు, ఓ తాత్విక ఆవిష్కరణగా ప్రజ్ఞా పూరితంగా చెప్పబడింది. దేవదాస్ ఒక అపరాధ భావనతో బాధపడే వ్యక్తి కాదు %-% అతడు ప్రేమలో స్వార్థ రహితంగా తానుకు తాను త్యాగం చేసిన తాత్విక జీవం. అతడి మౌనం, అతడి మద్యం సేవనం, అతడి చివరి క్షణం - అన్నీ మానవ జీవితం లోని లోపాలను ప్రశ్నించేవి. ఈ చిత్రం లోని ప్రేమ స్వరూపం %-% పొంద దగినది కాదు, పరిమళించ దగినది. అది తృప్తికరం కాకపోయినా, త్యాగంగా మిగిలే భావద్వేగ బంధం. ఈ చిత్రం విడుదలైన వెంటనే తెలుగు ప్రేక్షకులను ప్రభావిత చేసింది. అప్పటి పత్రికలు ఈ చిత్రాన్ని "తెలుగు సినిమా భావ సామర్థ్యానికి కొత్త నిర్వచనం"గా పొగిడాయి. అఖిలాంధ్ర ప్రజల మనస్సుల్లో ఇది శాశ్వత గుర్తుగా నిలిచింది. పలు భాషల్లో దీనికి పునర్నిర్మాణాలు వచ్చినా, 1953లోని ఈ తెలుగు దేవదాసు కళాత్మకంగా, తాత్వికంగా తన స్థాయిని నిలబెట్టుకుంది. ఇది కేవలం సినిమా కాదు %-% ఒక భావ ప్రపంచం. ఒక వ్యక్తిగత ప్రేమకథ మాత్రమే కాదు %-% సామాజిక ఒత్తిడుల మధ్య నలిగిన తరం మానసిక చిత్రం. దేవదాస్ పాత్రను కొందరు ఓ మూరు?డిగా, ఓ పతితుడిగా భావించినా, అసలైన అర్థం అది కాదు. అతడిలో ప్రేమ చచ్చినప్పటికీ, ప్రేమలో జీవించి ఉండే తత్వం ఉంది. ఇది శోకానికి గాత్ర రూపం, త్యాగానికి కళా ప్రాతినిధ్యం. ఈ చిత్రం తెలుగుసినిమా చరిత్రలోని సంగీత, సాహిత్య, నటనా విలువలకు నూతన పరిమాణాన్ని ఇచ్చింది. సినిమాలకూ తాత్విక స్థాయి ఉంటుందన్న దానికి ఇది ఉదాహరణ. ప్రేమలో పరాజయాన్ని వికారం కాకుండా, ఒక విలయం, ఒక జీవన సందేశంగా చూపిన చిత్రం ఇది. ప్రేమ మానవతకు బీజాంశంగా మారిన చోట ఇది నిలిచింది. దేవదాసు అంటే ఓ ప్రేమికుడి దుఃఖం కాదు %-% ఒక తాత్విక సత్యం. అది వెండితెరపై మిగిలిపోయిన ఓ నిశ్శబ్ద గాథ. ప్రేమలో పరాజయం పొందినా, ప్రేమలో అర్థాన్ని కనిపెట్టిన ఓ నిబద్ధ జీవితం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## సంఖ్యల సౌరభం - జాతీయ గణాంక దినోత్సవ సందేశం - జూన్ 29... జాతీయ గణాంక దినోత్సవం




ప్రతి సంవత్సరం జూన్ 29న భారత దేశంలో జాతీయ గణాంక దినోత్సవాన్ని జరుపు కోవడం అనేది గణాంకాల ప్రాముఖ్యతను గుర్తు చేసే ఓ అరుదైన సాంప్రదాయం. ఈ రోజు భారత గణాంక శాస్త్ర పితామహుడు, ప్రముఖ శాస్త్రవేత్త, ఆర్థిక ప్రణాళికా మార్గదర్శకుడు అయిన ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతి. ఆయన సేవలను స్మరించుకునే కార్యక్రమాలే ఈ దినోత్సవానికి మూలం. గణాంక శాస్త్రాన్ని భారతదేశ అభివృద్ధికి ఒక సూత్రమైన సాధనంగా తీర్చిదిద్దిన మహాలనోబిస్ కృషికి ఇదే సరైన నివాళి. ప్రొఫెసర్ మహాలనోబిస్ 1893 జూన్ 29న కలకత్తాలో జన్మించారు. ప్రెసిడెన్సీ కాలేజీలో భౌతిక శాస్త్రం అభ్యసించి, తరువాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య పొందారు. అక్కడే గణాంక శాస్త్రం పట్ల ఆయన ఆసక్తి పెరిగింది. తిరిగి భారతదేశానికి వచ్చిన తరువాత ఆయన స్థాపించిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (%×ూ×%) దేశంలో గణాంక విద్య, పరిశోధనకు కేంద్రంగా మారింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'సంఖ్య' అనే పత్రికను ఆయన ప్రారంభించారు. వ్యవసాయ, ఉపాధి, జనాభా వంటి రంగాల్లో నమూనా సర్వేలు నిర్వహించి వాటి ఆధారంగా ప్రభుత్వ విధానాల రూపకల్పనకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన అభివృద్ధి చేసిన "మహాలనోబిస్ దూరం" అనే గణాంక ప్రమాణం వర్గీకరణ, నమూనా గుర్తింపు వంటి అనేక సాంకేతిక రంగాల్లో ఉపయోగ పడుతోంది. 1956లో ప్రారంభమైన ద్వితీయ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో ఆయన రూపొందించిన ''మహాలనోబిస్ మోడల్'' అనేది పారిశ్రామికాభివృద్ధికి ప్రాముఖ్యత నిచ్చే విధంగా రూపొందించబడింది. ఆయన సలహాలతో కేంద్ర గణాంక సంస్థ స్థాపించ బడింది, ఇది నేటి జాతీయ గణాంక కార్యాలయంగా పరిణమించింది. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1968లో పద్మవిభూషణ్ పురస్కారం ప్రదానం చేసింది. జాతీయ గణాంక దినోత్సవం ద్వారా గణాంకాల సామర్థ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గణాంకం కేవలం గణన కోసం మాత్రమే కాక, ప్రభుత్వ పాలన, విధాన నిర్ణయాలలో విశ్వసనీయ ఆధారంగా నిలుస్తుంది. ఉదాహరణకు, 2023 నాటికి భారత్ జనాభా 142 కోట్లకు చేరింది. ఈ జనాభా నిర్మాణాన్ని బట్టి వివిధ సందర్భాలలో విద్యా అవసరాలు, ఆరోగ్య సేవల కేటాయింపులు, ఉపాధి ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. అంతేకాక, పేదరిక స్థాయి గణాంకాల ప్రకారం 2011-12లో దేశంలో 21.9 శాతం మంది పేదరిక రేఖకు దిగువన ఉన్నారు. ఇటువంటి గణాంకాలు లేకుండా ఏ విధానం ప్రయోజనకరంగా ఉంటుందో అంచనా వేయడం అసాధ్యం. ఇప్పటి డేటా ఆధారిత ప్రపంచంలో గణాంక శాస్త్రం మరింత విస్తరించి, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో అనుసంధాన మవుతోంది. బిగ్ డేటా విశ్లేషణలు, ఆన్‌లైన్ సర్వేలు, డిజిటల్ డేటా సమీకరణం వంటివి సమాజం లోని మార్పులను విశ్లేషించడానికి కీలకంగా మారాయి. ప్రభుత్వం పలు కీలక పథకాలను, ఉదాహరణకు, ఉజ్వల యోజన, ఆరోగ్య మిషన్ వంటి వాటిని గణాంక ఆధారంగా లక్ష్యంగా మలచ గలిగింది. దీనివల్ల సమర్థవంతమైన సేవల అందుబాటు సాధ్యమైంది. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా ప్రధాన కేంద్రంగా ఉండగా, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో శాఖలు ఉన్నాయి. ఈ సంస్థ అప్లయిడ్ స్టాటిస్టిక్స్, బయోస్టాటిస్టిక్స్, ఎకనోమెట్రిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహిస్తోంది. యునెస్కో, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలకు %×ూ×% వితరణలూ, సూచనలూ ముఖ్యమవుతున్నాయి. భారతదేశంలో అనేక విశ్వవిద్యాలయాలు గణాంక విద్యను అందిస్తున్నాయి. ఐఐటి, ఐఐఎస్సీ, %×ూ×% వంటి సంస్థలలో గణాంకంలో అగ్రశ్రేణి విద్య, పరిశోధన జరుగుతోంది. డేటా అనాలిటిక్స్, ఆప్టిమైజేషన్ వంటి కోర్సులు ద్వారా యువతకు ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. గణాంకం ం కంప్యూటర్ సైన్స్ అనేది ప్రస్తుత కాలంలో శక్తివంతమైన కలయికగా నిలుస్తోంది. 2025 సంవత్సరానికి 'గణాంకాల ద్వారా సమగ్ర అభివృద్ధి' అనే అంశం గణాంక దినోత్సవం థీమ్‌గా తీసుకోవడం, ప్రగతి సాధనలో గణాంకాల కీలకతను గుర్తించడంలో ఒక ముఖ్య సూచన. ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, స్త్రీ-పురుష సమానత్వం వంటి రంగాల్లో గణాంకాలు మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ గణాంక దినోత్సవం ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది %-% సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునే శక్తి గణాంకాల్లో ఉంది. ప్రతి డేటా సూత్రం ఒక పరిశోధనకు ద్వారం, ప్రతి విశ్లేషణ ఒక సమాజాన్ని మెరుగు పరచే అవకాశం. గణాంకాల మౌలికతను మనం గుర్తించినపుడే, నిజమైన ప్రజా సంక్షేమ ప్రణాళికలు పుడతాయి. అలాంటి గణన దిశలో మహాలనోబిస్ లాంటి మహనీయులను స్మరించుకుంటూ, నిజమైన గణాంక విజ్ఞానంతో ముందుకు సాగడం ఈ దినోత్సవ అసలైన శుభార్థం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పోరుకు సన్నద్ధం

నల్గొండ : స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ వీడింది. 90 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు బెంచ్ ఆదేశాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. ముందుగా పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగే జిల్లా, మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే మండల పరిషత్తు అధికారు(ఎంపీడీవో)ల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంటు ఎన్నికల ముందు జిల్లా నుంచి సుమారు 20 మంది ఎంపీడీవోలు సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. వారు తిరిగి నల్గొండకు వచ్చే అవకాశం ఉంది. బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అధికారుల వివరాలు పంపించాలని జిల్లా పరిషత్తు అధికారులకు ఆదేశాలు అందడంతో వివరాలు సేకరించి జాబితా పంపించే పనిలో నిమగ్నమయ్యారు.

**రాష్ట్రంలోనే పెద్ద జడ్పీ**

రాష్ట్ర అసెంబ్లీ తర్వాత నల్గొండ జిల్లాపరిషత్తు మినీ అసెంబ్లీని తలపించ నుంది. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల, మండలాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుతో రాష్ట్రంలోనే నల్గొండ పెద్ద జిల్లాగా రూపాంతరం చెందింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాలో రెండు కొత్త మండలాలు ఏర్పాటుతో 31 జడ్పీ స్థానాల నుంచి 33 వరకు చేరాయి.



మండల పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాలు 349 ఉండగా పునర్విభజనతో 352 స్థానాలకు చేరాయి. ఇక్కడ జడ్పీ ఛైర్మన్‌కు దాదాపు సహాయ మంత్రి హోదా దక్కనుండటంతో చాలా మంది నేతలు జడ్పీ ఛైర్మన్ కుర్చీపై ఆశలు పెట్టుకున్నారు.

**ఏర్పాట్లు పూర్తి..!**

ప్రాదేశిక సమరానికి ఎప్పుడు ప్రకటన వచ్చిన ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే రిజర్వేషన్లు మినహా ఇతర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎంపీటీసీల పునర్విభజన, ఓటర్ల విభజన వంటి ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించే అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనుండటంతో దీనికి ఉపయోగించే పేపరును దిగుమతి చేసి నిల్వ ఉంచారు.

# సీడీపీ నిధులకు గ్రహణం

నల్గొండ : నియోజకవర్గ అభివృద్ధి పథకానికి గ్రహణం పట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్నా.. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పథకం(సీడీపీ) కింద వచ్చే నిధులు మాత్రం విడుదల కావడం లేదు. దీంతో ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది.

**గతంలో ఇలా..**ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం, సదుపాయాల కల్పన, తక్షణ అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.3 కోట్లు కేటాయించగా, ఆ నిధులను 2022-23లో భారాస ప్రభుత్వం రూ.5 కోట్లకు పెంచింది. ఇందులో రూ.3 కోట్లను ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టే అవకాశం ఉండగా, మిగిలిన రూ.2 కోట్లు విద్యాశాఖలో పాఠశాలల అభివృద్ధికి వెచ్చించాలని పేర్కొంది. అయితే విద్యాశాఖకు కేటాయించిన నిధులను గత ప్రభుత్వం నేరుగా ఆ శాఖకు విడుదల చేసేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా ఈ నిధులను నిలిపివేయడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడుతుంది. నిధులు విడుదల చేస్తే తాగునీరు, రహదారులు, అసంపూర్తి భవనాల పూర్తి , గ్రామాల్లో సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించే అవకాశం ఉంటుంది.

**ఎస్‌డీఎఫ్‌తోనే అభివృద్ధి పనులు**

సీడీపీ నిధులను ప్రభుత్వం కేటాయించకపోవడంతో నియోజకవర్గాల్లో ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎన్‌డీఎఫ్)తోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.10 కోట్లు మంజూరవుతాయి. ఈ నిధులను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలుండగా వాటిలో సూర్యాపేట నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. సూర్యాపేటలో మాత్రం భారాస ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి సీడీపీ నిధులు విడుదల కాకపోవడంతో కొంతమంది ఎమ్మెల్యేలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సీడీపీ నిధులు విడుదల చేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని, అలాగే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రులారా.. మా గోడు వినండి!

తలమడుగు : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏర్పాటు 16 ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. తొలుత సబ్ మార్కెట్‌యార్డు అనుకున్నా పూర్తిస్థాయి ప్రత్యేక మార్కెట్‌యార్డుకు అడుగులు ముందుకు పడినా అది స్థల సేకరణకే పరిమితమైంది. మార్కెట్ యార్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తలమడుగు మండలంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిల పర్యటన ఉన్నందున మూడు మండలాల రైతులు తమ గోడును విన్నవించ నున్నారు. ఆదిలాబాద్‌లో వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో ఆదిలాబాద్ గ్రామీణం, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన

పత్తి, సోయా, శనగలు, కందులు, జొన్న పంటలను విక్రయించేందుకు ఆదిలాబాద్ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. విక్రయాల వేళ రైతులంతా పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భీంపూర్, తలమడుగు, తాంసి మండలాల్లోని పలు గ్రామాల రైతులు 45 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి ఆదిలాబాద్ పట్టణానికి పంట తీసుకొస్తూ అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలో ఆరు మండలాలకు చెందిన 40 వేల మంది రైతులు ఉన్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో పంట విక్రయించేందుకు అక్కడే రెండు నుంచి మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. మూడు మండలాల రైతుల ప్రయోజనార్థం సుంకిడిలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్ల నుంచి ఉంది. తద్వారా 15 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. రైతుల పడిగాపుల ఇబ్బందులు దూరమవుతాయి. సుంకిడిలో మార్కెట్ యార్డు నిర్మాణం జరిగితే 24 వేల మంది అన్నదాతలకు ప్రయోజనం కలుగుతుంది.

# అందని గ్యాస్ రాయితీ.. ఎదురుచూపులే గతి



హైదరాబాద్ : జిల్లాలో వంట గ్యాస్ వినియోగదారులు రాయితీ డబ్బుల కోసం సుమారు ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ పథకాన్ని అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి కొన్నాళు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో రాయితీ డబ్బులు జమ చేసినా.. గత ఆరు నెలలుగా జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు ఎవరిని సంప్రదించాలో అర్థం కాక అయోమయంలో ఉంటున్నారు.

జిల్లాలో 3,65,101 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో గ్యాస్ రాయితీకి 2,76,913 మంది అర్హులు ఉన్నారు. వీరికి గతేడాది మార్చి నాటి నుంచి రాయితీ అమలు చేస్తున్నారు. ఆ సమయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.874 ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 లబ్ధిదారుల ఖాతాలో జమ చేసేది. మిగతా మొత్తం లబ్ధిదారులు చెల్లించాల్సి వచ్చేది. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ.47.38లను రాయితీ కింద జమ చేస్తుంది. ఈ లెక్కన సిలిండర్ రూ.326.62లకే వచ్చేది. దీంతో ఈ పథకం నిరుపేదలకు, మధ్యతరగతి బడ్జెట్ జీవులకు ఆసరాగా ఉండేది.

**ధర పెరగడంతోనూ ఇక్కట్లు..**

గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ డబ్బులను జమ చేయడం లేదు. దీంతో లబ్ధిదారులు సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు మూలిగే నక్కపై తాటి పండు అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ జమ చేయడం మానేస్తే మరోవైపు ఎల్‌పీజీ గ్యాస్ కంపెనీలు ఒక్కసారిగా ధరలను అమాంతం పెంచాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ రూ.924లకు లభిస్తోంది. దీనికి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.47.38 పోను వినియోగదారునికి రూ.876,62 చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు ప్రభుత్వ పథకం కింద రాయితీ జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పౌరసరఫరాలశాఖ అధికారులను సంప్రదించగా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

**మూడు నెలలే జమ** గ్యాస్ రాయితీ ఖాతాలో మూడు నెలలు జమ చేశారు. ఆపై వేయడం లేదు. ప్రతి నెలా గ్యాస్ రాయితీ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా రాయితీ డబ్బులు జమ చేయాలి. - శారద, గృహిణి, కరీంనగర్

# శంకుస్థాపనకే పరిమితం.. పట్టాలెక్కితే ప్రయోజనం




కరీంనగర్ : రవాణాశాఖ కార్యాలయాల్లో ఏజెంట్ల ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా పని జరగాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున వాహనాల ఏటీఎస్( ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదట కరీంనగర్ జిల్లా రవాణాశాఖ కార్యాలయ ఆవరణ(తిమ్మాపూర్)లో ఏటీసీ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. రూ.8 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ సెంటర్‌కు మార్చి 23న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణ బాధ్యత, యంత్రాల బిగింపు ప్రక్రియను ఆర్అండ్‌బీకి అప్పగించారు. అయితే నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

**సాంకేతికతతో మేలు**

ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లు నిండిన వాహనాలు 1.74 లక్షలకుపైగా ఉన్నాయి. ప్రస్తుతం ఆయా వాహనాలు తిరిగి రోడ్డెక్కాలంటే ఆర్టీఏ అధికారులు మ్యాన్యువల్‌గా పరీక్షలు చేసి ధ్రువీకరణపత్రాలు జారీ చేస్తున్నారు. ఏటీఎస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే వాహనాన్ని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షిస్తారు. వాహనంలోని అన్ని భాగాలు కండిషన్‌లో ఉన్నట్లు నిర్ధారిస్తేనే ఎఫ్‌సీ ధ్రువీకరణపత్రం జారీ అవుతోంది.

**అన్ని రకాల వాహనాలకు..**అత్యాధునిక సాంకేతికను జోడించి అందుబాటులోకి తెస్తున్న ఏటీఎస్ సెంటర్‌లో ద్విచక్ర, ఆటోలు, కార్లు ఇలా అన్ని రకాల వాహనాలను యంత్రాల ద్వారా పరీక్షిస్తారు. వాహనం నుంచి వచ్చే పొగ, వాహనాల టైర్లు, షాక్ అబ్జర్వర్ల పటిష్టత, టైర్ల అమరిక, ఇంజిన్ పని తీరు, వాహనం నిర్దేశించిన వేగం అందుకుంటుందా, ఇలా ప్రతీ విడి భాగాన్ని క్షుణ్ణంగా పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో ప్రమాదాల, కాలుష్య నివారణను తగ్గించడానికి వీలుంటుంది. ఆర్అండ్‌బీ శాఖ చూస్తోంది- పెద్దింటి పురుషోత్తం, డీటీసీ ఏటీఎస్ స్టేషన్ నిర్మాణ బాధ్యత రోడ్లు, భవనాల శాఖ చూస్తుంది. టెండర్ల విషయం, నిర్మాణం, యంత్రాల బిగింపు పూర్తయిన తర్వాతే మా పరిధిలోకి వస్తుంది. ఏటీఎస్ స్టేషన్ త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**త్వరలో టెండర్లు పిలుస్తాం**

- నర్సింహాచార్యులు, ఈఈ, ఆర్అండ్‌బీ శాఖ

జిల్లా రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)కు సంబంధించి త్వరలో టెండర్లు పిలుస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లు దాటిన వాహనాలు

| జిల్లా | వాహనాలు |
|---|---|
| కరీంనగర్ | 1,58,129 |
| జగిత్యాల | 4,283 |
| పెద్దపల్లి | 9,660 |
| రాజన్న సిరిసిల్ల | 2039 |

# చెరువుల్లో మట్టి దొంగలు



ధర్మపురి: ధర్మపురి పరిధిలోని పలు గ్రామాల చెరువులు, కుంటల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే దర్జాగా మట్టి అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. దీనిపై మైనింగు, రెవెన్యూ అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు. ధర్మపురి పట్టణంతోపాటు పలు గ్రామాల్లోని గుట్టలు, చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. దీంతో పలు చెరువుల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నీరు ఎక్కువగా ఉన్న సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వానాకాలంలో చెరువుల్లోకి దిగిన రైతులు, యువకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**దొంతాపూర్, తీగలధర్మారం గ్రామాల్లో గుట్టల ప్రదేశాల్లో మట్టిని తోడేస్తున్నారు. ఆయా పంచాయతీలకు, ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించడం లేదు. దీంతో అటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడటం, మరోవైపు ప్రకృతి సహజ సంపద తరిగిపోతుందని స్థానికులు, రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే దీనిపై దృష్టి నిలిపి చెరువులు, గుట్టల నుంచి తవ్వకాలు, రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**ఇటుక బట్టీలకు తరలింపు**

ధర్మపురి పట్టణంతోపాటు చుట్టుపక్కన సుమారు పల్లెల్లో పది వరకు ఇటుక బట్టీ పరిశ్రమలున్నాయి. అక్రమంగా తవ్వుతున్న మట్టిని ఇక్కడికి తరలిస్తున్నారు. దీనికి ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించడంలేదు. దీంతోపాటు పల్లెల్లో రహదార్లకు, ఇళ్ల నిర్మాణాలకు ఈ మట్టినే వినియోగిస్తున్నారు. వెంటనే ఈ మట్టి అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరముంది. **ఒక్కో ట్రిప్పునకు రూ.5 వేలు**

ధర్మపురితోపాటు, నక్కలపేట, దోనూర్, తీగలధర్మారం, దొంతాపూర్, జైన, నేరెళ్ల ప్రాంతాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. నేరెళ్ల-వెల్గొండ మధ్యన దూర ప్రాంతాల్లో ఎర్రమట్టి గుట్టలున్నాయి. ఇవన్నీ రిజర్వు అటవీ భూములే. ఇక్కడ ఎలాంటి మట్టిని తీయాలన్నా తప్పనిసరిగా అటవీ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఈ ఎర్రమట్టికి విలువ ఉండటంతో గుత్తేదార్లు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. రాత్రిళ్లు ఈ తతంగం అంతా జరుగుతోంది. దీనికి ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.5 వేల వరకు డిమాండు ఉంటోంది.

**చర్యలు తీసుకుంటాం**ధర్మపురితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెరువుల నుంచి అక్రమ మట్టి తవ్వకాలపై దృష్టి సారిస్తాం. పల్లెల్లోని చెరువుల నుంచి మట్టిని తీసుకుని వెళ్లాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. - ఇన్‌ఛార్జి తహసీల్దార్, సుమన్

# ఉన్నతంగా అడుగేయ్ విద్యార్థి..!

నాంపల్లి : కళాశాలలో అడుగుపెడుతున్నామంటే చాలు కొత్త అనుభూతి కలుగుతుంది. కొత్త మిత్రులు పరిచయమవుతుంటారు. స్వేచ్ఛాలోకంలోకి అడుగుపెతున్నామన్న భావన ఏర్పడుతుంది. ఈ తరుణంలో ఉన్నత లక్ష్యాలతో అడుగుపెట్టే కళాశాల విద్యే మన పునాది అన్న విషయం మరచిపోవద్దు. సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు అడుగులు వేయాల్సింది ఇక్కడి నుంచేనన్న ఆలోచన మదిలో గుర్తుంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**నొప్పించక.. తానొవ్వక..**

కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులు అందరితో త్వరగా కలిసిపోయే తత్వం ఏర్పరచుకోవాలి. కలివిడి మనస్తత్వాన్ని పెంచుకొని స్నేహం చేస్తే అందులో ఉండే మాధుర్యాన్ని ఆస్వాదించవచ్చు. ముఖ్యంగా నలుగురితో మాట్లాడటానికి, కలవడానికి ఇబ్బందిపడేవారు ఈ అంశంపై దృష్టి సారిస్తే కళాశాల జీవితం సాఫీగా సాగుతుంది. ఏ విషయమైనా ఎదుటివారిని నొప్పించకుండా నేర్పరితనంతో ధైర్యంగా చెప్పడం మేలు.

**అధ్యాపకులే దిక్సూచీ..**

కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను అధ్యాపకులు తరచూ పలకరిస్తుండాలి. ఎలాంటి ఇబ్బందులెదురైనా తాము అండగా ఉన్నామన్న భావన కలిగించాలి. చదువులో వెనకబడినప్పుడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా అర్థం చేసుకునేలా శ్రద్ధ చూపించాలి. సున్నితంగా ప్రేరణ కలిగించేలా ప్రసంగించాలి. కళాశాల కార్యక్రమాల్లో జూనియర్లను ప్రతిసారీ భాగస్వామ్యం చేస్తుండాలి.

**చెడు వ్యసనం.. భవిష్యత్తు నాశనం**

కళాశాల విద్య సమయంలోనే విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారే అవకాశముంది. ప్రస్తుతం ప్రతి విద్యార్థి చేతిలో స్మార్ట్‌ఫోన్ కీలకంగా మారింది. దీంతో అనవసరమైన చిత్రాలు చూసే అవకాశం అధికంగా ఉంది. ధూమపానం, మత్తు పదార్థాలు తదితర అలవాట్లకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యం విద్యార్థులపై ఓ కన్నేసి ఉంచాలి.

**ప్రవేశాలు మొదలు..**

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ పూర్తికావొస్తుంది. పాలిటెక్నిక్, పీజీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు తరగతులూ త్వరలో ప్రారంభం కానున్నాయి.

**అవకాశం వదలొద్దు..**

ఇంటర్ వార్షిక పరీక్షల్లో 90శాతానికి పైగా మార్కులు సాధిస్తే డిగ్రీ ఆపై స్థాయి వరకు ఐదేళ్లపాటు ఏడాదికి రూ.10 వేల చొప్పున విద్యార్థికి ఇంటర్ విద్యా శాఖ వారు ప్రోత్సాహకం అందజేస్తారు. డిగ్రీ చదువుల్లో జిల్లా స్థాయిలో రాణిస్తే రూ.3 వేలు, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకు సాధిస్తే, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో సీటు వస్తే నగదు పురస్కారాలను కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారు అందిస్తారు. ఇలాంటి అవకాశాలను వినియోగించుకుంటే ఉన్నత విద్యకు మార్గం సుగమమవుతుంది.

**అందరి సహకారం అవసరం :** మహ్మద్ ఇస్మాయిల్, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నార్కట్పల్లి

అధ్యాపకులు నూతన విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణంలో పాఠ్యాంశాలను బోధించాలి. సీనియర్లు.. జూనియర్లకు ఎలాంటి ఇబ్బందులున్నా మేమున్నామనే భరోసా ఇవ్వాలి. కొత్తగా కళాశాలల్లో అడుగుపెట్టే వారికి సీనియర్లు, అధ్యాపకుల సహకారం ఎంతో అవసరం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి.ఉమ్మడి నల్గొండ జిల్లాలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 31


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు: 11

# అనర్హుల గుట్టు.. తనిఖీతో రట్టు

సూర్యాపేట : ప్రభుత్వం ప్రతి నెల ఆసరా పింఛన్లను పంపిణీ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 57 సంవత్సరాలు నిండిన వారికి వృద్ధాప్య పింఛను ఇస్తామని ప్రకటించింది. దీంతో ఈ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారు. కాగా ప్రస్తుతం ఆసరా పింఛన్ల పంపిణీలోనూ ఆడిట్ (సామాజిక తనిఖీ) నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేపడుతోంది. అందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ మాదిరిగా నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ విధానం ద్వారా అనర్హులను గుర్తించే అవకాశం ఉండటంతో పాటు ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు వీలుంటుంది.

**దివ్యాంగ, వృద్ధాప్యంలోనే అధికం**

జిల్లా వ్యాప్తంగా 1,45,682 మంది లబ్ధిదారులు ఆసరా పింఛన్లు పొందుతున్నారు. వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళా కేటగిరీలకు చెందిన వారితో పాటు హెచ్ఐవీ, బోదకాలు, డయాలసిస్ బాధితులు ఉన్నారు. ప్రధానంగా దివ్యాంగుల, వృద్ధాప్య కోటాలో పింఛను పొందుతున్న వారిలో అనర్హులు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు దళారులను ఆశ్రయించి వైకల్యం లేకున్నా సదరం ధ్రువపత్రం పొంది పింఛన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు ఆధార్ కార్డులో వయసు ఎక్కువ



వేసుకుని వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖ ద్వారా వేలిముద్రలు తీసుకుని అందజేస్తున్నారు. వేలిముద్రలు పడని వారి తరఫున పంచాయతీ కార్యదర్శి వేలిముద్ర వేసి అందజేస్తున్నారు. ఇవి సవ్యంగా జరగడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. వీటన్నింటి నేపథ్యంలో సామాజిక తనిఖీయే అక్రమాలకు చెక్ పెట్టేందుకు సరైన మార్గమని భావిస్తూ ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తోంది. సామాజిక తనిఖీ ఎలా ఉండాలన్న విషయమై ప్రభుత్వ ఆదేశానుసారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు విధివిధానాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

ఆదేశాలు రావాల్సి ఉంది.. : అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

ఆసరా పింఛన్ల విషయంలో ఆడిట్ నిర్వహించే విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఇప్పటికే వివిధ విభాగాల్లో పింఛను పొందుతున్న వారి వివరాలను ప్రభుత్వానికి నివేదించాం.

# రేయి.. బస్సులేవీ..?

హైదరాబాద్: రూ.వందల కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక హంగులతో నిర్మించినా.. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో అనేక రైళ్లను చర్లపల్లికి మళ్లించడం, పలు ప్రత్యేక రైళ్లు ఇక్కడి నుంచి ప్రారంభమవుతుండటంతో రాత్రివేళ స్టేషన్ చేరుకునేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి 10 దాటితే అటువైపుగా వెళ్లే ఒక్క ఆర్టీసీ బస్సు కనిపించదు. ప్రైవేటు క్యాబ్ లేదా ఆటో కోసం వెతుక్కోవాల్సిందే. దీంతో వారు అడిగినంత ఇవ్వాల్సి వస్తోంది. చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం 95 రైళ్లలో 30వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వారి సౌకర్యం దృష్ట్యా గ్రేటర్ ఆర్టీసీ 45 బస్సులను నడుపుతోంది. రాత్రి 9.30 గంటలకే చివరి బస్సు ఉండటంతో రైళ్లను అందుకోవడం ఇబ్బందిగా మారింది. తిరుపతికి వెళ్లే కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరుతుంది. చర్లపల్లి తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైలు రాత్రి 9.45 గంటలకు, నాందేడ్– విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్



రాత్రి 9.30 గంటలకు బయలుదేరుతుంది. కాచిగూడ రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి 10.20కి బయలుదేరి.. మల్కాజిగిరి జంక్షన్ దాటి 10.52కి చర్లపల్లి స్టేషన్ చేరుకుంటుంది. ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికులు మణుగూరు ఎక్స్‌ప్రెస్ అందుకోవాలంటే రాత్రి 11.30గంటలకల్లా చర్లపల్లిస్టేషన్‌లో ఉండాలి. ఈ రైలు ఇక్కడి నుంచి 11.55కి బయలుదేరుతుంది. సనత్‌నగర్, ఫిరోజ్‌గూడ, సుచిత్రసెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్‌వాసులు రాత్రిపూట చర్లపల్లి స్టేషన్ చేరుకునేలా ఒకే ఒక్క ఎంఎంటీఎస్ నడుపుతున్నారు.

**రాత్రి 9.30గంటల తర్వాత..**

నాందేడ్ – విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి – కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి రాక్సాల్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – దర్భంగ ఎక్స్‌ప్రెస్, డెల్టా ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి పట్నా స్పెషల్, వాస్కోడిగామ వీక్లీ ఎక్స్‌ప్రెస్, నాగర్‌సోల్ నర్సాపూర్ సూపర్‌ఫాస్ట్, నాగర్‌సోల్ నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్ కాచిగూడ ఎక్స్‌ప్రెస్.

# శౌచాలయాలు.. ఉచితం కాదు

హైదరాబాద్: మరుగుదొడ్ల సేవలు ఉచితంగా అందించాలనే ఆలోచనను జీహెచ్ఎంసీ విరమించుకుంది. నిర్వహణ కోసం రూ.కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నా.. శుభ్రతా ఉండటం లేదని గుర్తించింది. సగానికిపైగా దుర్వాసన, దుర్గంధంతో రహదారులపై చెత్తకుప్పల కన్నా దారుణంగా తయారయ్యాయి. ఈ కారణంగానే జీహెచ్ఎంసీ ఉచిత విధానానికి స్వస్తి చెప్పడానికి ప్రతిపాదన సిద్ధం చేసింది. గురువారం నాటి స్థాయీ సంఘం సమావేశంలో తీర్మానాన్ని ఆమోదింపజేసుకుని.. వీలైనంత తొందరగా శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లకు కొత్త రూపం




ఇవ్వాలని నిర్ణయించుకుంది.

**కొత్త విధానంతో..** నగరంలో అయిదేళ్ల కిందట రూ.60 కోట్లతో మూడు వేల ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు(పీఎఫ్‌టీ), బయో, ఆర్‌సీసీ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఏడాది తిరగకుండానే సగం నిరుపయోగంగా మారాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు జీహెచ్ఎంసీ గుత్తేదారులను నియమించింది. నెలకు ఒక్కో నిర్మాణానికి రూ.35వేలు చెల్లించింది. పారిశుధ్య విభాగం ఎస్ఎఫ్ఏ, ఏఎంఓహెచ్‌లు శుభ్రత పనులు జరుగుతున్నట్లు సంతకాలు చేయడం, గుత్తేదారులు ఐదేళ్లు నిర్వహణ పేరుతో సొమ్ము నొక్కేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో చేసిన సర్వేలో నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు ప్రస్తుత కమిషనర్ ఆర్వీ కర్ణన్ గుర్తించారు. తాజాగా ఈ నిర్ణయానికి వచ్చారు.

# ఆశావహుల్లో ఉత్సాహం

కరీంనగర్ : గ్రామ పంచాయతీ ఎన్నికలు సెప్టెంబరు 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో దిగే ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే గతంలో పోటీ చేసి పదవీకాలం ముగిసిన వారు.. కొత్తగా బరిలో దిగేవారు పోటీ చేసేందుకు కసరత్తు చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కూడా సిద్ధం చేసుకుంది. ఎన్నికల సంఘం తేదీ ప్రకటించడమే ఆలస్యం అన్నట్లుగా ఉంది.

**గ్రామాల్లో కోలాహలం** 2024 జనవరి 30న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,224 గ్రామ పంచాయతీలు, 11,180 వార్డులు ఉన్నాయి. వీటికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. హైకోర్టు తీర్పుతో గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక రాజకీయాలపై ఆసక్తి ఉన్న ఆశావహులు ప్రధాన పార్టీల మద్దతుపై దృష్టి పెట్టారు. **రిజర్వేషన్లపై ఉత్కంఠ** ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్ ఉంది. ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు కొత్త ప్రతిపాదనలతో రిజర్వేషన్ల ప్రక్రియలో మార్పులు జరగనున్నాయి. దీంతోపాటు గత ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం 2019లో కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల వరకు కొనసాగాలి. దీనిపైనా ప్రస్తుతం ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందా అన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. గత రిజర్వేషన్ల ప్రకారం అధికారులు ఇప్పటికే నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. మరోవైపు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విషయంలో సంబంధిత యంత్రాంగం సిద్ధంగా ఉంది.

# విద్యార్థుల్ని చదివి.. విలువలు నేర్పి



హైదరాబాద్: తరగతి గదుల్లో పిల్లల మనసెరిగి విద్యాబోధన చేసేలా వినూత్న బోధన పద్ధతులను రాష్ట్రంలోనే తొలిసారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రవేశపెట్టనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సామాజిక నేపథ్యం తెలుసుకుని వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని తదనుగుణంగా అవసరమైన సిలబస్‌ను రూపొందించనుంది. ఓయూ ఉపాధ్యాయ విభాగం ఆచార్యులు సిలబస్ రూపకల్పన చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కొత్త సిలబస్ ఉండాలన్న లక్ష్యంతో అమెరికాలోని నోటెర్‌డామ్ విశ్వవిద్యాలయం ప్రతినిధి ప్రొఫెసర్ నీల్‌బూత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

**తొలుత ఆచార్యులు.. తర్వాత అధ్యాపకులు**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల మనసులను అర్థం చేసుకుని పాఠాలు చెప్పడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. తొలుత ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆచార్యులకు రెండువారాలపాటు శిక్షణ ఇవ్వడం, అనంతరం బీఈడీ కళాశాలల్లో అధ్యాపకులకు సామాజిక, భావోద్వేగాల ఆధారంగా పాఠాలను ఎలా వివరించాలన్న అంశాలపై అవగాహన కల్పించనున్నారు. నోటెర్‌డామ్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఓయూ ఆచార్యులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

**కౌమార దశలో అత్యంత కీలకం**

కౌమారదశ విద్యార్థులకు సామాజిక, భావోద్వేగ విద్య అత్యంత కీలకంగా మారనుంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతి విద్యార్థుల్లో 50 శాతానికిపైగా సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లను అనుసరిస్తున్నారు. ఎందుకు సరిగా చదవడంలేదని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తే... తోటి విద్యార్థుల ముందు అవమానించారని భావిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావంతో కొన్ని తొమ్మిది, పదోతరగతి చదువుకుంటున్న విద్యార్థుల్లో కొందరు సిగరెట్లు, ఈ–సిగరెట్లు కాల్చుతున్నారు. అశ్లీల చిత్రాలు చూస్తున్నారు. ఇలాంటి విద్యార్థుల మానసిక పరిస్థితిని తెలుసుకుని సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాలు, చెడు అలవాట్ల పర్యవసానాలను వివరించి వారి ప్రవర్తనలో మార్పులు వచ్చేలా చేయనున్నారు.

**శిక్షణ నైపుణ్యాలు.. ఉత్తమ పరిశోధనలు**

ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, వీసీ, ఓయూ

ఆచార్యులు, అధ్యాపకులు, కాబోయే ఉపాధ్యాయుల్లో శిక్షణ నైపుణ్యాలను పెంచేందుకు, సంయుక్తంగా ఉత్తమ పరిశోధనలు చేసేందుకు రెండు వర్సిటీల మధ్య ఒప్పందం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. మూడు, నాలుగేళ్లలోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కొత్త విధానంలో పాఠాలు చెప్పనున్నారు. ఈ విధానం ప్రత్యక్షంగా, పరోక్షంగా విద్యార్థుల ప్రవర్తనలో విభిన్న, వినూత్న మార్పులను తీసుకురానుంది.

# చిన్నాసుపత్రికి చిక్కిపాయె.. పెద్దాసుపత్రే దిక్కాయె



హైదరాబాద్ : వానాకాలంలో ఎంతో కీలకమైన ప్రాథమిక వైద్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల నిర్వహణ గాడి తప్పుతోంది. వైద్యులు, సమయపాలన లేక, సిబ్బందికి జీతాలు అందక వైద్యం అంతంతమాత్రంగానే అందుతోంది. నగరంలో 250 వరకు బస్తీ దవాఖానాలు, 95కు పైగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వందకు పైగా పీహెచ్‌సీలున్నాయి. అనేకచోట్ల లోపాలు, సమస్యలు ఉన్నాయి. ఆసిఫ్‌నగర్, ఉస్మానియా ఆసుపత్రి: వానాకాలం నేపథ్యంలో ఆయా కేంద్రాల పరిధిలో పూర్తి సన్నద్ధత అవసరం ఉంది. కొన్నిచోట్ల బీపీ మందులు లేవు. చాలా బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేరు. ఉన్నచోట సమయపాలన పాటించడం లేదని రోగులు వాపోతున్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రోగులు పోటెత్తడంతో వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. 80 శాతం సమస్యలకు ప్రాథమిక స్థాయిలో చికిత్సతో సరిపోతుంది. మలేరియా, డయేరియా, డెంగీ ఇతర వ్యాధులకు ఇక్కడ చికిత్సలు చేయాల్సి ఉండగా వీరంతా పెద్దాసుపత్రులకు వెళ్తున్నారు.

**జీతాలు లేక లబోదిబో**

బస్తీ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ వైద్యులు, సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. దీని ప్రభావం రోగులకు అందించే సేవలపై పడుతోంది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని గుత్తేదారులు జీతాలు ఆపేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా జీతాలు చెల్లించిన తరువాత ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకోవడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా ప్రభుత్వం ఇవ్వలేదు కాబట్టి... తాము చెల్లించలేమని చేతులెత్తేస్తున్నారు.

**కొన్ని కేంద్రాల్లో ఇలా..**

బంజారాహిల్స్‌లోని షౌకత్‌నగర్ బస్తీలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో జూబ్లీహిల్స్ యూపీహెచ్సీ నుంచి డిప్యూటేషన్‌పై సేవలు అందిస్తున్నారు. రోడ్డు నంబరు 7లో వైద్యుడు సెలవుపై ఉండటంతో బస్తీ దవాఖానాల నుంచి రోజుకు ఒక వైద్యుడు వస్తున్నారు.

చాంద్రాయణగుట్ట బస్తీ దవాఖానాలో 25 రోజులుగా బీ3, బీ12 పరీక్షలు నిలిచిపోయాయి. గౌలిపురలోని పటేల్‌నగర్ బస్తీ దవాఖానాలో వారానికి నాలుగు రోజులు మాత్రమే వైద్యుడు అందుబాటులో ఉంటున్నారు.

షాపూర్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటు మందులు లేవు. వైద్యులు సెలవు పెడితే సీనియర్ సిబ్బందే ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు.


కూకట్‌పల్లి దీనబంధు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రానికి 3 నెలలుగా వైద్యుడు లేరు. వెంకటేశ్వరనగర్ బస్తీ దవాఖానా వైద్యుడే 3 రోజుల చొప్పున రెండుచోట్ల పనిచేస్తున్నారు. ఫతేనగర్, దిల్‌కుష్‌నగర్ బస్తీ దవాఖానాకు వైద్యులు లేక రోగులు మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్నారు. బీపీ, మధుమేహం మందుల కొరత ఉంది.

ముషీరాబాద్, బోలక్‌పూర్, బైబిల్‌హౌస్ ఆరోగ్య కేంద్రాల్లో బీపీ మాత్రల కొరత ఉంది. టెల్మా40 మాత్రలు లేవు.

బోలక్‌పూర్, బైబిల్‌హౌస్ ఆసుపత్రిల్లో వైద్యాధికారి లేరు.

అల్లాపూర్‌లోని పర్వత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇద్దరు డాక్టర్లకు బదులు ఒక్కరే ఉన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ లేక రక్త, ఇతర పరీక్షలు చేయడం లేదు. మరుగుదొడ్లలో నీళ్లే రావడం లేదని రోగులు వాపోతున్నారు.

# వెలగని దీపం.. విడిభాగాల శాపం



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్(ఈఈఎస్ఎల్) చేతులు ఎత్తేయడంతో వీధిదీపాల నిర్వహణ, కొత్త లైట్ల బిగింపు, మరమ్మతులు పూర్తిగా నిలిచిపోయాయి. పైగా మూడు నెలల కిందట టెండర్ ఒప్పందం కూడా ముగిసింది.

నగరపాలక సంస్థ కార్యాలయ పరిధిలో వీధి దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు ఉండటంతో రూ.50 లక్షలతో టెండర్ పిలిచారు. విలీన గ్రామాలతోపాటు పాత 60 డివిజన్‌లలో సుమారు వెయ్యికిపైగా వీధి దీపాలు వెలగడం లేదు. పూర్తి స్థాయిలో విడి భాగాలు అందించాల్సి ఉండగా ఒకటెండ్రు తప్ప మిగతావి బహిరంగ మార్కెట్‌లో లభించడం లేదు. ఈఈఎస్ఎల్ సంస్థ ఉత్పత్తి చేసినవే క్షేత్రస్థాయిలో బిగించడంతో అసలు సమస్య మొదలైంది. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు మాత్రం 18 వాట్స్‌కు సంబంధించిన పీసీబీలు, డ్రైవర్స్ అందించారు. మిగతా 70, 80, 110, 190 వాట్స్‌లకు సంబంధించిన విడిభాగాలు ఒక్కటీ లేవు. **పని చేయని సెన్సార్లు**

నగరవ్యాప్తంగా పలు చోట్ల టైమర్ సెన్సార్లు పని చేయకపోవడంతో వీధి దీపాలు సాయంత్రం త్వరగా, కొన్ని చోట్ల ఆలస్యంగా వెలుగుతుండగా ఉదయం 9 గంటల వరకు బంద్ కావడం లేదు. టైమర్లు, రిలేలు కలిపి 700 బాక్స్‌లలో 400 పని చేయడం లేదు. సింగిల్ మూడు, నాలుగు బ్రేకర్లు సుమారు 2 వేల వరకు పని చేయడం లేదు. **స్మార్ట్‌సిటీ.. లెక్క ఏదీ?**

స్మార్ట్‌సిటీలో భాగంగా వీధి దీపాలు ఎక్కడ ఏర్పాటు చేశారో వాటన్నింటిని పరిశీలించి, వెలిగించి బల్దియాకు అప్పగించాలి. దీపాలు వెలగని చోట కేబుల్ వేయలేదు. వాస్తవంగా రెండేళ్లపాటు నిర్వహణ చూసుకొని పూర్తి స్థాయిలో ఆ లైట్లు వెలుగుతున్నట్లు పేర్కొంటూ ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ఇంజినీరింగ్ అధికారులు చోద్యం చూస్తూ బిల్లులు కూడా తయారు చేసి ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. **మరమ్మతులు చేయిస్తున్నాం**

పెద్ద లైట్లకు సంబంధించిన విడి భాగాలు తెప్పించి మరమ్మతులు చేయిస్తున్నాం. కొన్ని డైవర్స్ రావాల్సి ఉంది. రాగానే పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఆయూబ్‌ఖాన్, ఇన్‌ఛార్జి డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

# సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 'సెస్' జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్లు గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించారు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది. సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

# వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం


సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# కన్నేస్తే కనిపెట్టేస్తారు

హైదరాబాద్ : నగర శివారు ప్రాంతాల్లో చెరువులు, జలవనరుల ఆక్రమణకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రతి చెరువు, జలవనరుకు సంబంధించిన వివరాలను సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాల్లోని చెరువుల్లో అరవై శాతానికిపైగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, ప్రధానంగా ఐటీ కారిడార్, ఉప్పల్, మేడ్చల్ చుట్టూ విస్తరించి ఉన్నాయి. ఈ క్రమంలో ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా గ్రామ నక్షాలు, డిజిటల్ సర్వే నిర్వహించి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ణయిస్తున్నారు. అనంతరం ప్రతి చెరువుకు జియోట్యాగ్ చేసి వివరాలు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. చెరువులు, జలవనరుల రక్షణకు రెండు జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు స్థిరాస్తి వెంచర్లకు సమీపంలోని చెరువులను తరచూ పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాయి. చెరువుల వద్ద సీసీ కెమెరాలు పెట్టనున్నారు.

**గుర్తించిన అంశాలు**



గ్రామ నక్షాలు, సర్వే ఆధారంగా చెరువులకు సమీపంలో వెంచర్లు వేసిన, భవనాలు నిర్మించిన వారిలో కొందరు బఫర్‌జోన్‌లను ఆక్రమించినట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని తేల్చారు. వందకుపైగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లను మార్చేసినట్లు తేలింది. కుత్బుల్లాపూర్ మండలంలో బఫర్‌జోన్‌లో ఓ వ్యక్తి విల్లాలు నిర్మించగా వాటిని కూల్చి హదులు ఏర్పాటు చేశారు.

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చెరువులు: 2094
సర్వే చేసేందుకు గుర్తించినవి 1698
ప్రాథమికంగా పూర్తయినవి 1189
వైబ్‌సైట్‌లో నమోదైనవి 275

# అప్రమత్తతే.. ప్రాణాలకు రక్ష

జగిత్యాల : విద్యుదాఘాతంతో ప్రాణనష్టాన్ని నివారించేందుకు విద్యుత్తు సంస్థ ఈనెల 7 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోంది. సిబ్బందికి విద్యుత్తు ప్రమాదాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూనే ప్రజలు విద్యుదాఘాతానికి గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పించే చర్యలు క్షేత్రస్థాయిలో ఈ వారం రోజులపాటు తీసుకోనున్నారు. మొదట విద్యుత్తు సిబ్బందికి భద్రత సూచనలపై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రత్యేక చర్యలు**

ఇటీవల విద్యుత్తు సంస్థ ఆన్‌లైన్ లైన్ క్లియర్(ఎల్‌సీ) విధానాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో క్షేత్రస్థాయి అధికారికి ఆన్‌లైన్‌లో లైన్ క్లియరెన్స్ ఎందుకోసం తీసుకుంటున్నామనే దానిపై సమాచారం ఇవ్వాలి. అనంతరం ఆపరేటర్‌కు ఆన్‌లైన్‌లోనే ఏ ఫీడర్‌కు లైన్ క్లియర్ కావాలో తెలియజేయాల్సి ఉంటుంది.

ఫీడర్ తాలుకూ ఫొటో సైతం ఆపరేటర్ లైన్‌మెన్‌కు పంపాల్సి ఉంటుంది. ఇలా సంస్థ ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనుంది.

క్షేత్రస్థాయి సిబ్బంది లైన్ క్లియర్(ఎల్‌సీ) తీసుకున్న లైన్‌కు రెండు చోట్ల ఎర్త్‌రాడులు బిగించాలి. డబుల్ ఫీడర్ ఉంటే విద్యుత్తు కనిపెట్టే పరికరాన్ని వెంట తీసుకువెళ్లి ఫీడర్‌లో సరఫరా లేదనే విషయాన్ని నిర్ధారించుకోవాలి.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్తు స్తంభాలను, సంబంధిత ఉపకరణాలను ముట్టుకోరాదు.

పశువులను మేతకు తీసుకువెళ్లినప్పుడు అవి నియంత్రికలు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.

ఇంట్లో నాణ్యమైన విద్యుత్తు ఉపకరణాలు వాడాలి.

మోటారు మరమ్మతు అర్హత కలిగిన మెకానిక్, ఎలక్ట్రిషియన్‌తో చేయించాలి. విద్యుదాఘాతానికి గురైన వారిని రక్షించడానికి వారిని నేరుగా పట్టుకోరాదు. కర్రతో విద్యుత్తు తీగను వేరు చేయాలి.

తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న తక్కువ ఎత్తులోని విద్యుత్తు తీగలను తాకకూడదు. వీటిని గమనించిన వెంటనే స్థానిక విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల చరవాణి నంబర్ లేకుంటే విద్యుత్తు సంస్థ ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలి.

**వ్యవసాయ మోటార్ల వద్ద..**

రైతులు వ్యవసాయ మోటారుతోపాటు, స్టార్టర్ బాక్స్‌లకు ఎర్తింగ్ చేయించుకోవాలి మోటారుకు వినియోగించే తీగ అతుకులు లేకుండా చూడాలి. వ్యవసాయ క్షేత్రంలో నేలపై ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్తు వైర్లు వేయరాదు స్టార్టర్ బాక్స్‌లు ఇనుప వాటి స్థానంలో ప్లాస్టిక్ డబ్బాలు వాడాలిప్రతి రైతు తన వెంట టెస్టర్ తీసుకువెళ్లడం ఉత్తమం

**అవగాహన కల్పిస్తున్నాం** విద్యుత్తు విషయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరుగుతుంటాయి. రైతులు, వినియోగదారులు ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వారోత్సవాల్లో భాగంగా అధికారులు, సిబ్బంది భద్రత చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
రమేశ్‌బాబు, ఎస్ఈ, కరీంనగర్

# గాడి తప్పుతున్న జల శుద్ధి



కరీంనగర్ : కరీంనగర్ నగరానికి తాగునీటి అవసరాలకు దిగువ మానేరు జలాశయాన్ని వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచి నీటిని శుద్ధి కేంద్రానికి తరలిస్తారు. అనంతరం రిజర్వాయర్ల గుండా గొట్టపు మార్గంలో ప్రతి ఇంటికి నల్లాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రైవేటు డబ్బా నీళ్ల కంటే ఎక్కువగా శుద్ధి చేస్తూ.. నాణ్యతపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తుండటంతో అధిక శాతం ప్రజలు నల్లా నీటినే పలు రకాలుగా వడబోసి తాగుతున్నారు. ఆ నీటి విషయంలో ఈ మధ్య నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆలం, క్లోరినేషన్ నిల్వలు లేకపోవడంతో నీటిశుద్ధి ప్రక్రియ ఎలా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పరీక్షలు చేశాకే రిజర్వాయర్లకు...**

నగరానికి హైలెవల్ జోన్‌కు మిషన్ భగీరథ ద్వారా, లోలెవల్‌కు పాత ఫిల్టర్‌బెడ్ ద్వారా నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ దగ్గర ఎలాంటి ఇబ్బంది లేకపోగా, పాత ఫిల్టర్‌బెడ్ దగ్గర మూడు నెలలుగా ఆలం నిల్వలు లేకపోవడంతో క్లోరినేషన్‌తోనే శుద్ధి చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాం నుంచి వచ్చే రావాటర్‌ను బెడ్స్‌లలో పలుమార్లు శుద్ధి చేసిన తర్వాత ఆలం పాయింట్‌కు వెళ్తాయి. అక్కడ మురికి నీటిని తెల్లగా చేసి క్లోరినేషన్ దగ్గరకు చేరుస్తారు. ఇక్కడ పరీక్షలు చేసిన తర్వాత రిజర్వాయర్లకు నీటిని పంపిణీ చేస్తున్నారు.

**వర్షాకాలంలో ఇదేంటి..**

వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో జల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. కొత్తగా వచ్చే నీరు కలిసి సమస్యలు వచ్చే అవకాశముంటుంది. మురికి, మలినాలతో వచ్చే నీటిని శుద్ధి చేయాలంటే కచ్చితంగా ఆలం అవసరమే. అప్పుడే నీటి రంగు మారుతోంది. లేదంటే మురికిగా వస్తున్నాయనే ఫిర్యాదులు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేసేందుకే నానావస్థలు పడుతున్నారు. పలుచోట్ల నీరు కలుషితం అవుతుందని అంటున్నారు. దాంతో రిజర్వాయర్ల దగ్గర అప్పుడప్పుడు బ్లీచింగ్ పౌడర్ కలుపుతున్నారు.

**సరఫరాలో జాప్యం..**

నీటిశుద్ధి కేంద్రంలో ఆలం, క్లోరినేషన్ సిలిండర్లు ఎప్పటికప్పుడు నిల్వ ఉంచుకోవాల్సి ఉండగా మూడేళ్లుగా ఎప్పటికప్పుడే సరఫరా చేస్తుండటంతో నీటి నాణ్యతపై ప్రభావం పడుతోంది. సరఫరా చేసే సమయంలో ఆలస్యం జరిగితే పరిస్థితి ఏమిటనే విషయాన్ని గుర్తించడం లేదు. నీటిని శుద్ధి చేసేందుకు రోజుకు 50 కిలోల ఆలం అవసరం ఉంటుంది. వారానికి ఒక క్లోరినేషన్ సిలిండర్ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఆలం లేకపోవడంతో నెలకు 12 క్లోరినేషన్ సిలిండర్లు వాడుతున్నట్లు సమాచారం.

**నిల్వ ఉండేలా ఆదేశాలు**

నీరు శుద్ధి చేసేందుకు కావాల్సిన ఆలం, క్లోరినేషన్ సిలిండర్లు నిల్వ ఉండేలా ఆదేశాలు జారీ చేశాం. కొత్తగా నీరు వచ్చే సమయంలో అవసరముంటుంది. సరఫరాలో ఆలస్యం చేయడంపై చర్యలు చేపట్టాం. కచ్చితంగా నీటి శుద్ధిని పరిశీలించిన తర్వాతే సరఫరా చేస్తాం.
ఆర్.యాదగిరి, ఈఈ, కరీంనగర్ నగరపాలిక

# నిండు జీవితం.. ఘర్షణలతో హతం



సిరిసిల్ల : మానవత్వం మంటగలుస్తోంది. కారణం ఏదైనా హత్యలకు దారితీస్తోంది. జిల్లాలో తరచూ దారుణాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది అయిదు నెలల్లో ఏడు హత్యలు జరిగాయి. మొన్నటికి మొన్న చందుర్తిలో ప్రధాన రహదారిపై కిరాతకంగా హత్యచేసి వచ్చి పోలీసులకు లొంగిపోయిన తీరు భయోత్పాతాన్ని సృష్టిస్తోంది.

**పట్టు సడలుతున్న నిఘా**

జిల్లాలో నిఘా వ్యవస్థ పట్టు కోల్పోతోంది. నేరం జరిగిన తర్వాత పోలీసులు హడావుడి చేస్తున్నారు. చందుర్తికి చెందిన మనోజ్ 2023 సెప్టెంబరు 23న గంగారాం అనే వ్యక్తిని హత్యచేశాడు. అప్పుడు అతను మైనర్. జైలుకు వెళ్లి వచ్చాడు. తర్వాత అతనిపై నాలుగు కేసులు నమోదయ్యాయి. 2024లో రౌడీ షీట్ తెరిచారు. నిత్యం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిరావడంతో అక్కడి సిబ్బందితో కలివిడిగా ఉంటున్నాడు. ఈ నెల 26న హత్య జరిగిన రోజు ఓ ప్రేమ జంట ప్రేమ వ్యవహారంలో మధ్యవర్తిత్వానికి వెళ్లినట్లు సమాచారం. అలాగే ఒక వ్యక్తిని గంజాయి కేసులో ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. ఈ కేసు విచారణలో తప్పని తేలడంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారులు మెమోలు జారీచేశారు. జిల్లాలో 121 మందిపై రౌడీషీట్లు ఉన్నాయి. వీరు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తరచూ వెళ్తున్నారు. వీరిలో చాలా మందిని పోలీసులు ఇన్ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని వారు గ్రామాల్లో మరింతగా రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చందుర్తి ఘటనలో మల్లవ్వ కుటుంబసభ్యులు తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ హత్య జరిగిన రోజు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

**శిక్షలు తక్కువే..**


జిల్లాలో జరుగుతున్న హత్యల్లో జీవితకాలం, పది సంవత్సరాలకు పైగా శిక్షలు పడుతున్నవి తక్కువే. 2023, 2024లో ముగ్గురు చొప్పున జీవితకాల శిక్షలు పడగా పది సంవత్సరాలు శిక్షలు పడింది అయిదుగురికి మాత్రమే. హత్యలు చోటు చేసుకున్న తర్వాత హంతకులు బాధిత కుంటుంబ సభ్యులను బెదిరించడం ఇతర మార్గాల్లో పైరవీలతో రాజీకి ఒప్పిస్తున్నారు. పోలీసుల హత్య కేసులు త్వరగా పరిష్కరించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచి నిందితులకు శిక్షలు పడేలా చేస్తే ఇలాంటి రాజీలకు తావుండదు.

**ఇటీవలి ఘటనలు ఇలా..**

మే 27న చందుర్తికి చెందిన మల్లవ్వ కుటుంబ సభ్యులతో హత్యచేసిన మనోజ్ కుటుంబసభ్యులకు కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. పోలీసులు, పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఎలాగైనా మల్లవ్వను అడ్డు తొలగించుకోవాలని భావించి తన తల్లి మోహినవ్వ ప్రోత్సాహంతో మనోజ్ హత్య చేశాడు.

ఏప్రిల్ 13న వేములవాడకు చెందిన పర్శరాములు కొన్నేళ్లుగా అతని మిత్రులతో కలిసి గంజాయి విక్రయించేవాడు. కొన్ని రోజులకు అతను ఆ దందా నుంచి పక్కకు తప్పుకున్నాడు. ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలో పనిచేసిన వారిపై పలు కేసులు నమోదయ్యాయి. పర్శరాములే గంజాయి రవాణా సమాచారం పోలీసులకు అందజేస్తున్నారని మిత్రులు అనుమానపడ్డారు. ఈ క్రమంలోనే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# సీసీ లైనింగ్ పనులకు అంచనాలు సిద్ధం



గుర్రంపోడు : ఏఎమ్మార్ ప్రాజెక్టు ప్రధాన కాల్వ సీసీ లైనింగ్ పనుల ప్రతిపాదనలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. నేడో, రేపో ఈ ప్రతిపాదనలపై ప్రాజెక్టు సీఈ అనుమతి తీసుకోగానే ఎక్కడి పనులకు అక్కడే టెండరు నోటీసులు ప్రకటించనున్నారు. ఏప్రిల్ 30న ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ సీసీ లైనింగ్ పనులకు రూ.442 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతిని ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నాటి నుంచి ప్రాజెక్టు అధికారులు సీసీ లైనింగ్ అంచనాల తయారుచేయటం ప్రారంభించారు. పుట్టంగండి నుంచి గుర్రంపోడు సమీపంలోని హెడ్‌రెగ్యులేటర్ (ప్రధాన కాల్వ 23.500 కి.మీ. నుంచి 47 కిలోమీటరు వరకు) రూ.99 కోట్లతో అంచనాలు సిద్ధం చేయగా, గుర్రంపోడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి పానగల్ ఉదయ సముద్రం వరకు (47.760 కి.మీ నుంచి 93.530 కి.మీ) రూ.171.55 కోట్లు, ఉదయ సముద్రం దిగువ నుంచి మూసీ వరకు (100 కి.మీ నుంచి 136.కి.మీ ) రూ.93.6 కోట్లు అంచనాలు సిద్ధం చేసినట్లు అధికారి ఒకరు వెల్లడించారు. రూ.78 కోట్లు సీనరేజీ ఛార్జీలకు, మట్టి, కంకర పనులకు సంబంధించి అనుమతుల ఫీజులు, 0.1 శాతం ప్రొవిజన్ టవర్స్ ఎన్ఏసీ ఛార్జీలు, 1 శాతం ప్రొవిజన్ టవర్స్ లేబర్ ఛార్జీలు, 18 శాతం జీఎస్‌టీ చెల్లింపులకు వినియోగిస్తారు. అంతేకాక అయిదు శాతం ఈవీసీ, కరెంటు స్తంభాలను మార్చటం, ఇంజినీర్లకు కొలతలకు టేపులు, క్రాస్‌టాప్ వంటి సామగ్రి కొనుగోళ్లు, సైన్ బోర్డులు, ఫొటోగ్రఫీ, ఇతరాల కోసం ఖర్చు చేయాల్సి ఉంది. ఎస్ఎస్ఆర్ 2024–25 రేట్ల ప్రకారం వీటిని తయారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే పనులకు టెండర్లు ప్రకటించి పనులను గుత్తేదారులకు అప్పగించనున్నట్లు చెబుతున్నారు. **కాల్వ తవ్వి 40 ఏళ్లకు పైనే**

ప్రధాన కాల్వ 1985 నుంచి 1988 వరకు తవ్వకం పనులు సాగాయి. అవి పూర్తయి సుమారు 40 ఏళ్లకు పైనే కాగా 2001లో నీటిని విడుదల చేశారు. ఈ మధ్య కాలంలో ప్రధాన కాల్వ చాలా చోట్ల కోతకు గురైంది. ప్రధానంగా గేట్లు రెండు వైపులా రెండు నుంచి నాలుగు అడుగుల మందం మట్టి కొట్టుకు పోయినట్లు చెబుతున్నారు. ఇంకా చాలా చోట్ల కంప చెట్లు పెరిగి గట్టు దెబ్బతిన్నాయి. తొలుత కోతకు గురైనా మట్టిని పునరుద్ధరించిన అనంతరం దానిపై 100 మిల్లీ మీటర్ల మందంతో సీసీ వేస్తారు.

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం–ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలిలా..

మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు. ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ–ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.

పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ
ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ–నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8–12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు. బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు– చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.

కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు

ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు– చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

చురకలు



# అంతా మా ఇష్టం

చిత్తూరు : జిల్లా జల వనరుల శాఖలో ఉద్యోగుల బదిలీలు ఇష్టారాజ్యంగా జరిగాయి. బదిలీలు కాగితాల్లోనే తప్ప.. వారి స్థానాలు మాత్రం పదిలంగానే ఉన్నాయి. అంతా మా ఇష్టం.. మమ్మల్ని ఇక్కడి నుంచి కదిలించే వారెవరు.. అన్న రీతిలో కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. ఒక ప్రాంతాన్ని యూనిట్‌గా తీసుకుని ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసుకున్న వారిని విధిగా బదిలీ చేయాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలు అమలు కాలేదు. ఒకే ప్రాంతంలో ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్లు పనిచేస్తున్న వారు అక్కడే వారి స్థానాలు పదిలంగానే ఉన్నాయే తప్ప.. కాగితాలకే బదిలీలు పరిమితమయ్యాయని ఆ శాఖ ఉద్యోగుల నుంచే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మమ్మల్ని ఎవరూ కదపలేరు** ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జిల్లా జల వనరుల శాఖలో విధులు నిర్వహిస్తున్న అన్ని కేడర్లలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఈ నెల 9న పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సూపరింటెండెంట్లు నలుగురు, సీనియర్ అసిస్టెంట్లు 17 మంది, జూనియర్ అసిస్టెంట్లు 22 మంది, టైపిస్టులు ఇద్దరు, అటెండర్లు 33 మంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆరుగురు కలిపి మొత్తం 84 మందిని బదిలీ చేశారు. వీరిలో 10-15 మంది మినహా మిగిలిన వారందరూ వారి స్థానాల్లోనే పదిలంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు.



**వారానికి ఒక రోజు సంతకం**

చిత్తూరు సర్కిల్ కార్యాలయం, చిత్తూరు, పలమనేరు, శ్రీకాళహస్తి, తిరుపతి డివిజనల్ కార్యాలయాల్లో కొందరు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లు ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలోనే పనిచేస్తున్నారు. వీరిలో కొందరు ఉద్యోగులు బదిలీ అయిన ప్రాంతంలోనే పేరుకే బాధ్యతలు స్వీకరించి.. తర్వాత ఏళ్లుగా తిష్ట వేసిన స్థానంలోనే విధులు నిర్వహిస్తుండడమే కాకుండా.. బదిలీ అయిన ప్రాంతంలో వారానికి ఒక రోజు వెళ్లి హాజరైనట్లు సంతకాలు పెడుతున్నారంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏపాటిదో అర్థమవుతోంది. తమ స్థానాన్ని వదలకూడదని కొందరు ఉద్యోగులు డిప్యుటేషన్ల నిమిత్తం పైరవీలు సాగిస్తున్నారు. మరికొందరు తమకు డిప్యుటేషన్ ఉత్తర్వులివ్వాలని ఉన్నతాధికారులకు దరఖాస్తులు సమర్పిస్తున్నారు.

**కొందరికే డిప్యుటేషన్లు** పరిపాలన పరమైన అవసరాలను దృష్ట్యా త్వరలో కొందరికి డిప్యుటేషన్లు ఇవ్వనున్నాం. బదిలీ అయిన ఉద్యోగులు నిర్దేశిత ప్రాంతాల్లోనే విధులు నిర్వహించాల్సిందే. - వెంకటేశ్వర్‌రాజు, ఎస్‌ఈ, జిల్లా జల వనరుల శాఖ

## ఐఐటీలో ఏఐ, డేటా సైన్స్ కోర్సు

ఏర్పేడు : ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ కలిగిన డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ నిపుణులను తయారు చేసేందుకు తిరుపతి భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీ) శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నూతనంగా డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మాస్టర్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చింది. ఎంటెక్ 2025-26 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం 25 సీట్లు ఉండగా గేట్ అర్హత సాధించిన విద్యార్థులకు 15 కేటాయిస్తారు. మిగిలిన విద్యార్థులకు 10 సీట్లు కేటాయించారు.

**ఉపయోగాలు ఇలా..**

ఎన్నో కష్టతరమైన సమస్యలు సకాలంలో పరిష్కరించేందుకు దోహదపడుతుంది. డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగంలో వివిధ ప్రయోగాలు, అత్యాధునిక నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు. మెరుగైన ఆర్థిక వ్యవస్థను రూపొందించేందుకు వీలుంటుంది.

**ఫీజు వివరాలు**



గేట్ అర్హత సాధించిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు సెమిస్టర్‌కు రూ.8వేల వంతున నాలుగు సెమిస్టర్లకు చెల్లించాలి. విద్యార్థులు హెచ్‌టీఏపీ (ఉపకార వేతనాలు) నెలకు రూ.12,400 పొందుతారు. మిగిలిన వారు సెమిస్టర్‌కు రూ.40వేలు చెల్లించాలి.

దరఖాస్తు గడువు: జులై 07 వరకు

అర్హతలు: ఏఐసీటీఈ గుర్తించిన బీఈ, బీటెక్, ఎంఎస్‌ఈ, ఎంసీఏ, ఎంఎస్ పూర్తి చేసిన వారు.

ప్రవేశ పరీక్ష: జులై 12న (ఆన్‌లైన్)

మౌఖిక పరీక్ష: జులై 15,16

ఫలితాల విడుదల: జులై 18 తరగతుల ప్రారంభం: జులై 30, 31న ఓరియంటేషన్ కార్యక్రమం ఉంటుంది.

## బృహత్తర ప్రణాళికకు మరో అడుగు!

శ్రీకాళహస్తి,: శ్రీకాళహస్తీశ్వరాలయం చుట్టూ బృహత్తర ప్రణాళిక అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. రానున్న వందేళ్లలో ముక్కంటి ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు సకల వసతులు అందుబాటులో ఉండేలా గత తెదేపా హయాంలో సీఎం చంద్రబాబు ఇందుకు సంబంధించి దిశానిర్దేశంతో భూసేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వాలు మారాయి, ఏళ్లు గడిచిపోయాయి. ప్రణాళిక అమలులో మాత్రం జాప్యం జరుగుతూనే ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక భూసేకరణ పూర్తి స్థాయిలో ముగించారు. **వసతుల కల్పనే లక్ష్యం**

బృహత్తర ప్రణాళిక అమలు నేపథ్యంలో వందేళ్లలో ఇక్కడి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా అభివృద్ధి చేపట్టాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. తొలి విడతగా రూ.250 కోట్ల వ్యయంతో తిరుమల తరహాలో క్యూ సముదాయాలు, విశాల భవనాలు, రోడ్లు, ఆహ్లాదాన్నిచ్చే ఉద్యానాలు అభివృద్ధి పరచనున్నారు. కనీస వసతులు మరింత అందుబాటులోకి తెస్తారు. భక్తుల దర్శనం పూర్తయ్యాక కాస్తంత సమయం ప్రశాంతంగా ఇక్కడ గడిపేలా పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతారు. అధికారులు కూడా భూసేకరణ అడ్డంకులు తొలగిపోవడంతో ఇక అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**నిరీక్షణ కష్టాలు..** ముక్కంటి భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వారాంతాల్లో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఆలయం చుట్టూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులు సిద్ధంగా ఉన్నా భూసేకరణ పూర్తికాకపోవడంతో జాప్యం జరిగింది. 2018లో ప్రారంభమైన భూసేకరణ తంతు ఇటీవలే ఓ కొలిక్కి వచ్చింది.

# పనితీరుకు అరుదైన ఘనత



పెందుర్తి : పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రాష్ట్రస్థాయి ఉత్తమ పాలిటెక్నిక్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) ఆంధ్రప్రదేశ్ విభాగం ఈ అవార్డును ప్రకటించినట్లు ఆయన వివరించారు. ఆగస్టు 13, 14 తేదీల్లో మదనపల్లెలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే వేడుకలో ఈ అవార్డు ప్రదానం చేస్తారన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 200కుపైగా పాలిటెక్నిక్ కళాశాలలు పోటీ పడగా పెందుర్తి ప్రభుత్వ కళాశాల అనుసరిస్తున్న ఇండస్ట్రీ కనెక్ట్ విధానం ఈ అవార్డు పొందడానికి దోహదపడింది. ఈ కళాశాల మై ఆక్సిస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు పారిశ్రామిక సంబంధిత శిక్షణ అందిస్తోంది. ఇవే కాక ఇతర ప్రత్యేకతలు ఏమిటంటే..

విద్యార్థులకు హైబ్రిడ్ ఈవీ ద్విచక్ర వాహనం తయారీపై శిక్షణ

ఐవోటీ, ఎండెడెడ్ సిస్టమ్స్ ల్యాబ్ ద్వారా తర్ఫీదు

**మెకట్రానిక్స్, రోబోటిక్స్ హబ్ ఏర్పాటు**


లోటల్ వైర్‌లెస్ టెక్నాలజీస్ సంస్థ సహకారంతో ఆటోమేషన్ సెంటర్ ఏర్పాటుతో ఎలక్ట్రికల్ విభాగానికి ఊతం

**ఎలక్ట్రానిక్ వాహనాల బ్యాటరీల అసెంబ్లింగ్‌లో శిక్షణ**

గంగవరం పోర్టు సహకారంతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.27లక్షలతో క్యాడ్ ల్యాబ్ ఏర్పాటు

ఇండస్ట్రీ కనెక్ట్‌లో భాగంగా విద్యార్థులతో పీసీబీల రూపకల్పన, తయారీలో భాగస్వాములను చేయడంబీ పీఎంకేవీవై పథకంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయంతో కళాశాలలో స్కిల్‌హబ్ ఏర్పాటు. ఇప్పటి వరకు ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ బ్యూటీథెరపీ, అసోసియేట్ ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ ట్రైనీ, మెనిక్యూరిస్ట్, పెడిక్యూరిస్ట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సుల్లో వందలాది మంది యువతకు శిక్షణ. అందరి సహకారంతోనే: అధ్యాపకులు, సిబ్బంది సహకారం వల్లే మా కళాశాలకు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. విద్యార్థులకు సమగ్రమైన ప్రయోగాత్మక శిక్షణ అందించి పారిశ్రామిక అవసరాలకు తగిన అర్హతలతో వారిని బయటకు పంపించాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నాం. విద్యార్థులు కూడా ఇక్కడి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలి. - డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ప్రిన్సిపల్

# బాలికా విద్యకు భరోసా



అనకాపల్లి: బాలికా విద్యను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాలు ఏర్పాటు చేసింది. బాలికలకు కావాల్సిన అన్నిరకాల వసతులతో వీటిలో విద్యను అందిస్తుండటంతో వీటికి ఆదరణ పెరుగుతూ వచ్చింది. విద్యార్థినులు పదో తరగతితో చదువు ఆపేయకూడదని వీటిని జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించారు. గత ప్రభుత్వం విద్యాలయాల హోదా పెంచినా అవసరమైన వసతుల కల్పనను గాలికొదిలేసింది. దీంతో చాలాచోట్ల షెడ్లు, వరండాలు, అసంపూర్తి భవనాల కిందనే బోధన కొనసాగింది. అప్పట్లో నాడు-నేడు కింద కొన్ని భవనాలను మంజూరు చేస్తున్నామంటూ.. కాలయాపన చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో నిధుల ఊసే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఇందుకోసం భారీగా నిధులు మంజూరు చేసింది. త్వరలో అందుబాటులోకి రానున్నాయి. అదనపు భవనాలకు రూ. 46.4 కోట్లు..అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో మొత్తం 39 కస్తూర్బా బాలికల విద్యాలయాలు ఉన్నాయి. వీటిని పలు దశలుగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ.. కనీస సదుపాయాలు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం బాలిక కష్టాలను గుర్తించి.. అదనపు భవనాల కోసం ప్రభుత్వం రూ. 46.4 కోట్లు కేటాయించింది. ఒక్కో విద్యాలయానికి సగటున రూ. 1.6 కోట్లు వెచ్చించడంతో పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ నిధులతో ప్రతి పాఠశాలలో 6 డార్మిటరీ గదులు, రెండేసి మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం నిధులు భారీగా కేటాయించడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. భవనాల నిర్మాణం, ప్లాస్టరింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా కిటికీలు, విద్యుత్తు, రంగులు, ఫర్నిచర్ వంటి పనులు మిగిలి ఉన్నాయి. 70 శాతానికి పైగా పనులు పూర్తయినట్లు సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు. ఈ పనుల వేగం చూస్తే అతి త్వరలో భవనాలు అందుబాటులోకి వచ్చేలా ఉన్నాయి. బాలిక విద్యకు ఆటంకాలు తొలగనున్నాయి.

**అదనపు సదుపాయాలకు ప్రాధాన్యం..** కస్తూర్బా విద్యాలయాల్లో అదనపు భవనాలు నిర్మిస్తూనే.. ఇతర మౌలిక సదుపాయాలకు కూడా నిధులు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో కేజీబీవీలో అధునాతన కంప్యూటర్ గది, గ్రంథాలయం, ఆర్ట్, క్రాఫ్ట్ రూంలు నిర్మిస్తున్నారు. వీటితోపాటు రక్షణ గోడలు, చిన్నచిన్న మరమ్మతులు చేస్తున్నారు. వీటికోసం అదనంగా రూ. 9.5 కోట్లు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు.

**త్వరలో అందుబాటులోకి.**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేజీబీవీలకు ప్రాధాన్యం ఇచ్చింది. విరివిగా నిధులు సమకూర్చింది. అదనంగా నిర్మిస్తున్న కంప్యూటర్ రూం, గ్రంథాలయానికి కూడా నిధులు విడుదలయ్యాయి. పనులన్నీ చివరి దశకు వచ్చాయి. మిగిలిన పనులు త్వరలో పూర్తిచేస్తాం. - జయప్రకాశ్, ఏపీసీ, అనకాపల్లి

# సాగుకు మరింత సాయం

అనకాపల్లి,: వ్యవసాయంలో కూలీల నుంచి విత్తనాల వరకు అన్ని ఖర్చులు పెరుగుతున్నాయి. కానీ బ్యాంకులు అందించే రుణాలు మాత్రం చాలా తక్కువగా ఉంటున్నాయి. దీంతో రైతన్నలు వ్యవసాయ పెట్టుబడులకు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. పంట చేతికి వచ్చాక ఆదాయం అంతా వడ్డీలకే సరిపోతోంది. అందుకే 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందించే రుణ పరిమితిని బ్యాంకులు, సహకార సంఘాలు పెంచాయి. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు కలిసొస్తాయి. జిల్లాలోని రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా వరి విత్తనాలను సరఫరా చేస్తోంది. కేజీ విత్తనానికి రూ. 10 రాయితీ అందిస్తుంది. జిల్లాలో ఏటా 85,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి అధికం. ఈ పంటను 54,493 హెక్టార్లలో వేస్తున్నారు. వరి సాగుకు కూలీల అవసరం ఎక్కువ. నాట్ల నుంచి కోతల వరకు కూలీలతో పని ఉంటుంది. వరి తర్వాత చెరకు సాగు ఎక్కువగా చేస్తుంటారు. ఏటా 7,850 హెక్టార్లలో వేస్తున్నారు. చెరకు సాగుకూ ఖర్చులు ఎక్కువే. విత్తనం నుంచి ఎరువుల వరకు పెట్టుబడులు అధికంగా పెట్టాలి. గతంలో సహకార చక్కెర కర్మాగారాలు రాయితీపై విత్తనం, ఎరువులు అందించేవి. జిల్లాలోని నాలుగు కర్మాగారాల్లో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ మూతపడగా.. గోవాడ పరిస్థితి అయోమయంలో ఉంది. దీంతో రైతులు చెరకు సాగుకు అయ్యే ఖర్చులు బ్యాంకులు లేదా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకోవాల్సి



వస్తోంది. ఇకపై బ్యాంకు రుణ పరపతి పెరగడం సాగుదారులకు ఊరటనివ్వనుంది. ఏటా ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. వరి, చెరకు, గంటి, చోడి వంటి పంటలు గిట్టుబాటు కానందున రైతులు ఉద్యాన పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగానే కూటమి ప్రభుత్వం పలు రాయితీలు అందించి ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 57,238 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో జీడిమామిడి, కొబ్బరి, మామిడి అధికం.

# రాజకీయ అండ.. మట్టి మాఫియా దందా..!

కుప్పం : శాంతిపురానికి కూత వేటు దూరంలో తుమ్మిశి వాదుల చెరువులో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. శాంతిపురం పరిసరాల్లో వాణిజ్య స్థలాల చదునుతోపాటు నిర్మాణాలకు అవసరమైన మట్టిని వాదుల చెరువు నుంచే తరలిస్తున్నారు. మండల సచివాలయానికి ఆమడ దూరంలో నెలల తరబడి తవ్వకాలు సాగుతున్నా.. పట్టించుకునే వారు కరవయ్యారు. మండల పరిధి కుప్పం-పలమనేరు జాతీయ రహదారి పక్కన మొరసనపల్లె చెరువులో మట్టిని తవ్వేస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారులు స్థలాల చదును కోసం 30 అడుగుల లోతున మట్టిని తవ్వడంతో చెరువు రూపు కోల్పోయింది. చెరువు పటిష్టత ప్రశ్నార్థకంగా మారిందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా పాలనలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో మట్టి మాఫియా రాజ్యమేలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. నేతల అధికారం అండతో మట్టి వ్యాపారస్థులు పేట్రేగిపోతున్నారు. సామాన్య రైతులు పొలాల చదును.. భూసారం కోసం మట్టిని తీసుకోవడానికి సవాలక్ష నిబంధనలు విధిస్తున్న అధికార గణం.. మట్టి మాఫియాపై మాత్రం



చర్యలు తీసుకోవడం లేదని జనం ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన వారు ప్రభుత్వ స్థలాల్లో విచ్చలవిడిగా మట్టిని తవ్వి తరలిస్తున్నా.. నియంత్రించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శిస్తున్నారు.

**పటిష్ఠత కోల్పోతున్న కట్టలు**

కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సాగునీటికి ప్రధాన ఆదరువుగా ఉన్న దాదాపు 550 చెరువుల్లో చాలా చోట్ల మట్టి తవ్వకాలు నిత్యకృత్యంగా మారాయి. కట్టలు, తూములను ఆనుకొని యంత్రాలతో మట్టిని పెకలిస్తున్నందున పటిష్టత కోల్పోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతిపురం మండలంలో మఠం, గుండిశెట్టిపల్లె, చౌడంపల్లె, కర్లగట్ట, తుమ్మిశి పెద్ద చెరువులో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. కుప్పం మున్సిపాలిటీలో పాతపేట, లక్ష్మీపురం, పరమసముద్రం, గ్రామీణ పరిధిలో పీబీనత్తం, దాసేగౌనివూరు, రామకుప్పం పరిధిలో మిట్టపల్లె, కెంచనబళ్ల, విజిలాపురం, రామకుప్పం, మణీంద్రం, గుడుపల్లె మండలంలో శెట్టిపల్లె, ఏబీవాడ, కప్పలనత్తం తదితర చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

**చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలపై సమాచారం అందిస్తే.. మండల, క్షేత్ర స్థాయి అధికారుల ద్వారా అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటాం**
- శ్రీనివాసరాజు, కుప్పం ఆర్డీవో

## ఆర్టీసీ ఆదాయానికి.. మోకాలడ్డు

తిరుపతి : ఏపీఎస్ ఆర్టీసీకి బస్సులతోపాటు వాణిజ్య సముదాయాలు, దుకాణాల ద్వారా అధిక ఆదాయం సమకూరుతోంది. సంస్థ మనుగడకు ఈ ఆదాయమే కీలకంగా మారినా దానిని దూరం చేసేందుకు కొందరు నేతలు అడ్డుపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి కేంద్రీయ బస్‌స్టేషన్‌లో 145 దుకాణాలు ఉండగా అందులో 115 దుకాణాలు హోటల్, ఫాస్ట్‌ఫుడ్స్, కూల్‌డ్రింక్స్ తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లతో కలిపి నెలకు రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. బస్‌స్టేషన్ ప్రవేశ మార్గంలో 24 ఏళ్లకు ఒకసారి టెండర్ల ద్వారా కేటాయించే డిపాజిట్ ఆపరేషన్స్ ట్రాన్సఫర్ (డీవోటీ) స్టాళ్లు ఉన్నాయి. వీటిని గతంలో టెండర్ల ద్వారా కేటాయించగా అందులో ప్రధానంగా హోటల్ నిర్వహణకు నెలకు రూ.16,500 అద్దె చెల్లించేలా ఓ ప్రభుత్వ ఉద్యోగి టెండర్ దక్కించుకున్నారు. మిగిలిన స్టాళ్లను వివిధ వ్యాపారాల నిమిత్తం టెండరు విధానంలో అప్పగించారు. నిబంధనల మేరకు సంస్థ అద్దె పెంచుతూ రావడంతో చివరిదశలో వివాదం నెలకొని సదరు హోటల్ వ్యాపారి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు సుదీర్ఘంగా కొనసాగగా 2023 ఆగస్టులో కొట్టివేసింది. ఇదే సమయంలో దుకాణాలు నిరుపయోగంగా మారి సంస్థ ఆదాయానికి రూ.కోట్లలో గండిపడింది.

**రెండేళ్ల టెండర్లకు మొగ్గు**



ప్రస్తుతం ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో అధికారులు డీవోటీ టెండర్లను కాకుండా రెండేళ్ల టెండర్లను ఆహ్వానించి కేటాయింపు ప్రక్రియను పూర్తిచేశారు. హోటల్, మెడికల్ షాపు, ప్రొవిజన్స్, చెప్పుల దుకాణం మొత్తం ఆరు స్టాళ్లకు కలిపి సంస్థకు రూ.5 లక్షల ఆదాయం సమకూరనుంది. అయితే హోటల్ అందుబాటులోకి వస్తే చుట్టుపక్కల ఉన్న కొన్ని తమ వ్యాపారం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో పక్కనే ఉన్న ఓ హోటల్ యజమాని తన రాజకీయ పలుకుబడితో టెండర్ రద్దు చేయాలని మొదటి నుంచి సర్వప్రయత్నాలు చేసినట్లుగా తెలుస్తోంది. విజయవాడలోని ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, రాజకీయ ముఖ్యనేతలతో ఫోన్‌లో సంప్రదింపులు జరపడంతోపాటు తాయిళాల ఆశచూపి అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించేందుకు ఉన్నతాధికారులు విముఖత చూపుతున్నారు.

# వందల్లో రోగులు.. వైద్యులు ముగ్గురు

రాయదుర్గం : రాయదుర్గం ప్రాంతంలో ఎంతో కీలకమైన ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. వైద్యుల కొరత కారణంగా ఈ దుస్థితి తలెత్తింది. బదిలీలతోపాటు పలువురు రాజీనామా చేసి వెళ్లడంతో అరకొర వైద్యానికి పరిమితం కావాల్సి వస్తోంది. దీంతో ప్రస్తుతం ఉన్న వైద్యులు ఒత్తిడికి గురికావాల్సి వస్తోంది. మొత్తం ఆరుగురు డాక్టర్లు సేవలు అందించేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ముగ్గురు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మెర్సీ జ్ఞానసుధ ఎమ్మిగనూరుకు, చిన్నపిల్లల వైద్యుడు ఉమామహేశ్ కదిరికి, మరో సీనియర్ వైద్యుడు మోహన్‌సాయి చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

**వివాదం తలెత్తడంతో..!**

రాయదుర్గంలో విధులు నిర్వహించడానికి వైద్యులు ఎవరూ ఇష్టపడలేదనే చర్చ నడుస్తోంది. గతంలో ఇక్కడ పని చేసే సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా విభేదాలు రావడంతో పలువురు రాజీనామా చేసి వెళ్లిపోయారు. గతంలో సెక్యూరిటీ సిబ్బంది రోగులకు సెలైన్



ఎక్కిస్తున్న వీడియో బయటకురావడంతో అప్పట్లో వైద్యుల నడుమ వివాదం నెలకొంది. దీంతో వైద్యుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వివాదం కొనసాగుతూనే ఉంది. ఇటీవల బదిలీల ప్రక్రియ జరగడంతో ముగ్గురు ఇతర ప్రాంతాలకు వెళ్లడం వైద్య సేవలపై ప్రభావం పడింది.

**అన్నింటికి ముగ్గురే..** స్త్రీవ్యాధుల నిపుణురాలు మెర్సీ జ్ఞానసుధ బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. ఆమె రిలీవ్ కావాల్సి ఉంది. మరో నిపుణురాలు మాధవి గతంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించలేనని చెప్పడంతో తప్పని పరిస్థితిల్లో మెర్సీకు అప్పజెప్పారు. అప్పటి నుంచి గర్భిణులకు స్కానింగ్‌తో పాటు ఇతర సేవలు కొనసాగాయి. మళ్లీ బాధ్యతలు ఆమెకు అప్పగిస్తే మరింత ప్రభావం పడే అవకాశం ఉంది. స్త్రీవ్యాధుల నిపుణురాలు రాధ, కంటి వైద్య నిపుణురాలు సుభాషిణి పని చేస్తుండగా.. మరో వైద్యురాలు ప్రతిభ ఏడాదిగా మెడికల్ లీవులో ఉన్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు వైద్యులే ఓపీ విభాగాన్ని సైతం చూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రోజూ ఆస్పత్రికి వచ్చే రోగులు: 600
ఇన్‌పేషెంట్లు: 60
పడకలు: 100
రక్తపరీక్షల సంఖ్య: 800 నుంచి 1000

# బినామీ పనులు.. నాణ్యతకు బీటలు

నంద్యాల : ఎమ్మిగనూరులోని కస్తూర్బా విద్యాలయంలో నాలుగు అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో గదికి రూ.13 లక్షలు కేటాయించారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. మూడు రోజుల కిందటే మళ్లీ మొదలయ్యాయి. పనులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నట్లు చూపుతున్నా మధ్యవర్తి ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి.

మహానంది కస్తూర్బా పాఠశాలలో ఆగిపోయిన నిర్మాణం. ఇక్కడ 6 అదనపు గదుల నిర్మాణానికి రూ.13 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో గతే ఏడాది సెప్టెంబరులో 25 శాతం విడుదలయ్యాయి. దీంతో కొంత వరకు పనులు జరిగాయి. ఆ తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. పేరుకు ఎస్‌ఎంసీ ఆధ్వర్యంలోనే పనులు జరుగుతున్నట్లు చెబుతున్నా ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలోనే జరిగాయి. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలోనే జరగాలనే స్పష్టమైన ఉత్తర్వులున్నా బినామీల పెత్తనం కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో పనులన్నీ ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. నిధుల విడుదల ఆలస్యం అవుతుండడంతో ప్రిన్సిపాళ్లు తమ చేతుల నుంచి డబ్బు పెట్టుకోలేక పనులను ఇతరులకు అప్పగించారు. వారు ఇష్టానుసారం చేస్తున్నారు. దీంతో పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వెండర్లతోనే అన్నీ..**

నిబంధనల ప్రకారం ముందుగా ప్రిన్సిపాళ్లు పనులు చేయించి ఆ తర్వాత బిల్లులు పెట్టుకుని నిధులు విడుదలయ్యాక తీసుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. వారికి నిర్మాణ పనులపై అవగాహన లేకపోవడం, రూ.లక్షల విలువ చేసే పనులను సొంత నిధులతో చేయించడం శక్తికి మించిన పనికావడంతో చాలాచోట్ల వెండర్లు (పెట్టుబడి పెట్టే వారు) రంగ ప్రవేశం చేశారు. రాజకీయ అండతో వీరే నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు వచ్చిన తర్వాత ప్రిన్సిపాళ్ల నుంచి తీసుకోవాలనే ఒప్పందంతో కేజీబీవీల్లోని సివిల్ పనులన్నీ వీరే తీసుకున్నారు.

కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలతో పాటు నంద్యాల జిల్లాలోని మహానంది, ఆళ్లగడ్డ, రుద్రవరం, పాణ్యం, బనగానపల్లి, డోన్ తదితర ప్రాంతాల్లో వెండర్ల ద్వారానే పనులు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల చేసిన పనులకు నిధులు రాకపోవడంతో పనులు నిలిపేశారు.

**రూ.10.75 కోట్లతో పనులు**

ఉమ్మడి జిల్లాలో 53 కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో కర్నూలు జిల్లాలోని 17, నంద్యాల జిల్లాలోని 22 కేజీబీవీల్లో అదనపు గదుల నిర్మాణానికి గతేడాది నిధులు విడుదలయ్యాయి. కర్నూలు జిల్లాకు రూ.4.43 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.6.32 కోట్లు మంజూరయ్యాయి. తొలి విడతగా కర్నూలు జిల్లాకు రూ.1.12 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.1.58 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

సమగ్ర శిక్షా అభియాన్ పర్యవేక్షణలో పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ విధానంలో ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను పాఠశాల యాజమాన్య కమిటీల సూచనల ప్రకారం ప్రిన్సిపాళ్లే చేయించాల్సి ఉంది.

**పర్యవేక్షణ పట్టని ఇంజినీర్లు**

పాఠశాల యాజమాన్య కమిటీలు, ప్రిన్సిపాళ్లు కాకుండా మూడో వ్యక్తి పనులు చేస్తుండటంతో నిర్మాణాల్లో నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల చేసిన పనులపై అప్పుడే ఫిర్యాదులు వస్తున్నాయి. గడివేములలో గుత్తేదారు హడావుడిగా నిర్మాణాలు చేపట్టారు. మహానందిలో కూడా నాసిరకంగా పనులు జరిగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వివిధ దశల్లో నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన సమగ్ర శిక్షా అభియాన్ ఇంజినీర్లు పట్టించుకోకపోవడంతో పనుల్లో నాణ్యత కొరవడుతోంది. వారు ఎం.బుక్కులు చేయించడంపై చూపిన శ్రద్ధ పనుల పర్యవేక్షణపై పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# మత్తు.. జీవితాలు చిత్తు



అనకాపల్లి : అచ్యుతాపురానికి చెందిన ఇంటర్ విద్యార్థికి గంజాయి తాగడం అలవాటుగా మారింది. గంజాయి తాగుతూ చదువుకు స్వస్తి చెప్పాడు. గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడడంతో ఇతడిని అనకాపల్లిలోని వ్యసన విముక్తి కేంద్రానికి తీసుకొచ్చి చికిత్స అందించారు. రాంబిల్లిలోని కంపెనీలో పనిచేస్తున్న వ్యక్తి గంజాయి తాగడం అలవాటు చేసుకుని తోటి స్నేహితులకు నేర్పించారు. వీరంతా బహిరంగంగా గంజాయి తాగుతూ పోలీసులకు చిక్కారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం చాపకింద నీరులా వ్యాపిస్తోంది. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న కొందరు విద్యార్థులు వీటికి బానిస అవుతున్నారు. ఏజెన్సీలో గంజాయిని ఇక్కడికి తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో అమ్మకాలు చేస్తున్నారు. సిగరెట్ ధర కంటే గంజాయితో ఉన్నవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. అనకాపల్లి కేంద్రంగా గంజాయి రవాణా జోరందుకుంది. కొందరు నిందితులు పట్టుబడుతున్నా పోలీసుల కళ్లు గప్పి తరలిపోతున్న వారు ఎక్కువ మందే! మందుల దుకాణాల్లో డాక్టర్ చీటీలు లేకుండా మత్తు ఇంజక్షన్ల అమ్మకాలు సాగుతున్నాయని గుర్తించడంతో ఇటీవల ఈ దుకాణాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ దుకాణాలపై పర్యవేక్షణ కొరవడడంతో కొందరు మత్తు ఇంజక్షన్లను అమ్మకాలు చేస్తూ మత్తులోకి దింపుతున్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల వ్యాపారం చేసేవారు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని మత్తులో నింపుతున్నారు. గత నెలలో అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రానికి ఎనిమిది మంది గంజాయి తాగుతున్న వారిని తీసుకొచ్చి వీరితో అలవాటు మాన్పించేలా పోలీసులు కౌన్సెలింగ్ ఇప్పించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**అన్ని విధాలా నష్టం..** అనకాపల్లిలో ఇటీవల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి కారణాలు అన్వేషిస్తే మాదకద్రవ్యాలకు అలవాటు పడి అప్పులు చేసి ఇవి తీర్చలేక.. అలవాటు మానుకోలేక.. బలవన్మరణానికి పాల్పడినట్లు తేలింది. పట్టణంలో ఒక ధనికుడి కుమారుడు మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. ఇతనితో అలవాటు మాన్పించడానికి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా జిల్లాలో ఎంతోమంది తల్లిదండ్రులు వేదన పడుతున్న సంఘటనలు ఎక్కువ అవుతున్నాయి. సరదాగా నేర్చుకుంటున్న అలవాటు వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తోంది. చదువుకునే సమయంలో చేసుకుంటున్న అలవాటుతో విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయి.

**ఈగల్ సెల్‌తో ప్రత్యేక నిఘా:** మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేలా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈగల్ సెల్ ఏర్పాటు చేశారు. గంజాయి రవాణా, అమ్మకాలను అరికట్టడంతోపాటు వీటిని వినియోగిస్తున్న వారితో అలవాటు మాన్పించేలా కౌన్సెలింగ్, చికిత్స అందిస్తున్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో 13 మంది పోలీస్ సిబ్బందితో ఉమ్మడి విశాఖ జిల్లా ఈగల్ టీంను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**మత్తుతో జీవితం అంధకారం:** మత్తుతో జీవితం అంధకారం అవుతుంది. మాదక ద్రవ్యాలు, మద్యం, సిగరెట్లు అలవాటు మంచిదికాదు. యువత సరదాగా అలవాటు చేసుకుంటూ వ్యసనంగా మార్చుకుంటున్నారు. ఇది అనేక అనర్థాలకు దారితీస్తోంది. గంజాయి తాగే అలవాటు మాన్పించేలా కౌన్సెలింగ్‌తో పాటుగా చికిత్స అందిస్తున్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే కౌన్సెలింగ్ ఇప్పించాలి. అనకాపల్లి ఆసుపత్రిలో వ్యసన విముక్తి కేంద్రం ఉంది. వివరాలు గోప్యంగా ఉంచి అలవాటు మాన్పించేలా చికిత్స అందిస్తాం.

– డాక్టర్ జి.కృష్ణచంద్ర, వ్యసన విముక్తి కేంద్రం, జిల్లా ఆసుపత్రి, అనకాపల్లి

జిల్లాలో గంజాయి స్వాధీనం

| ఏడాది | కేసులు | గంజాయి కేజీల్లో |
|---|---|---|
| 2024 | 162 | 7442.43 |
| 2025 | 74 | 4903.705 |

మే వరకు

# అవినీతికి పాల్పడినా.. అడిగేవారు లేరుగా..



పుట్టపర్తి : వైకాపా పాలనలో జరిగిన నాడు–నేడు పనుల్లో అవినీతి చోటు చేసుకున్నా.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా అక్రమార్కులపై చర్యలు కనిపించడం లేదు. కొందరిపై నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకొన్న అధికారులు.. తర్వాత పట్టించుకోవడం మానేశారు. దీంతో అవినీతికి పాల్పడినా అడిగేవారు లేరులే అన్న సందేశాన్ని అక్రమార్కులకు పంపుతున్నారు. గతంలో పలువురు ప్రధానోపాధ్యాయులు పనులు చేయకుండానే నిధులు విత్‌డ్రా చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పలు పాఠశాలల్లో నిధుల వినియోగంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. కొన్నిచోట్ల బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. వారు మళ్లీ విధుల్లోకీ చేరారు. ఏళ్లు గడుస్తున్నా స్వాహా సొమ్ము రికవరీ చేయలేదు.

**నిర్లక్ష్యానికి నిదర్శనం:** నాడు–నేడు పథకాన్ని ప్రస్తుత కూటమి సర్కారు మనబడి..మన భవిష్యత్తు కింద మార్చింది. నాడు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు విడుదల చేసే పనిలో ఉంది. నాడు–నేడు కింద పనులు జరిగిన సమయంలో ఉన్న అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఉన్న అధికారులకు ఎక్కడ ఎంత అవినీతి జరిగిందన్న విషయంపై పూర్తి సమాచారం లేకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. పర్యవేక్షించాల్సిన డీఈవో, సర్వశిక్షా అభియాన్ అధికారుల మధ్య సమన్వయం లోపించింది.

తనకల్లు మండలం నల్లగుట్టపల్లి ఉన్నత పాఠశాలకు నాడు–నేడు కింద మూడు అదనపు తరగతి గదులు, ఒక కిచెన్ షెడ్డు మంజూరు చేశారు. రూ.30 లక్షలకు పైగా విడుదల చేశారు. బ్యాంకు ఉమ్మడి ఖాతాదారైన ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంతకం చేయకుండానే 2023, అక్టోబరులో ప్రధానోపాధ్యాయురాలు రూ.4.59 లక్షలు విత్‌డ్రా చేశారు. తర్వాత బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయుడు తీసిన బ్యాంకు స్టేట్‌మెంట్‌తో అక్రమం వెలుగుచూసింది. తనకు తెలియకుండానే నిధులు డ్రా చేసినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ తెలిపారు. ప్రస్తుతం ఆమె బదిలీపై మరో మండలానికి వెళ్లారు. సొమ్ము మాత్రం రికవరీ కాలేదు.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం**

నాలుగు నెలల కిందటే బాధ్యతలు చేపట్టాను. జిల్లావ్యాప్తంగా ఎక్కడెక్కడ అవినీతి జరిగింది. ఎన్ని నిధులు దుర్వినియోగమయ్యాయో ఇంజినీరింగ్ అధికారుల నుంచి సమగ్ర సమాచారం తెప్పించుకుని బాధ్యులపై చర్యలకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.?

దేవరాజ్, ఏపీసీ, సర్వశిక్షా అభియాన్

లోపించిన నాణ్యత

చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో రూ.40 లక్షలతో వివిధ పనులు చేపట్టారు. శిథిల భవనాలకు సిమెంట్‌తో పైపై పూతలు పూసి.. రంగులు అద్ది బిల్లులు డ్రా చేసుకున్నారు. అందులోని రెండు గదులు నెలన్నర క్రితం కురిసిన వర్షాలకు కూలిపోయాయి. శిథిలాలను నేటికీ తొలగించలేదు.

# గుట్టలు తొలగేనా.. స్వచ్ఛత సాకారమయ్యేనా?

అనంతపురం : చెత్తపై పన్ను వసూలు చేసిన గత వైకాపా ప్రభుత్వం...వ్యర్థాలను డంపింగ్ యార్డుల్లో పారబోసి చేతులు దులుపుకొంది. ఐదేళ్లలో చెత్తశుద్ధిపై ఏమాత్రం దృష్టి సారించలేదు. దీంతో లక్షలాది టన్నులు గుట్టలుగా మారాయి. కూటమి ప్రభుత్వం రాగానే డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించింది. అక్టోబరు 2 నాటికి చెత్తను పూర్తిగా రీసైక్లింగ్ చేయాలనే లక్ష్యంతో బాధ్యతలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు అప్పగించింది. ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాలోని ఆరు పురపాలికల్లో బయోమైనింగ్‌ను ఒక కంపెనీకి అప్పగించారు. ఇప్పటివరకు ఒక్క చోట కూడా పనులు ప్రారంభం కాలేదు.

**టన్నుకు రూ.726**

వ్యర్థాల నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి బయోమైనింగ్ చేయాల్సి ఉంటుంది. వేరుచేసిన ప్లాస్టిక్‌ను విద్యుత్తు ఉత్పత్తికి వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. జిల్లాలోని పురపాలికల్లో 2.29 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. బయోమైనింగ్ చేసేందుకుగాను టన్నుకు రూ.726 చొప్పున రూ.16.67 కోట్లు అవుతుంది. 4.92 శాతం అధిక ధరతో రూ.17.49 కోట్లకు గుత్తేదారు టెండరు దక్కించుకున్నాడు. గతేడాది డిసెంబరులో ప్రక్రియ మొదలుకాగా ఈఏడాది ఏప్రిల్ 3న ఖరారు చేశారు. అగ్రిమెంట్ పూర్తయిన 15 రోజుల్లోగా బయోమైనింగ్ మొదలుపెట్టాల్సి ఉంది. రెండున్నర నెలలు కావొస్తున్నా అతీగతీ లేదు. దీంతో డంపింగ్ యార్డుల్లో ఇంకొంత చెత్త పేరుకుపోయింది. ప్రభుత్వం విధించిన



గడువుకు మూడునెలలే ఉన్నందున్న లక్ష్యాన్ని చేరుకుంటారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**జిల్లా కేంద్రంలో కష్టమే..**

అనంతపురం నగరపాలిక డంపింగ్ యార్డులో ఈ ఏడాది జనవరికి 1.68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు అధికారులు లెక్కగట్టారు. రెండు యంత్రాలతో 24 గంటలు పనిచేసినా కనీసం ఆరునెలలు పడుతుందని అంచనా వేస్తున్నారు. దీనికితోడు వర్షకాలం కావడంతో పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జనవరి నుంచి ఇప్పటివరకు మరో 23 వేల టన్నులు యార్డులోకి చేరింది. ఒప్పందం కుదుర్చుకున్న మేరకు చెత్తను తొలగించడానికి ఏడాది పట్టనున్న నేపథ్యంలో మరో 50 వేల టన్నులు పోగవుతుంది. ఈ నేపథ్యంలో అధికారులు యార్డును శుభ్రం చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాల్సి ఉంది.

# ప్రజాధనం గోల్‌మాల్..!

వేపగుంట : పన్నులు కట్టండి జీవీఎంసీ అభివృద్ధికి సహకరించండి అని చెప్పే అధికారులు ప్రజలు కడుతున్న పన్నుల సొమ్ము ఏమవుతుందన్న విషయం పట్టించుకోకపోవడంతో ఆ నిధులు పక్కదారి పట్టాయి. కొన్ని నెలలుగా జీవీఎంసీకి రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వేపగుంటలోని జీవీఎంసీ జోన్–8 కార్యాలయ సౌకర్యం కేంద్రంలో ప్రజలు చెల్లించే పన్నుల నగదు బ్యాంకుకు రెండు నెలలుగా జమ కావడం లేదు. ఓ ఉద్యోగి సొంతానికి వాడుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇలా పక్కదారి పట్టిన నగదు సుమారు రూ.50లక్షలు ఉండవచ్చని సమాచారం. ప్రజల నుంచి వసూలు చేసిన నగదును ప్రతిరోజు ఇక్కడి ఉద్యోగి బ్యాంకునకు వెళ్లి జమ చేస్తుంటారు. అలా జమ చేస్తున్నదీ లేనిదీ జోనల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ఆ ప్రక్రియ కొంత కాలంగా ఇక్కడ జరగడం లేదని తెలుస్తోంది. దీని వెనుక కార్యాలయంలో మరికొందరి హస్తం లేకపోలేదని పలువురు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత బాధ్యతల నుంచి ఆ ఉద్యోగిని కార్యాలయంలో వేరొక విభాగానికి మార్చినట్లు తెలిసింది.



మరోవైపు సంబంధిత నగదును బ్యాంకులో జమ చేయించేందుకు కొందరు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

గతంలో ఇదే కార్యాలయంలో ఇంటిపన్నుల కుంభకోణం వెలుగు చూసినప్పటికీ బాధ్యులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో తాజా ఘటన చోటుచేసుకుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇంటి పన్నుల కుంభకోణానికి పాల్పడిన వ్యక్తులే ఇందులోనూ సూత్రదారులై ఉండొచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జోనల్ కమిషనర్ హేమవతి వద్ద ఈ విషయం ప్రస్తావించగా.. పూర్తి స్థాయి విచారణ చేపడతామని, తప్పు జరిగినట్టు తేలితే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

# సింగరాయకొండ... ఏదీ పారిశ్రామిక అండ?

టంగుటూరు : ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం సింగరాయకొండలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) పార్కును 2006లో ఏర్పాటు చేశారు. దీని కోసం రూ.10.55 కోట్ల నిధులను వెచ్చించారు. 121 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు రూ.30 వేలు చెల్లించి ప్లాట్‌లను పొందారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నేటికీ పరిశ్రమలు నెలకొల్పలేదు. తూతూ మంత్రంగా చుట్టూ ప్రహరీ నిర్మించి తాళాలు వేశారు. కొన్ని చోట్ల షెడ్లు నిర్మించి వదిలేశారు. 121 ప్లాట్లలో 15 మాత్రమే చిన్నపాటి పరిశ్రమలు నెలకొల్పి నిర్వహిస్తున్నారు. మిగతావన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

**20 ప్లాట్ల వరకు ఆక్రమణ..**

సింగరాయకొండ పారిశ్రామికవాడలో 121 ప్లాట్లను ఏపీఐఐసీ అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో 20 ప్లాట్లను స్థానికులు ఆక్రమించి నివాసాలు నిర్మించుకున్నారు. ప్రస్తుతం పారిశ్రామికవాడలో సెంటు విలువ రూ.లక్ష పలుకుతోంది. ఒక్కో ప్లాటు సుమారు రూ.50 లక్షల వరకు పలుకుతుందని స్థానికులు, పారిశ్రామికులు చెప్తున్నారు. ఇప్పటికే పలు ప్లాట్లు విక్రయించుకోగా..మరికొన్ని అద్దెలకిచ్చి లబ్ధిపొందుతున్నారు.

**మౌలిక సదుపాయాలు ఏవీ..!**

పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు అనువైన వాతావరణం కల్పించడం ఏపీఐఐసీ ముఖ్య ఉద్దేశం. సింగరాయకొండలో మాత్రం పాతికేళ్లలో ఎలాంటి పురోగతి లేదు. పేరుకు పారిశ్రామికవాడగా చెప్పుకోవడమే తప్ప పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉద్యోగావకాశాలను కల్పించిన పరిస్థితులు లేవు. దీంతో సమస్యలు తిష్ఠవేశాయి. నేటికీ రోడ్లు అభివృద్ధి చేయలేదు. పూర్తి స్థాయిలో విద్యుత్తు సౌకర్యం లేదు. కాలువలు, నీటి సరఫరా, సమాచార సౌకర్యం, డంపింగ్ యార్డ్ వంటి కనీస వసతులు నెలకొల్పలేదు. పారిశ్రామికవాడలో సమస్యలపై ఏపీఐఐసీ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. త్వరలో పర్యటించి మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్లాట్లను తనిఖీ చేసి వినియోగంలో లేకపోతే సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

# నేల తాకని చినుకు... రైతు గుండె చివుక్కు!

ఒంగోలు: ఖరీఫ్ పనులు మొదలయ్యే జూన్‌లో వరుణుడు ముఖం చాటేశాడు. సీజన్‌లో వానలు ముంచెత్తాల్సి ఉండగా, కనీస స్థాయిలో కురవలేదు. కురవాల్సిన వర్షపాతంలో 36 శాతం లోటు కనిపిస్తోంది. సాధారణంగా ఈ నెలాఖరుకు పొలాలు శుభ్రం చేసుకుని దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు రైతులు సన్నద్ధమవుతారు. వర్షాలు కురవక పోవడంతో ఈ ఏడాది సాగు ఎలా ఉంటుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వానల రాక కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో నీటి వనరుల లభ్యత అంతంతమాత్రమే కావడంతో వర్షాధార పంటల సాగు ఎక్కువ. కాలువలు, చెరువుల కింద కొంతమేర ఆయకట్టు సాగులో ఉంది. పశ్చిమ ప్రకాశంలో పూర్తిగా వర్షంపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు చెరువుల్లో కాస్త నీరు చేరింది. చెరువుల కింద వరి సాగు చేపట్టాల్సిన రైతులు ప్రస్తుతం వర్షం ఎప్పుడు కురుస్తుందా.. అని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పది వేల హెక్టార్లకుపైగా వరి పంట సాగు చేయాల్సి ఉండగా, వర్షాభావంతో ఇప్పటి వరకు పొలం పనులు చేపట్టలేదు. పాతిక వేల హెక్టార్ల వరకు పత్తి సాగవ్వాల్సి ఉండగా, ఇంకా దుక్కులే దున్నలేదు. మార్కాపురం, కనిగిరి ప్రాంతాల్లో వర్షాధారంగానే అపరాలు సాగు చేస్తారు. విత్తు నాటేందుకు సమయం ఉన్నా వర్షపాతం లోటు గుబులు రేపుతోంది. ఎండ తీవ్రత పెరగడంతో కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసే రైతులు వర్షాలు కురవాలని వరుణ దేవుడిని వేడుకుంటున్నారు. విభిన్న వాతావరణం ఆక్వా రైతులను కలవరపెడుతోంది. సీజన్ ఆరంభమయ్యే జూన్‌లో 36.8 శాతం లోటు వర్షపాతం ఉందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వర్షాలు కురిస్తే పంటల సాగుకు రైతులకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

చురకలు



# సెస్సు మిన్న రైతు బంధు సున్నా

ఆళ్లగడ్డ : 15 వ్యవసాయ మార్కెట్లు.. ఏటా రూ.60 కోట్ల ఆదాయం.. సెస్సు రూపంలో కోట్లు సమకూరుతున్నా అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందాలి. వైకాపా ఆపేసిన 'రైతుబంధు' పథకాన్ని పునరుద్ధరించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. 2014లో తెదేపా ప్రభుత్వం రైతు బంధును అమలు చేసింది.. ప్రభుత్వ గోదాముల్లో ధాన్యాన్ని దాచుకున్న రైతుకు రూ.2 లక్షల వరకు మార్కెట్ కమిటీనే మొదటి ఆరు నెలలు ఆర్థిక సాయం అందించేది. ఆరునెలల పాటు ఎలాంటి వడ్డీ ఉండదు. తర్వాత 6 నుంచి 9 నెలల వరకు 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు క్వింటాకు నెలకు 60 పైసలు తీసుకునే వారు. 2019లో గత వైకాపా దీన్ని అటకెక్కించింది. రైతుబంధు నిలిచిపోవడంతో ప్రభుత్వ గోదాముల్లో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఇవన్నీ ఖాళీగా మారాయి. ఇప్పటికీ ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు దాదాపుగా రైతులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది.



ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రూ.2.34 కోట్లు ఖర్చు చేసి 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదామును ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఆళ్లగడ్డలో రైతుల కోసం 18 ఎకరాల విస్తీర్ణంలో కొత్త మార్కెట్ యార్డును నిర్మించారు. రైతుబంధు పథకం లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. దీన్ని రైతులు ఉపయోగించుకోవడం లేదు.

**ప్రైవేటు గోదాములతో భారం**

వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో వంద బస్తాల నిల్వకు కేవలం రూ.200 చెల్లించాలి. ఏడాది పొడవునా నిల్వ ఉంచినా కేవలం రూ.2400 అవుతుంది. ఎన్ని నెలలు నిల్వ ఉంచితే అంతే అద్దె చెల్లించొచ్చు. అదే ప్రైవేటు గోదాములో 100 సంచులకు రూ.500 వసూలు చేస్తారు. ఏడాదికి రూ.6000 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచుకునే రైతుపై రెట్టింపు కంటే ఎక్కువ భారం పడుతోంది.

పి.నాగిరెడ్డిపల్లెకు చెందిన నరసింహులు రబీలో 12 ఎకరాల్లో వరి సాగు చేశారు. 400 సంచుల వడ్లను ప్రైవేటు గోదాములో నిల్వ ఉంచారు. ఇందుకు సంచికి రూ.5 చొప్పున నెలకు రూ.2వేలు అద్దె చెల్లిస్తున్నారు. బీమా కింద ఏడాదికి రూ.2400 చెల్లించారు. అదే ప్రభుత్వ గోదాములో కేవలం నెలకు రూ.800 మాత్రమే చెల్లిస్తే సరిపోయేది. ప్రభుత్వ గోదాములు అందుబాటులో లేకపోవడంతో ఆయనకు నెలకు రూ.1200 భారం పడింది.

ఆదాయంలో కేటాయింపులు ఇలా (శాతాల్లో)

పింఛన్లకు : 20

సెంట్రల్ మార్కెట్ ఫండ్‌కు: 25

ఉద్యోగుల జీతాలకు: 25

ప్రభుత్వ ఖాతాలోకి : 30 ఎరైతుకు: 0

# మురుగుశుద్ధి.. లేదు చిత్తశుద్ధి

బొబ్బిలి : పట్టణాల్లో మురుగు సమస్యకు పరిష్కారంగా కేంద్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రత్యేక నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణాన్ని తలపెట్టింది. గత ప్రభుత్వ హయాంలో 2022లో నిధులు మంజూరు కాగా.. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. బొబ్బిలిలో రూ.8 కోట్లతో ఆరు ప్లాంట్లు రాగా.. ఒక్కటీ పూర్తి కాలేదు. వీటిని పూర్తి చేసి, నిర్వహణలోకి తీసుకొస్తే మురుగు రహిత పట్టణంగా మారుతుంది.

**అయిదు మినీ.. ఒక భారీ ప్లాంటు**

బొబ్బిలిలో అయిదు చోట్ల మినీ, మరోచోట భారీ మురుగు శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఒక్కో మినీ ప్లాంటు ద్వారా 30 వేల లీటర్ల మురుగు శుద్ధి చేసే విధంగా టెండర్లు పిలిచారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలి, మల్లంపేట, తారకరామకాలనీ, గొల్లపల్లిలో వీటిని నిర్మించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రాగా.. టెండర్లు పిలిచి గుత్తేదారుకు అప్పగించారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలిలో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల కానరావడం లేదు. కొన్నిచోట్ల స్థల



సమస్య ఉంది. దీనికితోడు బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది.

**ఎక్కడికక్కడ నిల్వతో నరకం..** పట్టణంలో పక్కా కాలువ వ్యవస్థ లేదు. శివారు ప్రాంతాల్లో కచ్చాలే దిక్కు. ఆ మురుగంతా ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. ప్రధాన కాలువల నుంచి వచ్చే నీరు బయటకు పోవడం లేదు. వర్షం పడితే రహదారులపైకి రావడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇలాంటి చోట్ల శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని భావించి, రోజుకు 3 లక్షల లీటర్ల మురుగు పారుతుందని అంచనా వేసి అప్పట్లో ప్రతిపాదించారు.

**ప్రత్యామ్నాయం చూడరే..**

పాకివీధిలో సుమారు 3 లక్షల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే భారీ ప్లాంటును తలపెట్టారు. పురపాలక స్థలంలో పనులు ప్రారంభిం చారు. ఆ స్థలాన్ని ఇళ్ల పట్టాలకు కేటాయించాలని పారిశుద్ధ్య కార్మికులు పనులు అడ్డుకోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా సుమారు ఎకరం స్థలాన్ని చూడాల్సి ఉన్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

**ఇదీ పరిస్థితి**పట్టణంలో కాలువల పొడవు: 121.6 కి.మీ

ప్రధాన డ్రైన్లు: 11.03 కి.మీ బీ మధ్య, చిన్న తరహా: 47 కి.మీ, 61 కి.మీ కచ్చా కాలువలు: 2.2 కి.మీ

పూర్తికి చర్యలుప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. రెండు చోట్ల పనులు ప్రారంభించాం. మిగిలినవి త్వరలోనే మొదలు పెడతాం. స్థలం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఎల్.రామలక్ష్మి, పురపాలక కమిషనర్

# 'ఎత్తి'పోయలేక 'నీరు'గార్చారు



ఒంగోలు : తాళ్లూరు మండలం మల్కాపురంలోని చిలకలేరు వాగుపై 2017లో రూ.2.13 కోట్లతో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం ఇది. రెండేళ్ల క్రితం విద్యుత్తు పరివర్తకం చోరీకి గురైంది. తర్వాత మరమ్మతులు చేపట్టక నిరుపయోగంగా మిగిలింది...

నాగులుప్పలపాడు మండలం కనపర్తిలోని ఈ ఎత్తిపోతల పథకం 300 రైతులకు చెందిన 4,200 ఎకరాలకు సాగు నీరందిస్తోంది. రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిచింది. కొన్నేళ్ల క్రితం బిగించిన మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్యానల్ బోర్డు పాతవి కావడంతో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్తు తీగలు కాలిపోతున్నాయి. కొత్తవి బిగించాల్సి ఉంది...

వేల ఎకరాలకు సాగు నీరందించిన పథకాలవి. నేల తల్లినే నమ్ముకున్న చిన్న, సన్నకారు రైతులకు భరోసాగా నిలిచాయి. బీడు భూములను పచ్చని పంటలతో కళకళలాడేలా చేశాయి. అటువంటి బంగారు బాతులను గత వైకాపా ప్రభుత్వం విస్మరించింది. నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా పదుల సంఖ్యలో పథకాలు పడకేశాయి. మోటార్లు బాగుచేయకపోవడం, చిన్నపాటి మరమ్మతులనూ పట్టించుకోకపోవడంతో మరికొన్ని అరకొర పనిచేస్తున్నాయి. దీంతో నీరు లేక కర్షకులు కాడి పడేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి సాగుకు ఊతమిస్తుందని ఆశిస్తున్నారు.

47 శాతం పడకేసిన పథకాలు: జిల్లాలోని ముసి, గుండ్లకమ్మ, పాలేరు నదులు, వాగులోంచి నీటిని ఎత్తిపోసి.. పంట పొలాలకు అందించేందుకు రాష్ట్ర నీటి వనరులు, అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో రూ.139.02 కోట్లతో 141 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. 2021కి ముందు వీటి ద్వారా 61,604 ఎకరాలకు సాగు నీరందింది. ఆ తర్వాత మొత్తం 67 పథకాలు పనిచేయకపోవడంతో పక్కన పెట్టారు. మిగిలిన వాటిలో ప్రస్తుతం 30 పూర్తిస్థాయిలో.. 44 పథకాలు పాక్షికంగా(మూడు, నాలుగు మోటార్లకు ఒక్కటే నడవడం) పనిచేస్తున్నాయి. ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం ఏర్పాటుచేయగా.. మొదటి రెండేళ్లు గుత్తేదారులే నిర్వహించారు. తర్వాత ఆయా పథకాల ఆయకట్టు పరిధిలోని రైతులకు అప్పగించారు. కర్షకులే నిర్వహణ బాధ్యతలు చూసుకోవాలి. చిన్నచిన్న మరమ్మతులకు డబ్బులు పోగు చేసి బాగుచేసుకోవాలి. పెద్ద మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తే నిధులు మంజూరయ్యాక బాగుచేసేవారు. కొన్నేళ్లుగా సాగునీటి ఇక్కట్లు తీర్చిన పథకాలు అకస్మాత్తుగా పనిచేయకపోయినా.. వైకాపా పాలకులు పట్టించుకోలేదు.

**సిబ్బంది జీతాలకూ పాట్లు**: ఎత్తిపోతల పథకాల నిర్వహణకు ప్రభుత్వం అందజేసే నిధులే ఉద్యోగులకు ఆధారం. సర్కారు ఇచ్చిన నిధుల్లోంచి సుమారు 20 శాతం మేర వేతనాలకు ఖర్చు చేస్తుంటారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణకు 35 మంది రెగ్యులర్, 150 పొరుగు సేవల విభాగంలో పనిచేస్తున్నారు. వీరికి పదమూడు నెలలుగా జీతాలు లేవు. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టలేదు. ఎత్తిపోతల పథకాల నిర్వహణపై ఏపీఎస్ఐడీసీ ఈఈ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులకు ఎక్కువ మొత్తం నిధులు అవసరమైతే సర్కారు సాయం కోసం సిఫార్సు చేస్తామన్నారు. వేతనాలు అందక సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

# పట్టణ పేదలకు గూడు దక్కేనా..?



చిత్తూరు : పట్టణ పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు తలపెట్టిన టిడ్కో పథకం వైకాపా తీరుతో నిర్వీర్యమైంది. మూడు విభాగాల్లో ఇళ్ల పంపిణీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వైకాపా పాలన ఐదేళ్లలో మొదటి విభాగంలో కొన్ని ఇళ్లు పూర్తిచేసి హడావుడిగా అందించారు. రెండు, మూడు విభాగాల కోసం దరఖాస్తులు ఇచ్చిన వారి పరిస్థితి త్రిశంకు స్వర్గంలో ఉంది. పంపిణీ చేసిన ప్రాంతాల్లో సరైన రోడ్లు, నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. చిత్తూరు నగర శివారుల్లోని పూనేపల్లెలో టిడ్కో గృహాల నిర్మాణాన్ని చేపట్టారు. 2,832 గృహాలు పూర్తి చేయగా ఇందులో ఒకటో కేటగిరీ 2256, రెండో కేటగిరీ 240, మూడో కేటగిరీ 336 గృహాలుగా విభజించారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో పనులు వేగంగా సాగలేదు. గృహ సముదాయాల ప్రాంగణంలో రోడ్లు, కాలువలు, నీటి సరఫరా పైప్‌లైన్లు పూడ్చే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తాగునీటి సదుపాయం లేదు. నియంత్రికలు ఏర్పాటు చేసినా గృహాలకు కనెక్షన్లు ఇవ్వలేదు. 2019కి ముందు 30 మందికి తాళాలు ఇచ్చారు. ఇంకా 2,800 మంది లబ్ధిదారులకు గృహాలు అప్పగించాల్సి ఉంది.

**తొలగని వైకాపా రంగులు**

పురపాలిక పరిధిలో 1,040 మంది అర్హులుగా గుర్తించారు. రూ.58 కోట్లతో 2018 నవంబరు 28న పనులు ప్రారంభించారు. 432 ఇళ్లు శ్లాబు పోశారు. వైకాపా అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. అవే పనులను 2021 మళ్లీ శంకుస్థాపన చేశారు. 2024 ఎన్నికల సమీపిస్తుండటంతో మౌలిక వసతుల కల్పనకు వైకాపా ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసి సీసీరోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకు, బోర్లు ఏర్పాటు చేశారు. అసంపూర్తి నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. కొన్ని పునాదుల దశల్లోనే ఉన్నాయి. వైకాపా రంగులు ఇంకా తొలగలేదు.

**వసతుల్లేమి.. భద్రత కరవు**

పట్టణంలో 1,536 మందికి టిడ్కో ఇళ్లు అందించారు. రోడ్లు, కాలువలు, విద్యుత్తు వసతి కల్పించారు. నీరు తాగేందుకు పనికి రావడం లేదు. దీంతో ప్రైవేట్ శుద్ధ జల కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఓహెచ్ఎస్ఆర్ పనులు అర్ధాంతరంగా ఆపేశారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కాలువల్లో పూడికతీత, పరిసరాల శుభ్రత మరిచారు. విషపురుగుల బెడద ఎక్కువగా ఉంది. సరైన రవాణా వసతి లేక చాలా మంది లబ్ధిదారులు చేరలేదు. నీటి తొట్టెలు, సెప్టిక్ ట్యాంకులు దుస్థితికి చేరుకున్నాయి. చాలా ఇళ్లు ఖాళీగా ఉండటంతో భద్రత లేదని వాపోతున్నారు.

రాత్రివేళల్లో బయటకు రావాలన్నా.. బయటికి వెళ్లాలన్నా భయమేస్తోంది.

టిడ్కో భవనాల్లో నివసించే వారికి భద్రత కరవైంది. లబ్ధిదారుల్లో కొందరు సొంత డబ్బు వెచ్చించి సౌకర్యాలు కల్పించుకుంటున్నారు. ఇళ్లకు ఇళ్లకు మధ్య దూరం దూరంగా లబ్ధిదారులు నివసిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో బయటకు రావాలన్నా.. బయటి నుంచి ఇంట్లోకి వెళ్లాలన్నా భయమేస్తోంది. రత్నమ్మ, స్థానికురాలు

# మట్టి.. కొల్లగొట్టి

తాడిపత్రి : అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్టు కొండలు, గుట్టలు, వంకలు, వాగులు, చెరువులు ఇలా దేన్నీ వదలడం లేదు. సులువుగా డబ్బు సంపాదించే ఆలోచనలో ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఈకోవలోనే పల్లెల్లోని చిన్నపాటి వంకలను చెరబడుతున్నారు. వంకల్లోనే మట్టిని వెంచర్లకు భారీగా తరలిస్తూ అక్రమార్జన సాగిస్తున్నారు. తాడిపత్రి మండలంలోని వీరాపురం పరిసరాల్లో వంక ఉంది. ఈ వంక తాడిపత్రిలోని చల్లవారిపల్లి గ్రామం వద్ద నుంచి సుమారు 12 కి.మీ.ల మేర ప్రవహిస్తుంది. వీరాపురం వద్ద కొందరు వంకలో మట్టి తవ్వకాలు చేపట్టారు. జేసీబీతో రోజూ 50 ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో డిమాండ్‌ను బట్టి టిప్పర్లతోనూ తరలిస్తున్నారు.

**పొరుగు జిల్లాకు..**

పొరుగున ఉన్న కడప జిల్లా సరిహద్దు గ్రామాలతోపాటు తాడిపత్రి లోని పలు వెంచర్లలోకి వంక మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. తాడిపత్రిలోని సజ్జలదిన్నె, ఆర్డీటీ కాలనీ, కోమలి, గంగాదేవిపల్లి, ఇగుడూరు తదితర గ్రామాల్లో ఉన్న వంకల్లోనూ భారీగా తవ్వి మట్టిని అక్రమంగా



తరలిస్తున్నారు. పట్టపగలే మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం– రజాక్‌వలీ, తహసీల్దార్**


వంకల్లోని మట్టిని రైతులు పొలాల్లోకి తీసుకెళ్లవచ్చు. రియల్టర్లు మట్టిని వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటే వారిపై చర్యలు తప్పవు. ఆయా వంకల వద్ద భూగర్భ గనులశాఖ అధికారులతో తనిఖీలు చేస్తాం. అలాంటి వారిని గుర్తించి మట్టి వ్యాపారాన్ని అడ్డుకుంటాం.

# వాహనాలకు సామర్థ్య పరీక్షే

కర్నూలు : రవాణా శాఖ జారీ చేసే వాహన సామర్థ్య(ఫిట్‌నెస్) పత్రాలు ఇక నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ప్రైవేటు కేంద్రాలకు అనుమతి లభించింది. వాహనాల సామర్థ్య కేంద్రం నంద్యాల జిల్లా చాబోలు వద్ద వారం రోజుల కిందట ప్రారంభమైంది. కర్నూలు జిల్లాలో చిన్నటే కూరు వద్ద ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆయా కేంద్రాల్లో 54 రకాల పరీక్షలు చేస్తారు. శబ్ద కాలుష్యం, వాహన టైర్ల సామర్థ్యం, బ్రేక్‌లు, వాహన బరువు, హెడ్ లైట్ తదితర పూర్తిస్థాయి పరీక్షలు చేపడతారు. వాహనానికి సంబంధించిన వివరాలన్నీ కంప్యూటరులో నమోదు చేస్తారు. అనంతరం వాహన సామర్థ్యం ఆధారంగా పత్రం ఇస్తారు.

**చిన్నపాటి లోపం ఉన్నా**

వాహన బ్రేకులు సరిగా లేకపోయినా, రంగులు, నంబరు ప్లేట్లు, రేడియం స్టిక్కర్లు లేకున్నా.. ఇలా చిన్నపాటి లోపమున్నా వెనక్కి పంపుతారు. ఆయా కేంద్రాల్లో కంప్యూటర్లను రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయానికి అనుసంధానం చేశారు. వాహన సామర్థ్యం బాగుంటే పత్రం జారీ అవుతుంది. లేకుంటే తిరస్కరిస్తారు. ఇలా రెండుసార్లు పరీక్షలు నిర్వహించేందుకు అనుమతిస్తారు. రెండుసార్లు విఫలమైతే దానిని తుక్కు వాహనం కింద పరిగణించి రహదారిపైకి రాకుండా చూస్తారు.



ఏడేళ్లలోపు వాహనాలు రెండేళ్లకోసారి, ఏడేళ్లు దాటిన వాహనాలు ఏడాదికోసారి వాహన సామర్థ్య పత్రం తీసుకోవాలి. 15 ఏళ్లు దాటిన ద్విచక్ర వాహనాలకు రూ.600, ఎల్ఎంవీలకు రూ.800, ఎంఎంవీ, హెచ్ఎంవీ వాహనాలకు రూ.1,200 ఫీజుగా వసూలు చేస్తారు.

**తప్పని దూరభారం**

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, ఆదోని, నంద్యాల, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో రవాణా శాఖ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో మోటారు వాహన, సహాయక మోటారు వాహన తనిఖీ అధికారులు ఉంటారు. వారి పర్యవేక్షణలో నిత్యం 60 వాహనాలను పరిశీలిస్తుంటారు. ఇప్పుడా బాధ్యత ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు.


ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాలే ఏర్పాటు చేయడం.. మిగిలిన ప్రాంతాల వాసులు అక్కడికి వెళ్లాలంటే అవస్థలు తప్పేలా లేవు. డోన్‌కు చెందిన వాహనదారులు చాబోలు కేంద్రానికి రావాలంటే సుమారు 70 కి.మీ., నందికొట్కూరు 50, ఆత్మకూరు 50, ఆళ్లగడ్డ, బనగానపల్లి 40, కొలిమిగుండ్ల వంటి ప్రాంతాల నుంచి 80, సున్నిపెంట వంటి ప్రాంతాలవారు సుమారు 150 కి.మీ. మేర ప్రయాణించి ఎఫ్‌సీ చేయించుకుని వెళ్లాల్సిన పరిస్థితి. నంద్యాలలోని ఏటీసీ కేంద్రంలో నిత్యం 45 స్లాట్ బుకింగ్ అవుతున్నాయి. రోజుకు 25 నుంచి 30 వాహనాలకే సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వెనక్కి వెళ్తున్నారు.

# అవినీతి పునాదులు.. బహుళ అక్రమాలు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం మందకొడిగా సాగుతుండటంతో కొందరు నిర్మాణదారులు అక్రమాలకు తెరలేపారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కుమ్మక్కై భవనం నిర్మాణ సమయంలోనే ఫ్లాట్లను విక్రయించి వాటికి మార్టిగేజ్‌ను విడుదల చేయిస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలూ ఇప్పిస్తున్నారు. మరికొన్నింటికి మున్సిపాల్టీతో సంబంధం లేకుండానే తనఖా రిజిస్ట్రేషన్ అలాగే ఉంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**పుర ఆదాయానికి గండి**

నిబంధనల ప్రకారం మున్సిపాల్టీల్లో చేపట్టే అపార్ట్‌మెంట్ల ఆస్తి విలువలో 10 శాతం పురపాలిక పేరుతో మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేయాలి. నిర్మాణదారులు ప్లాన్‌లో చూపిన విధంగానే నిర్మాణాలు చేయాలి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత అన్నీ సవ్యంగా ఉంటే తొలుత చేసిన మార్టిగేజ్‌ను విడుదల చేస్తారు. అక్రమాల్లో ఆరితేరిన కొంతమంది నిర్మాణదారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిర్మాణాలు పూర్తవకుండానే మార్టిగేజ్‌లను విడుదల చేయించుకుంటున్నారు. ఇందుకు కొంతమంది టీపీవోలు, టీపీఎస్, బిల్డింగ్



ఇన్‌స్పెక్టర్లు వత్తాసు పలుకుతుండగా ఉన్నతాధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారు. దీంతో మున్సిపాల్టీలు పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్నాయి.

**అన్నింటా అక్రమాలే**

జిల్లా కేంద్రం నంద్యాలలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం వేగంగా చేస్తారనే పేరున్న ఓ నిర్మాణదారు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో అంటకాగుతుంటారు. ఈయన ఆధ్వర్యంలో పద్మావతినగర్, ఎన్జీవో కాలనీల్లో చేపట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే రూ.కోట్ల విలువైన ప్లాట్లను తనఖా పూచీకత్తు రిజిస్ట్రేషన్లను విడుదల చేశారు. ఆ పత్రాలతోనే నిర్మాణదారుడు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు శాఖల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులకు రుణాలు ఇప్పించారు. వచ్చిన డబ్బుతో మరికొన్ని నిర్మాణాల్లో పెట్టుబడులు పెట్టారు.

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ, సంతోష్‌నగర్‌లలో రెండేళ్ల క్రితం బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన గుర్తింపు పొందిన నిర్మాణ సంస్థ కార్పొరేషన్‌లో పూచీకత్తు ఒప్పందం విడుదల చేయకుండానే అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. మరికొన్ని ప్లాట్లను ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇతరులకు విక్రయించి వాటిని బ్యాంకులో తనఖా పెట్టించి మరి రుణాలు ఇప్పించారు. ఇదే సంస్థ నంద్యాలలో కూడా ఇటీవల ఇదే ప్రయోగం చేస్తుంది.

నంద్యాల ఫరూక్‌నగర్‌లో ఒక నాయకుడు నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యాపారి రెండేళ్ల కిందట రూ.65 లక్షలతో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అప్పట్లో ఇది మార్టిగేజ్‌లో ఉండగానే బ్యాంకులో తనఖా పెట్టి రూ.38 లక్షల రుణం తీసుకున్నారు.

# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హోటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్‌ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హోటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.

17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

# సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు
ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది
మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**

అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

# పథకం.. పట్టదా?



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 1,059 గ్రామాలకు పైగా తాగునీరు అందించే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిలిచిపోయి రెండు నెలలు కావస్తోంది. కార్మికులు 53 రోజులుగా సమ్మె చేస్తున్నా... సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమ్మెలోకి వెళ్లిన ప్రతిసారీ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. పెండింగ్ జీతాలు, పీఎఫ్ బకాయిల సాధనకు సమ్మెలోకి వెళ్లిన కార్మికులతో అధికారులు పలుమార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో పంపుహౌస్‌లు మూతపడ్డాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. కొన్నిచోట్ల స్థానిక పథకాల నుంచి నీరందిస్తున్నా చాలడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అరకొరగా అందిస్తున్నారు.

**రూ.5 కోట్లు విడుదల చేసినా..**

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 630 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైకాపా పాలన ముగిసే నాటికి ఏడాది జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యను పరిష్కరించేందుకు కొంతమేర నిధులు విడుదల చేసి కార్మికులకు జీతాలు చెల్లించారు. నిర్వహణకు సరిపడా నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ప్రస్తుతం ఫేజ్-1లో 6 నెలలు, ఫేజ్-2లో 10 నెలలు, ఫేజ్-4లో 4 నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు సుమారు 30 నెలలకు సంబంధించిన పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇటీవల రూ.5 కోట్ల మేర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వాటితో కేవలం 2, 3 నెలల జీతాలకు సరిపోతాయని కార్మికులు చెబుతున్నారు. ఇందులోనూ గుత్తేదారులు రూ.2 వేలు కోత విధించి ఇచ్చారని ఆరోపిస్తున్నారు.

**అన్ని దశల్లో చర్చలు విఫలం**

ఏప్రిల్ 6 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. మే 2న అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 6న కలెక్టర్ కార్మిక సంఘ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. 7న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్మికులతో చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు. 8న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన కార్మికులు సమస్యలపై వినతిపత్రం అందించారు. 11న గుత్తేదారులు బలవంతంగా మోటార్లు ఆన్ చేయగా లీకేజీల కారణంగా వెనక్కి తగ్గారు. 12న కలెక్టర్, 13న ఆర్డీవో కేశవనాయుడు జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

**శాశ్వత పరిష్కారం చూపుతాం- వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం**

జీతాల కోసం రూ.5 కోట్లు విడుదల చేసినా కార్మికులు సమ్మె విరమించలేదు. గతంలో జరిగిన కొన్ని తప్పుల కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న టెండర్ల గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లు పిలిచి కొత్తవారికి అప్పగిస్తాం. ఇకపై కార్మికుల జీతాలను ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

# అర్హులే మిగలాలి.. అనర్హుల లెక్క తేలాలి!



అనంతపురం : వీధి వ్యాపారులు, చిరు వర్తకుల కుటుంబాలకు అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరిగా అనర్హులకు రుణాలు మంజూరు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. లెక్క పక్కాగా చేసి వారికి స్వల్పకాలిక రుణాలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సర్వే చేస్తున్నారు.

**వైకాపా మద్దతుదారులకే లబ్ధి** గతంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్స్ పర్సన్ల మద్దతుదారులకే కార్డులతో సహా రుణాలు ఇచ్చారు. దీంతో అర్హులైన వారికి మొండిచేయి లభించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మెప్మా అనుసంధానంగానే సచివాలయం సిబ్బందితో సర్వే చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన సంపూర్ణ వివరాలను క్రోడీకరిస్తున్నారు.గత వైకాపా హయాంలో ఆయా ప్రాంతాల్లోని కార్పొరేటర్లు, వార్డు కౌన్సిలర్లు, వైకాపా నేతలు ప్రతిపాదించిన వారికే రుణాలు దక్కాయి. టైలర్లకు, దుకాణాదారులకు అసలు ఎలాంటి వ్యాపారం చేయని వారు కూడా లబ్ధిపొందారు. వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకం ప్రవేశపెట్టింది. వ్యాపారులకు మూడు దశల్లో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు చొప్పున ఇచ్చారు.

**మెప్మాకు స్వానిధికి భారీ వ్యత్యాసం**

మెప్మా నమోదు చేసిన వివరాలకు, పీఎం స్వానిధి డేటాకు వ్యత్యాసం ఉంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో మెప్మా డేటా ప్రకారం 12,764 మంది ఉంటే స్వానిధిలో మరో 26,224 మంది మొత్తంగా 38,988 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 2014లోనే తెదేపా హయాంలో వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించడంతో 15 రోజులుగా వివరాలు క్రోడీకరిస్తున్నారు. వీధి వ్యాపారుల ఆధార్ నంబరు, ఏ రకం వ్యాపారం చేస్తున్నారు, సంపాదన, కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. మరో వారం రోజుల్లో అర్హులెవరో తేలనుంది. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ.. అర్హులను గుర్తించి వారి వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. మరో వారం రోజుల్లో సర్వే పూర్తి అవుతుందన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి.. సేవలకు సుస్తీ



గుంతకల్లు : గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు అరకొర వైద్యంతో అవస్థలు పడుతున్నారు. వంద పడకల ఆసుపత్రికి చుట్టూ పక్కల ఉన్న మండలాల ప్రజలు, సరిహద్దు లోని కర్నూలు జిల్లాకు చెందిన గ్రామీణ ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఈక్రమంలో సిబ్బంది సక్రమంగా వైద్యం అందించటం లేదని రోగులు, వారి సహాయకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని రకాల మందులను సైతం బయటికి రాసిస్తున్నారని పలువురు వాపోయారు. ఏరియా ఆసుపత్రిలో రోజువారి ఓపీ 600 నుంచి 700 దాకా ఉంటుంది. 30 మందికి పైగా జ్వరం, దగ్గు, వాంతులు వివిధ జబ్బులతో ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. రోగులకు కేటాయించే మంచాలకు బెడ్ కవర్లు ఉండటం లేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న బెడ్‌సీట్లను పరుచుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాక సెలైన్ బాటిల్స్ ఎక్కించాల్సి ఉంటుంది. మొదటి రోజు బాటిల్ ఎక్కిస్తారని, మరుసటి రోజు బయట తెచ్చుకోమని చెబుతున్నారని రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆసుపత్రిలో మందుల కొరత లేదని చెబుతూనే ఉన్నా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని రోగులు వాపోతున్నారు.

వేధిస్తున్న స్టాఫ్‌నర్సుల కొరత

ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది. 24 మందికి గాను 14 మంది నర్సులు ఉన్నారు. రోగులకు వైద్యసేవలు అందించడానికి ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. ఇక్కడ పది వరకు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీలు ఉండటం గమనార్హం.

**ఇబ్బంది పడుతున్నాం - జమీనా, గుంతకల్లు తగిన వైద్యసేవలు**

వాంతుల కావడంతో వారం రోజుల కిందట ఆసుపత్రిలో చేరా. మొదటి రోజు మాత్రమే సెలైన్ బాటిల్ ఎక్కించారు. తర్వాత ప్రైవేటు మందుల దుకాణంలో సెలైన్ కొనుక్కోవాలని చెబుతున్నారు. వైద్యులు రోజుకు రెండు రౌండ్లు చెకప్‌కు వస్తున్నారు. పిలిచేంత వరకు సిబ్బంది రావటం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **అందిస్తున్నాం- డా.అజేంద్రరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్** ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. స్టాఫ్‌నర్సుల కొరత ఉంది. ఉన్నవారితోనే వైద్యం సక్రమంగా అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం.

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.


గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు
కేసీ, రాజోలి, జొలదరాశి (235)
గాజులదిన్నె (35)
చెరువుల నిర్వహణ (46)
సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు." నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

# రష్మిక నెంబర్-1 ర్యాంక్ అందుకున్నట్లే!

కొంత కాలంగా టాలీవుడ్ లో నెంబర్ వన్ ర్యాంక్ ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. స్వీటీ అనుష్క సినిమా లు తగ్గించడంతో? ఆమె రేసులో లేకుండా పోయింది. అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగానే ఉంది. చాలా మంది భామలు వస్తున్నారు గానీ ఎవరూ ఆస్థానాన్ని భర్తీ చేయడం లేదు. సరైన సక్సస్ లేకపోవడం ...ఫామ్..ఫేమ్ కోల్పోవడంతో ఎవరికీ సాధ్యపడలేదు. మరి ఇప్పుడు ఆ స్థానానికి నేషనల్ క్రష్ రష్మికా మందన్నా అన్ని రకాల అర్హతలు సంపాదించిందా? అంటే అవుననే అనాలి. నటిగా ఆమె కెరీర్ గ్రాఫ్ ఎలా ఉంది? అన్నది చెప్పాల్సిన పనిలేదు. టాలీవుడ్ లో సక్సస్ ఫుల్ గా కొనసాగుతూనే బాలీవుడ్ కి వెళ్లింది. అక్కడా తిరుగులేని నాయికగా ఎదుగుతోంది. యానిమల్, పుష్ప ఛావా లాంటి విజయాలు ఆమె స్థాయిని బాలీవుడ్ లో రెట్టింపు చేసాయి. స్టార్ హీరోలే ఆమె తో కలిసి నటించ డానికి ఆసక్తి చూపిస్తున్నారు. పారితోషికం పరంగానూ




అమ్మడు హైలోనే ఉంది. తన డిమాండ్ ను ఎవరూ కాదనలేకపోతున్నారు. డిమాండ్కు తగ్గ పనితనం రష్మికలో ఉంది కాబట్టే సాధ్యమవుతుంది. టాలీవుడ్ లోనూ ఇది కాదనలేని నిజం.

ఇక రష్మిక నటనకు, చలాకీ తనానికి ఫ్యాన్స్ అవ్వడంలో సీనియర్ హీరోలు కూడా ఎక్కడా తగ్గడం లేదు. నటసింహ బాలయ్య నుంచి తొలి ప్రశంసం అందుకుంది. అటుపై కింగ్ నాగార్జున నాగ్ క్రష్ గా పేర్కొన్నారు. కుబేర సినిమాలో తానే పెద్ద స్టార్ అని నాగ్ అన్నారు. అలాగే మెగాస్టార్ చిరంజీవి కూడా రష్మిక విషయంలో ఎక్కడా తగ్గలేదు. రష్మిక నేషనల్ క్రష్ కాదని ఇంటర్నేషనల్ క్రష్ అని కితాబిచ్చారు. రష్మికను తొలి సినిమా నుంచి చూస్తు న్నాను తాను నటిస్తున్న పాత్రలను చాలా క్లోజ్ గా అబ్జర్వ్ చేస్తున్నట్లు తెలిపారు. సౌందర్యతో ఆమె నటన ను పోల్చారు. కళ్లతో నటించగల గొప్ప నటిగా కీర్తించారు. చిరంజీవే అంత పెద్ద మాట అన్నారంటే? టాలీవుడ్ లో రష్మిక స్థానం గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది.

## బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?

ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. డీజే దువ్వాడ జగన్నాథంమూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం%-% వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్



ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల రెట్రోతోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది.

ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ కాంచన 4లో నటిస్తోంది. కాంచన ఫ్రాంచైజీలో భాగంగా రాఘవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.




# ఒక ఫ్యామిలీ సొంతింటి కల.. సిద్ధార్థ్ 3 బి.హెచ్.కె ట్రైలర్ టాక్..!




బొమ్మరిల్లు సిద్ధార్థ్ నుంచి వస్తున్న మరో ఎమోషనల్ రైడ్ లాంటి మూవీ 3 బి.హెచ్.కె. శ్రీ గణేష్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో సిద్ధార్థ్ లీడ్ రోల్ లో నటించగా శరత్ కుమార్, మితిక రఘునాథ్, దేవయాని ఇంపార్టెంట్ రోల్స్ పోషించారు. శాంతి టాకీస్ బ్యానర్ లో అరుణ్ విశ్వ ఈ సినిమా నిర్మించారు. ఈ సినిమాను తెలుగులో మైత్రి మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తున్నారు. జూలై 4న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు మేకర్స్. 3 బి.హెచ్.కె ట్రైలర్ చూస్తే ఒక మధ్యతరగతి ఫ్యామిలీ సొంతిల్లు పొందేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా వారు పొందే అనుభూతులు చూపించారు. తల్లి తండ్రి కొడుకు కూతురు.. ఆ తండ్రికి సొంతిల్లు ఉండాలన్న కల. అతని చాలి చాలని జీతం ఆ కల నెరవేర్చలేదు. ఆ టైం లో కొడుకు కూడా కష్టపడాలని అనుకుంటాడు. కానీ అతనికి చదువు అబ్బదు. ఏదో ఒకటి చేసి నాన్న సొంతింటి కల నెరవేర్చాలని అనుకుంటాడు. మరోపక్క ఆ ఇంటి ఆడబిడ్డ కూడా నాన్న కల కోసం జాబ్ చేస్తుంది. ఇలా ఒక తండ్రి సొంతింటి కల కోసం ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ చేసిన జీవన యుద్ధాన్ని 3 బి.హెచ్.కె సినిమాలో చూపించనున్నారు. ట్రైలర్ లోనే కథ చెప్పేసిన దర్శకుడు కచ్చితంగా సినిమాను ఒక ఎమోషనల్ రైడ్ గా తీసుకెళ్లాడని అనిపిస్తుంది. మహావీరుడు సినిమాను డైరెక్ట్ చేసి సక్సెస్ పొందిన డైరెక్టర్ సాయి గణేష్ మరో ఫ్యామిలీ మూవీ అది కూడా సొంతింటి కల అనే కథాంశంతో వస్తున్నాడు. సినిమా ట్రైలర్ అయితే ఇంప్రెసివ్ గా ఉంది. మరి సినిమా ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తుంది అన్నది చూడాలి. శ్రీ గణేష్ ఈ కథ ద్వారా ఒక మధ్య తరగతి వ్యక్తి తన సొంతింటి కల కోసం ఎంతగా కష్టపడతాడు అన్నది చూపించాడు. మిడిల్ క్లాస్ ఎమోషన్స్ ని టచ్ చేయగలిగితే మాత్రం ఈ సినిమా చాలా గొప్ప విజయాన్ని అందుకునే అవకాశం ఉంటుంది. ఐతే ట్రైలర్ లో కథ చెప్పిన దర్శకుడు తన కథనం ద్వారా ప్రేక్షకులను మరింత రంజింపచేయాల్సి ఉంటుంది.

# వార్ 2 ముందున్న సవాళ్ళు.. అంత ఈజీ కాదు..



ఇండియన్ యాక్షన్ యూనివర్స్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ 'వార్ 2'. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్‌ల కాంబినేషన్‌కు ఇదే తొలి సినిమా కావడం, బాలీవుడ్ టాలీవుడ్ స్టార్ హీరోలు స్క్రీన్ షేర్ చేసుకోవడం వంటి అంశాలు భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కానీ రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా ఇప్పటిదాకా ప్రమోషన్లు మొదలవ్వకపోవడంతో ఫ్యాన్స్ లో కొంత అసంతృప్తి అయితే ఉంది. ఇదే విషయమే ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చగా మారింది. హృతిక్ గాయం కారణంగా తీసుకున్న విరామం ఈ సినిమాకు పెద్దగా అడ్డంకిగా మారింది. తారక్, హృతిక్ కాంబినేషన్‌లో చిత్రీకరించాల్సిన పాటలు ఇంకా మిగిలివుండడంతో మొత్తం షూటింగ్ ఇంకా పూర్తవ్వలేదు. టీజర్ అప్డేట్ విషయం పక్కన పెడితే.. అసలు ఫస్ట్ లుక్ పోస్టర్ అయినా వదిలుంటే ఓ లెవెల్ బజ్ వచ్చేది. కానీ డెడ్ లైన్ దగ్గరపడుతున్నా ఈ విషయంలో యష్ రాజ్ ఫిలింస్ అలసత్వం చూపుతోంది. ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్లు ఇద్దరూ కలిపి ఎదురు చూస్తున్న సమయంలో ఎలాంటి అప్డేట్ రివీల్ చేయకపోవడం వింతగా మారుతోంది. ఇదిలా ఉండగా, వార్ 2 తెలుగు, తమిళ వర్షన్ హక్కులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పలు టాప్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఇప్పటికే భారీ బిడ్లు వేస్తున్నాయని సమాచారం. అయితే యష్ రాజ్ బేనర్ మాత్రం ఇప్పట్లో డీల్స్ క్లోస్ చేయడం లేదట. సరిగ్గా టీజర్ రిలీజ్ టైమ్ దగ్గరే రెస్పాన్స్ బేస్డ్ వ్యూహంతో ముందుకెళ్లాలని చూస్తున్నారు. ఇది పాజిటివ్ స్ట్రాటజీ అయినప్పటికీ, ప్రస్తుతం పోటీ బాగా పెరిగిపోవడం వల్ల మరింత ఒత్తిడి పడుతోంది. అదే సమయంలో రజనీకాంత్ 'కూలి' పోస్ట్ ప్రొడక్షన్ ఫుల్ స్పీడ్‌లో జరుగుతోంది. షూటింగ్ ఎప్పుడో పూర్తయింది, టీజర్ బ్లాస్ట్ చేసింది. రిలీజ్ డేట్ కన్ఫర్మ్ అయింది. ఇది వార్ 2 టీంకు ఎదురులేని మెసేజ్‌లాంటిది. రెడీ కావడంలో కూలి ముందుండటం నిజంగానే ఆందోళనకరం.. వార్ 2 రిలీజ్ డేట్ మాత్రం మార్చే ప్రసక్తే లేదని డిస్ట్రిబ్యూషన్ వర్గాలు చెబుతున్నాయి. జూన్ చివరినుండి ప్రమోషన్ కార్యక్రమాలు స్టార్ట్ చేయాలని యష్ రాజ్ ప్రణాళిక వేసింది. రాజమౌళి తరహాలో దేశం చుట్టే ప్రమోషన్లు జరపాలని చూస్తున్నారు. ప్రత్యేకంగా తారక్‌కు కూడా బ్రేక్ ఇచ్చి ఆ ప్రచారాల్లో భాగం అయ్యేలా ప్లాన్ ఉంది. ఐతే ఓ విషయం క్లియర్.. ఈ సినిమాలో బహుశా ఎలాంటి స్పెషల్ క్యామియోలు ఉండబోవు. మొదటి నుంచే దాగుడుమూతల మధ్య సాగిన ప్రచారానికి ఈ క్లారిటీ కొంతవరకు నిరాశ కలిగించే అంశం కావచ్చు. మొత్తానికి క్రేజ్ ఉన్నా.. కంటెంట్ గురించి క్లారిటీ లేకపోవడం, ప్రమోషన్ ఆలస్యం, బిజినెస్ డీల్స్ మళ్లింపులు అన్నీ కలిపి వార్ 2 యూనిట్‌ను గట్టిగా పరీక్షిస్తున్నాయి. మరి ఈ చాలెంజ్ లను ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

# సన్నని నడుములో శ్రియా లెహంగా హొయలు

సినిమా రంగంలో తన నటనతో ఎంతగానో మెప్పించిన శ్రియా శరణ్... ఇప్పుడు ఫ్యాషన్ రంగంలోనూ అదరగొడుతోంది. ఇటీవల ప్రముఖ డిజైనర్ లేబుల్ కోసం ఆమె చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మాలిబులో గార్డెన్ ఆఫ్ ఈడెన్ కలెక్షన్‌కి చెందిన ప్యాస్టెల్ బ్లూ కలర్ లెహంగా లుక్‌లో ఆమె ఎటువంటి సందేహాలకూ తావు లేకుండా గ్లామర్‌కు కొత్త నిర్వచనం ఇచ్చింది. మృదువైన రంగులు, ఆకర్షించే డిజైన్, శ్రియా నడుమున మెరిసే ఆ హావభావాలు... అన్నీ కలగలిపి ఈ లుక్‌ను అద్భుతంగా మార్చేశాయి. ఈ లుక్‌లో కనిపించిన శ్రియా లెహంగా లైట్ బ్లూ షేడ్స్‌తో నాజూకుగా ఉంది. మెరుస్తున్న బ్లౌజు డిజైన్, మ్యాచ్ అయిన స్కర్ట్‌పై ఉన్న నాజూకు పువ్వుల ఎంబ్రాయిడరీ... ఆమెను ఒక ఫెయిరీటేల్ ప్రిన్సెస్‌లా



చూపించింది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న జుమ్కాలు, మృదువైన హెయిర్‌స్టైల్ మరింత అందాన్ని జోడించాయి. సోషల్ మీడియాలో ఈ లుక్‌కి అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. శ్రియా శరణ్ కెరీర్ విషయానికి వస్తే, ఆమె దక్షిణాది సినీ ఇండస్ట్రీలోనే కాదు, బాలీవుడ్‌లోను తన ప్రత్యేకతను చాటుకుంది. 'శివాజీ'లో రజనీకాంత్‌కు జోడిగా, 'గౌతమిపుత్ర శాతకర్ణి'లో బాలకృష్ణ సరసన, అలాగే హిందీలో 'దృశ్యం' సిరీస్‌లో అజయ్ దేవగన్‌కి భార్యగా ఆకట్టుకున్నారు. ఇటీవలి కాలంలోనూ ఆమె '%===%' వంటి పాన్ ఇండియా ప్రాజెక్టుల్లోనూ కనిపిస్తూ, స్టార్డమ్‌ను కొనసాగిస్తూ వస్తోంది. తన కెరీర్‌కి తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్నా కూడా, శ్రియా సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండి... ప్రతి లుక్‌తోనూ ట్రెండ్ సెట్ చేస్తోంది. ఆమె గ్లామర్‌ను చూస్తే వయస్సు కేవలం ఒక నెంబర్ అనిపిస్తుంది. ఈ ఫోటోషూట్‌లోనూ ఆమె కామ్‌బినేషన్ ఫియర్‌లెస్ ఫ్యాషన్‌ను స్పష్టంగా చూపించింది. ప్రస్తుతం శ్రియా కొన్ని తమిళ, హిందీ సినిమాల్లో నటిస్తోంది. మరోవైపు యాడ్స్, ఫ్యాషన్ ఫోటోషూట్‌లతోనూ బిజీగా ఉంది.

# ఎట్టకేలకు ఫరియా ఫిక్స్ చేసిందా?

జాతి రత్నాలు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా ఆ సినిమాతో మంచి హిట్ ను అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ఆఖరిగా మత్తు వదలరా2 లో కనిపించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఆ తర్వాత ఫరియా నుంచి మరో సినిమా వచ్చింది లేదు. అయితే తాజాగా ఇప్పుడు ఫరియా ఇన్‌స్టాగ్రమ్ లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. ఫరియా ఓ ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన ఓ టీజర్ ను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ది టైటిల్ ఈజ్ హిజ్ నేమ్, అతని ఆటకు రెడీ గా ఉండు. మ్యాడ్‌నెస్



స్టార్ట్ కానుందంటూ ఆ పోస్టర్ కింద రాసి ఉంది. %వీజీవీ% మోషన్ పిక్చర్స్, బురా, సద్ది క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్లు ఆ సినిమాను సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. అమర్ బురా, జయకాంత్, వేణు సిద్ది ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా నటిస్తున్నానని డైరెక్ట్ గా చెప్పకపోయినప్పటికీ ఆ టీజర్ ను ఆమె షేర్ చేయడం వెనుక ఉద్దేశం అదే అని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సంవత్సరం తర్వాత ఫరియా సినిమా ఓకే చేసిందని, ఈ ప్రాజెక్టుతోనే ఫరియా మళ్లీ స్క్రీన్ పైకి రానుందని వారు భావిస్తున్నారు. ఫరియా షేర్ చేసిన ఆ టీజర్ డార్క్ కామెడీ మూవీ అని తెలుస్తోంది. ఫరియా పోస్ట్ ఆమె కంబ్యాక్ ను సూచిస్తే, తెలుగు మూవీ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ టైమ్ లో ఆమె కూడా ఒక అధ్యాయంలోకి అడుగుపెట్టినట్టే అవుతుంది. మరి ఈ సినిమా అయినా ఫరియాకు మంచి హిట్ ను అందించి, తనను బిజీ ఆర్టిస్టుగా మారుస్తుందేమో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536